సంపుటి : 78 సంచిక : 40 పుటలు : 52

జాగృతి

కలి 5128 - శ్రీ పరాభవ ఆషాఢ శుద్ధ షష్ఠి
20-26 జూలై 2026
వెల : ₹20/-

మతోన్మాదులకు మరణదండన

కలియుగ రావణుడు

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా https://payit.cc/SYBqNRG267 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

భారతీయ సాహితీ ద్రష్ట
భండారు సదాశివరావుగారి స్మారక
కథల పోటీ-2026

జాగృతి వారపత్రిక దీపావళి సందర్భంగా ప్రఖ్యాత సాహితీవేత్త స్వర్గీయ భండారు సదాశివరావు గారి స్మారక 'కథల పోటీ' నిర్వహిస్తున్నది. రచయితలకు ఆహ్వానం..

ప్రథమ బహుమతి : రూ. 12000/-
ద్వితీయ బహుమతి : రూ. 7000/-
తృతీయ బహుమతి : రూ. 5000/-

నిబంధనలు :

1. సమకాలీనం, చారిత్రకం, సైన్స్ ఫిక్షన్ ఇతివృత్తంతో కూడిన కథలను పంపవచ్చు. భారతీయ సామాజిక జీవనమే నేపథ్యంగా ఉండాలి. సాధ్యమైనంత వరకు ఆంగ్ల పదాలను పరిహరించండి.
2. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు ఎనిమిది కథలకు రూ.1,000 చొప్పున ప్రోత్సాహక బహుమతులు, సాధారణ ప్రచురణకు స్వీకరించిన ప్రతి కథకు పారితోషికం ఉంటుంది.
3. కథ నిడివి 1500 పదాలకు మించరాదు. ఒక రచయిత 2 కథలకు మించి పంపరాదు.
4. కథ స్వంతమేనని, అనువాదం, అనుసరణ కాదని, బ్లాగుల్లోనూ, వెబ్ పత్రికల్లోనూ మరెక్కడా ప్రచురితం, ప్రసారం కాలేదని; పరిశీలనలో లేదని విడిగా హామీపత్రం జతచేయాలి. హామీపత్రంలో రచయిత పేరు, చిరునామా, ఇ-మెయిల్ ఐడి, ఫోన్ నంబర్ తప్పక రాయండి. కథ రాసిన పుటలలో ఎక్కడా రచయిత పేరు గానీ, ఇతర వివరాలేవి ఉండరాదు.
5. కథలను తెలుగులో అను లేదా యూనికోడ్ ఫాంట్‌లో డిటిపి చేసి jagriticompetition@gmail.com కు మెయిల్ చేయాలి.
6. పోస్టు లేదా కొరియర్ ద్వారా పంపాలనుకుంటే 'కథల పోటీ' జాగృతి వారపత్రిక, 3-4-228/4/1, జాగృతి భవన్, కాచిగూడ, హైదరాబాద్-500027 కు పంపొచ్చు. జాగృతికి కథల్ని చేర్చే బాధ్యత రచయితలదే.
7. కథల ఎంపికలో ఉత్తర, ప్రత్యుత్తరాలకు తావులేదు. తుది నిర్ణయం న్యాయ నిర్ణేతలదే.
8. ఈ కథలను దీపావళి సంచిక నుంచి ఆరంభించి, వరుసగా ప్రచురిస్తాం.

కథలు జాగృతికి చేరడానికి చివరి తేది : 22 ఆగస్టు, 2026

కీర్తిశేషులు శ్రీ వడ్లమూడి రామమోహనరావు 1985 నుంచి
2007 వరకు 22 సంవత్సరాలు జాగృతి వారపత్రిక సంపాదకుడిగా
విశిష్ట సేవలు అందించిన ధన్యజీవి.

జాగృతి ఆధ్వర్యంలో

స్వర్గీయ వడ్లమూడి రామమోహనరావు స్మారక

'నవలల పోటీ- 2026'

రచనలను ఆహ్వానిస్తున్నాం..

ప్రథమ బహుమతి
రూ. 25,000

ద్వితీయ బహుమతి
రూ. 20,000

సూచనలు :

- ఇతివృత్తం భారతీయ జీవన విధానానికి, విలువలకు అద్దం పట్టేదిగా ఉండాలి. సామాజిక, చారిత్రక, పౌరాణిక అంశాలను స్వీకరించవచ్చు. వ్యావహారిక భాషలోనే ఉండాలి.
- నవల 125-150 (ఎ4, 15 పాయింట్) పేజీలకు మించరాదు.
- సాధ్యమైనంతవరకు డీటీపీ చేయించిన రచనలనే, పోస్ట్ ద్వారా మాత్రమే పంపాలి. రాతప్రతులైతే చక్కని దస్తూరితో, ఒక్క కొట్టివేత కూడా ఉండరాదు.
- నవల మీద రచయిత పేరు ఉండరాదు. విడిగా హామీపత్రంలో పూర్తి చిరునామా, మొబైల్ నంబర్ సహా రాయాలి. రచన తమ సొంతమని, అనువాదం, అనుసరణ కాదని, ఎక్కడా ప్రచురితం, ప్రసారం కాలేదని హామీ ఇవ్వాలి.
- ఎంపిక విషయంలో తుది నిర్ణయం న్యాయనిర్ణేతలదే. ఉత్తర, ప్రత్యుత్తరాలకు తావు లేదు.

నవలలు పంపవలసిన చిరునామా : 3-4-228/4/1, జాగృతిభవన్, లింగంపల్లి, కాచిగూడ, హైదరాబాద్- 500027.

నవలలు మాకు చేరవలసిన ఆఖరి తేదీ : 07 సెప్టెంబర్, 2026

Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Pvt. Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. and published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.
Managing Editor : Kurra Durga Reddy.

సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు,
వ్యాపార ప్రకటనల వివరాల కోసం
(ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య) సంప్రదించండి.

ఎం. శ్రీనివాస్ : సర్క్యులేషన్ ఇన్‌చార్జ్
040-27561453 / 9959997013

సంపాదక మండలితో సంప్రదింపుల కోసం
9959991304
(ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య)

డిజైనర్ : చిగుళ్ల కుమార్

చందాదారులకి గమనిక

చందాలను ఎవ్వరికి వ్యక్తిగతంగా చెల్లించవద్దు. మీ దగ్గరకు వచ్చే బల్క్ మెంబర్లకు (కార్యకర్తలకు) మాత్రమే చెల్లించి రసీదు తీసుకోగలరు. లేదా కింద ఇచ్చిన అకౌంట్ ద్వారా చెల్లించగలరు.

ఫోన్ పే, గూగుల్ పే నుండి చెల్లించడానికి జాగృతి అకౌంట్ "To Bank / UPID" ఆప్షన్ వాడండి.

Link / QR Code ద్వారా మీ చందా చెల్లించినప్పుడు Remarks దగ్గర కట్టించిన కార్యకర్త పేరు ఫోన్ నెం. తప్పకుండా రాయించండి.

విడి ప్రతి రూ.20

5 సం॥ల చందా రూ.4000 **సంవత్సర చందా రూ.850**

జాగృతి వారపత్రికను **'మ్యాగజైన్ పోస్ట్'** ద్వారా పొందుటకు: **రూ.1,474 (850+624)**

బ్యాంకు ఖాతా వివరాలు

A/c Name & No. Jagriti Prakashan Trust, 920010061405325, Axis Bank, Kothapet Branch.
IFSC : UTIB0002157, PAN : AAATJ3829L

- సర్క్యులేషన్ ఇన్‌చార్జ్, జాగృతి

ఒక వ్యక్తి శారీరకంగా, మానసికంగా, ఇరుగు పొరుగువారితో మంచి సంబంధాలు కలిగి ఉండాలని ఆరోగ్యకరమైన మానవుని గురించి ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్వచిస్తున్నది. ఇదే దేశానికి కూడా వర్తిస్తుంది.

ప్రస్తుత ప్రపంచీకరణ యుగంలో ఏ దేశ ప్రగతి అయినా కేవలం దాని అంతర్గత విధానాలపైనే కాకుండా ప్రపంచ దేశాలతో దాని సంబంధాలు ఎలా ఉన్నాయనే దానిపైన కూడా ఆధారపడి ఉంటుంది. గత దశాబ్దకాలంలో భారత్ విదేశాంగ విధానంలో అపూర్వమైన వేగం, చైతన్యం కనిపించింది. అయితే ప్రధాని మోదీ నిరంతర విదేశీ పర్యటనలు తరచుగా దేశ రాజకీయాల్లో చర్చనీయాంశమయ్యాయి. ఒకవైపు ప్రతిపక్షాలు ఈ పర్యటనల ఔచిత్యాన్ని ఆర్థిక ఖర్చులను ప్రశ్నిస్తుంటే, మరోవైపు వ్యూహాత్మక నిపుణులు దీనిని భారత్ క్రియాశీల దౌత్యపు 'స్వర్ణయుగం'గా భావిస్తున్నారు.

ప్రపంచ భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ఆర్థిక మాంద్యం, సాంకేతిక మార్పులగుండా పయనిస్తున్న నేపథ్యంలో, ఈ పర్యటనల ద్వారా భారత్‌కు నిజంగా ఏమి లాభించిందనేది సమీక్షించుకోవడం అవసరం. ఇవి కేవలం అధికారిక సమావేశాలేనా? లేదా వీటివల్ల మన దేశానికి దీర్ఘకాలిక, వ్యూహాత్మక, ఆర్థిక ప్రయోజనం ఏదైనా చేకూరిందా? మోదీ ప్రభుత్వం దౌత్యాన్ని నేరుగా దేశ ఆర్థికరంగంతో ముడిపెట్టింది. ప్రపంచంలోని ప్రముఖ ఆర్థిక శక్తులైన అమెరికా, యూరప్ మొదలైన దేశాల పర్యటనలో మోదీ స్వయంగా అక్కడి అగ్రశ్రేణి సీఈఓలు, పెట్టుబడిదారులతో సమావేశమయ్యారు. ఫలితంగా భారత్‌లోకి రికార్డు స్థాయిలో విదేశీ పెట్టుబడులు వచ్చాయి. మేక్ ఇన్ ఇండియా, ఆత్మనిర్భర భారత్ వంటి ఆర్థిక విధానాలను ప్రపంచవేదికలపై ప్రమోట్ చేయడం ద్వారా ఆపిల్, మైక్రాన్ వంటి దిగ్గజ కంపెనీలు భారత్‌లో తమ ఉత్పాదక యూనిట్లు ప్రారంభించేందుకు ఆసక్తి చూపాయి.

మోదీ దౌత్యం భారత్‌కు ప్రపంచ అగ్రరాజ్యాల మధ్య ఒక ప్రత్యేకమైన సమతుల్య స్థానాన్ని తెచ్చిపెట్టిందనడంలో సందేహం లేదు. పొరుగుదేశాలకే మొదటి ప్రాధాన్యత

శాలివాహన 1948 శ్రీ పరాభవ ఆషాఢ శుద్ధ షష్ఠి

లోపలి పేజీలలో...

6లో

ముఖపత్ర కథనం

మతోన్మాదులకు మరణదండన

ధారావాహిక నవల

45 **గణపతిదేవుడు**

- మత్తి భానుమూర్తి

20లో

రక్షణ

భారత 'జలాంతర్గామి శక్తి'కి పాక్ సవాలు?

26లో

జాగృతి

సంపాదకీయం

విధానంతోపాటు గల్ఫ్ దేశాలతో సంబంధాలను పూర్తిగా మార్చివేయడం ఈ దౌత్యంలోనే అతిపెద్ద విజయాలలో ఒకటి. ఇంధన భద్రతను బలోపేతం చేసింది మోదీ దౌత్యం. రష్యా, ఆఫ్రికా దేశాల పర్యటనలు భారతీయ ఇంధన వనరులను వైవిధ్యభరితం చేసాయి. దీనితో ప్రపంచ మార్కెట్లో చమురు ధరలు హెచ్చుతగ్గులవల్ల అన్ని దేశాల ఆర్థిక వ్యవస్థలు అతలాకుతలం అవుతుంటే మన దేశం సురక్షితంగా ఉంది. బ్రిటన్‌తో కలసి వన్ సన్, వన్ వరల్డ్, వన్ గ్రిడ్ చొరవను ప్రారంభించడం ద్వారా భారత్ ప్రపంచ వాతావరణ దౌత్యంలో అగ్రగామిగా నిలిచింది.

విశ్వవేదికపై భారత్ ప్రభావం

ఈ నెల 6-11 తేదీ వరకు మోదీ జరిపిన ఇండోనేషియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ పర్యటన ద్వారా మనకు రక్షణ, భద్రతా సహకారం, కీలక ఖనిజాల సరఫరా, ఇండో - ఫసిఫిక్ ప్రాంతంలో వ్యూహాత్మక భాగస్వామ్య వ్యాపారం, సాంకేతికత, విద్య, సముద్రతీర భద్రత వంటి పలు రంగాలలో అత్యంత కీలకమైన ఒప్పందాలు కుదరడం గొప్ప పరిణామం. అంతేకాదు ఈ విశేష దౌత్య పర్యటన భారత్ 'యాక్ట్ ఈస్ట్' విధానానికి సరికొత్త శక్తినివ్వడమే కాకుండా ఇండో-ఫసిఫిక్ ప్రాంతంతో భారత్‌ను ఒక 'నెట్ సెక్యూరిటీ ప్రొవైడర్' (రక్షణ కల్పించే ప్రధాన దేశం)గా, ఆర్థికశక్తిగా నిలబెట్టింది. ఈ పర్యటన కేవలం - కొన్ని ఒప్పందాలకో, దైపాక్షిక సమావేశాలకో పరిమితం కాలేదు. భారత్ సుదూర వ్యూహాత్మక దృక్పథమైన విజన్ మహాసాగర్ అమలుకు శ్రీకారంగా దీనిని మనం భావించాలి. ఇండోనేషియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాలు ఇండో-ఫసిఫిక్ ప్రాంతంలోని సముద్ర భౌగోళిక సరిహద్దులలో ఉన్నాయి. ఇక్కడ నుండి భారత్‌లో మూడింట రెండువంతుల వ్యాపారం, ఇంధన మార్గాలు ప్రయాణిస్తాయి. ఈ పర్యటన ద్వారా భారత్ రక్షణ ఎగుమతులు, కీలక ఖనిజాల భద్రత, అణుఇంధన కొత్త మార్గాలు, స్వేచ్ఛావాణిజ్య ఒప్పందాల వంటి బలమైన వ్యూహాన్ని సిద్ధంచేసింది. ఇది రాబోయే దశాబ్దాలలో భారతదేశాన్ని 55 లక్షల కోట్ల రూపాయల ఆర్థిక వ్యవస్థ కంటే ముందుకు తీసుకెళ్లి, గొప్ప అభివృద్ధి చెందిన దేశంగా మారుస్తుందనడంలో అతిశయోక్తి లేదు.

ప్రధానమంత్రి ఒక వ్యక్తి కాదు, ఒక వ్యవస్థ. నిరంతర పర్యటనలు, వ్యక్తిగత సంబంధాల కారణంగా ప్రపంచవేదికలపై భారత్ గౌరవ, ప్రతిష్ఠలు గణనీయంగా పెరిగాయి. మన దేశాన్ని ఇపుడు అంతర్జాతీయ సమస్యలలో భాగంగా కాకుండా ఆ సమస్యలకు పరిష్కారంగా చూస్తున్నారు. భారత్ నేతృత్వంలో జి-20 అధ్యక్ష బాధ్యతలు విజయవంతంగా నిర్వహించడం, అందులో అభివృద్ధి చెందుతున్న దేశాలు (గ్లోబల్ సౌత్) తమ స్వరాన్ని బలంగా వినిపించడం ప్రధానమంత్రి ప్రపంచ యోగ్యతకు నిలువెత్తు నిదర్శనం- ఆఫ్రికన్ యూనియన్‌ను జి-20లో శాశ్వత సభ్యునిగా చేర్చడం భారత్ దౌత్య నైపుణ్యానికి అద్దం పడుతుంది. యూఎన్ఓలో జూన్ 21వ తేదీని అంతర్జాతీయ యోగా దినోత్సవంగా గుర్తింపు తీసుకురావడం, ఆయుర్వేదాన్ని విశ్వవ్యాపితంగా ప్రచారం చేసి, ప్రోత్సహించడం, ముఖ్యంగా ప్రపంచంలోని వివిధ దేశాలలో ఉన్న భారతీయుల హృదయాలను తట్టిలేపి వారందరినీ దేశ ప్రగతితో ముడిపెట్టడం మొదలైనవన్నీ భారతదేశ సాంస్కృతిక ముద్రను, సాఫ్ట్‌పవర్‌ను ప్రపంచవ్యాప్తంగా ఎంతో ఉన్నత స్థానానికి తీసుకెళ్లాయి. 'వికసిత భారత్' దిశగా అడుగులేస్తున్న మనకు వీటన్నిటినీ శుభపరిణామాలుగా ఆశిద్దాం. ★

40లో

కథ

ఆ ఆనందమే కావాలి

- క్రిష్ణపాటి సీతారామశాస్త్రి



హిందూ ధర్మంపై 'విద్వేషపు' పడగ (ముఖపత్ర కథనం)	-	08
కలియుగ రావణుడు (ముఖపత్ర కథనం)	-	10
విపక్షాల చోరీ రాజకీయాలు (సత్యపీఠం)	-	12
వ్యూహాత్మక దౌత్యంలో తిరుగులేని భారత్! (అంతర్జాతీయం)	-	24
కనిపించని ఆర్థిక 'శక్తి' (మహిళ)	-	28
వందేళ్ల ఆరవీడు వంశ పాలన (గళమెత్తిన గతం)	-	30
ఉన్మాది ఘాతుకం..'పోక్సో' దర్యాప్తుపై సందేహాలు (తెలంగాణ)	-	32
పేరు ప్రతిష్ఠలకు దూరంగా శాస్త్రిగారు (ఆర్ఎస్ఎస్-100)	-	34
'నీలిమేఘాలలో...' సుస్వరం లీనం (నివాళి)	-	37
ప్రపంచకప్ చరిత్రలో ఆ నలుగురు! (క్రీడ)	-	43
భారత సైనికుల విజయగర్జన (యువవాణి)	-	44
కథకు,పేరుకు సంబంధంలేని 'లెనిన్' (సినిమా)	-	50

మతోన్మాదులకు

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 2008 నాటి అహ్మదాబాద్ వరుస పేలుళ్ల కేసులో 38 మందికి ఉరిశిక్షకు, 11 మందికి జీవిత ఖైదు విధిస్తూ సిటీ సెషన్స్ కోర్టు ఇచ్చిన తీర్పును గుజరాత్ హైకోర్టు జూలై ఏడవ తేదీన సమర్థించింది. దేశంలోని అత్యంత సుదీర్ఘమైన, సంక్లిష్టమైన ఉగ్రవాద విచారణలలో ఒకదానిని చట్టపరమైన ముగింపునకు చేరువ చేసింది. అయితే ఆ తర్వాత నిందితులు సుప్రీంకోర్టులో అప్పీలు చేసుకునేందుకు వ్యవధి కోరారు. దీనిని దృష్టిలో ఉంచుకొని తన తీర్పు అమలుపై మూడు నెలల స్టేను హైకోర్టు విధించింది. ఈ మూడు నెలల వ్యవధిలో తాను ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టులో సవాలు చేసుకోవడానికి నిందితులకు అవకాశం ఇచ్చింది.

జూలై 26, 2008న 70 నిమిషాల వ్యవధిలో అహ్మదాబాద్‌లో సివిల్ ఆసుపత్రి, ఎల్జీ ఆసుపత్రి, బస్సులు, నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనాలు, కార్లు సహా 22 చోట్ల వరుస బాంబు పేలుళ్లు సంభవించాయి. ఈ పేలుళ్లలో 56 మంది మరణించగా, మరో 200 మంది గాయపడ్డారు. ఈ కేసులో కింది కోర్టు ఇచ్చిన తీర్పును జస్టిస్ ఏవై కోగ్జే, జస్టిస్ సమీర్ దవేలతో కూడిన హైకోర్టు ధర్మాసనం సమర్థించింది. దిగువ కోర్టు తీర్పునకు వ్యతిరేకంగా దాఖలైన అన్ని అప్పీళ్లను తిరస్కరించింది. ఈ కేసులో ఉగ్రవాద సంస్థ ఇండియన్ ముజాహిదీన్(ఐఎం)సభ్యులకు విధించిన శిక్షలను ధ్రువీకరిస్తూ ఇచ్చిన తీర్పును సమర్థించింది. మార్చి 30, 2027లోగా మృతుల కుటుంబాలకు రూ. 10 లక్షలు చొప్పున, గాయపడిన వారికి రూ. 5 లక్షలు చొప్పున పరిహారం చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. దోషులుగా తేలినవారిలో స్టూడెంట్స్ ఇస్లామిక్ మూవ్‌మెంట్ ఇన్ ఇండియా(సిమి) పూర్వ నాయకుడు సఫ్దర్ నాగోరి సహా గుజరాత్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, తెలంగాణ సహా 11 రాష్ట్రాలకు చెందిన అతడి సహచరులు ఉన్నారు. ఈ వరుస పేలుళ్ల కేసులో మొత్తం 78 మందిని నిందితులుగా దర్యాప్తు అధికారులు పేర్కొన్నారు. 2002 గోద్రా అనంతర అల్లర్లకు ప్రతీకారం తీర్చుకోవడానికి సిమితో సంబంధం ఉన్న ఐఎం సభ్యులే ఈ వరుస పేలుళ్లకు పాల్పడ్డారని పోలీసులు పేర్కొన్నారు. అయితే ఫిబ్రవరి 8, 2022న నిందితులలో 49 మందిని దోషులుగా, 28 మందిని నిర్దోషులుగా అహ్మదాబాద్ సిటీ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ఏఆర్ పటేల్ నిర్ధారించారు. కేసులో 28 మందిని విడుదల చేశారు. దోషులలో ఒక వ్యక్తి అప్రూవర్‌గా మారాడు. ఫిబ్రవరి 18, 2022న తీర్పు వెలువరించారు. ఉగ్రవాద కార్యకలాపాల నివారణ చట్టం(ఉపా), భారత శిక్షాస్మృతిలోని 302 సెక్షన్ కింద 38 మందికి మరణ శిక్ష విధించారు. 11 మందికి సహజ మరణం సంభవించేవరకు యావజ్జీవ కారాగార శిక్ష విధించారు. 48 మంది దోషులకు రూ. 2.85 లక్షలు, ఒక దోషికి రూ. 2.88 లక్షల జరిమానా విధించారు. దిగువ న్యాయస్థానం ఇచ్చిన తీర్పును దోషులు హైకోర్టులో సవాల్ చేశారు. అదే సమయంలో దోషుల శిక్షను ధ్రువీకరించాలని కోరుతూ హైకోర్టును గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వం ఆశ్రయించింది. దోషులకు వ్యతిరేకంగా ఉన్న సాక్ష్యాధారాలు అన్నింటిని విచారణ సమయంలో హైకోర్టు ముందు ఉంచింది. హైకోర్టు ఈ కేసును ఒకటిన్నర సంవత్సరాలకు పైగా విస్తృతంగా విచారించిందని, ఫిబ్రవరి, 2026 నుంచి రోజువారీగా విచారణ జరిపిందని ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ అమిత్ పటేల్ తెలిపారు.

ఒకే కేసులో అత్యధికులకు మరణశిక్ష

ఒకే కేసులో ఇంత పెద్ద సంఖ్యలో దోషులకు మరణశిక్ష విధించడం దేశ న్యాయస్థానాల చరిత్రలో ఇదే మొదటిసారి. అంతకుముందు 1991లో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ హత్య కేసుకు సంబంధించి జనవరి, 1998లో కేసులో 26 మంది దోషులకు తమిళనాడులో టాడా కోర్టు మరణశిక్ష విధించింది. ఆ తర్వాత వరుస పేలుళ్ల కేసులో 38 మందికి అహ్మదాబాద్ సెషన్స్ కోర్టు మరణశిక్ష విధించింది.

జైలులో సొరంగం ద్వారా తప్పించుకునే కుట్ర

ఈ కేసు విచారణ సమయంలో ఒక నాటకీయ పరిణామం చోటుచేసుకుంది. 2013లో సబర్మతీ సెంట్రల్ జైలులో ఉన్న కొందరు నిందితులు 18 అడుగుల పొడవైన సొరంగాన్ని తవ్వి తప్పించుకోవడానికి పన్నిన కుట్రను భద్రతా సంస్థలు బయట పెట్టాయి. తప్పించుకునే ప్రయత్నం జరగకముందే జైలు అధికారులు ఆ సొరంగాన్ని గుర్తించడంతో ఈ కుట్ర భగ్నమైంది.

దోషులలో మత గురువు, జర్నలిజం పట్టభద్రుడు, వ్యాపారి

ఉరిశిక్ష ఎదుర్కొంటున్న నిందితులలో ఒకడు సఫ్దర్ నాగోరి (ఉజ్జయిని). ఇతడు నిషేధిత సిమికి మాజీ అధిపతి. జర్నలిజంలో డిగ్రీ కలిగి ఉన్నారు. ఈ నెట్‌వర్క్‌కు "ప్రధాన నిర్వాహకుడి"గా గుర్తింపు పొందిన ఇతడు కేరళ, కర్ణాటకలలో ఉగ్రవాద శిక్షణ శిబిరాలను నిర్వహించాడు. మదర్సా ఉపాధ్యాయుడైన ముఫ్తీ అబూ బషీర్ (అజమ్‌గఢ్) ఈ నెట్‌వర్క్ వెనుక ఉన్న "సైద్ధాంతిక శక్తి"గా నిలిచాడు.ఖయాముద్దీన్ కపాడియా (వడోదర) వ్యాపారి, మార్కెటింగ్ ప్రొఫెషనల్‌గా పనిచేశాడు. గుజరాత్‌లో పేలుళ్లకు అవసరమైన సామాగ్రిని సాజిద్ మన్సూరి (భరూచ్) సమకూర్చాడు. గుజరాత్ మాడ్యూల్‌కు చెందిన జాహిద్ షేక్, ఇమ్రాన్ ఇబ్రహీం షేక్, ఇక్బాల్ ఖాసీం షేక్, షంషుద్దీన్ షాబుద్దీన్ షేక్, గ్యాసుద్దీన్ అబ్దుల్, అలీమ్ అన్సారీ, మహ్మద్ ఆరిఫ్ కాగ్జీ, యూనస్ మొహమ్మద్ భాయ్ మన్సూరి, అబ్బాస్ సమేజా, ఇస్మాయిల్ అహ్మద్ దుకాణాల్లో పనిచేసేవారు.

బాంబుల తయారీదారులు

మహారాష్ట్రకు చెందిన ఒక సాంకేతిక ముఠా ఈ బాంబులను తయారు చేసింది. ఇందులో పూణేకు చెందిన కంప్యూటర్, ఐటీ నిపుణుడు మహమ్మద్ అక్బర్ ఇస్మాయిల్ చౌధరి, ఆసిఫ్ హసన్ షేక్ ఉన్నారు. ముంబైకి చెందిన అష్ఫల్ ఉస్మానీ పేలుడు పదార్థాలతో నింపిన కారును అహ్మదాబాద్ సివిల్ హాస్పిటల్ ట్రామా సెంటర్ పార్కింగ్ స్థలంలోకి నడిపినట్లు ఆరోపణలు ఉన్నాయి. అంతకుముందు జరిగిన పేలుళ్ల కారణంగా బాధితులు, వైద్యులు, సహాయక సిబ్బంది ఆసుపత్రికి చేరుకున్న తర్వాత ఈ బాంబు పేలింది. ఈ ఘటనలో 37 మంది మరణించడంతో పాటు, నగర అత్యవసర ప్రతిస్పందన వ్యవస్థ స్తంభించిపోయింది. అతీక్-ఉర్-రెహమాన్ నేతృత్వంలోని రాజస్థాన్ ముఠాలో టైలర్ మెహందీహసన్ అన్సారీ, మధ్యప్రదేశ్‌కు చెందిన ఇమ్రాన్ అహ్మద్ ఉండగా, పోలీసులు మహమ్మద్ అలీని అరెస్టు చేశారు. వ్యాపారి అయిన ఖయాముద్దీన్ సోదరుడు రఫీయుద్దీన్ కపాడియాపై మందుగుండు సామాగ్రి నిల్వలను ఏర్పాటు చేసినట్లు ఆరోపణలు ఉండగా, స్థానిక మెకానిక్ అయిన మహమ్మద్ రఫిక్ అనేక బాంబులను తరలించడానికి సైకిళ్లను సమకూర్చాడు.

అహ్మదాబాద్‌లో బాంబుల ఫ్యాక్టరీ!

అహ్మదాబాద్‌లోని డాని లిమ్డా ప్రాంతంలో "బాంబు ఫ్యాక్టరీ"ని కనుగొన్నట్లు 2008లో జాయింట్ కమిషనర్ (క్రైమ్)గా దర్యాప్తునకు నేతృత్వం వహించిన మాజీ డీజీపీ ఆశిష్ భాటియా తెలిపారు. "అమ్మోనియం నైట్రేట్, ANFO అని

మరణదండన

పిలవబడే ఫ్యూయల్ ఆయిల్‌ను ఉపయోగించి వారు పేలుడు పదార్థాలను తయారు చేశారని మా దర్యాప్తులో వెల్లడైంది" అని భాటియా తెలిపారు.

ఉగ్రవాద విద్యార్థులు

ఉత్తరప్రదేశ్ నెట్‌వర్క్‌లో సైఫ్-ఉర్-రెహ్మాన్ అన్సారీ, మహమ్మద్ తస్వీర్ పఠాన్, జీషన్ అహ్మద్, జియా-ఉర్-రెహ్మాన్, మహమ్మద్ షకీల్, మహమ్మద్ ఆరిఫ్ మీర్జా, మహమ్మద్ సైఫ్ ఉన్నారు. వీరిలో చాలామంది విద్యార్థులు.ఆయుధాల సరఫరా వ్యవస్థను సమకూర్చడంలో వడోదరకు చెందిన అగర్‌బత్తీల వ్యాపారి మహమ్మద్ ఉస్మాన్ అగర్‌బత్తీవాలా సహకరించినట్లు తేలింది. ఈ కుట్రలో పాలుపంచుకున్న ఇతరులలో మధ్యప్రదేశ్‌కు చెందిన కమ్రుద్దీన్ అలియాస్ రాజా మహమ్మద్, ఆమిల్ పర్వాజ్ కంప్యూటర్ ఇంజనీరింగ్‌లో డిప్లొమా చేసిన షిబ్లీ అలియాస్ సాబిత్ అబ్దుల్ కరీమ్ ఉన్నారు.

తీర్పును స్వాగతించిన బాధిత కుటుంబాలు

జూలై 26, 2008న అహ్మదాబాద్ సివిల్ హాస్పిటల్ ట్రామా సెంటర్‌లో జరిగిన బాంబు పేలుళ్లలో తన తండ్రి దుష్యంత్, అన్నయ్య రోహన్‌లను కోల్పోయినప్పుడు యశ్ వ్యాస్ వయసు కేవలం ఎనిమిది ఏళ్లు. ఆయన స్వల్ప గాయాలతో బయటపడ్డారు. గుజరాత్ హైకోర్టు తీర్పును స్వాగతించారు. "ఈ తీర్పు సముచితమైనది. ఆ పేలుళ్లలో నా తండ్రి, నా అన్నయ్య, అనేకమంది మరణించారు" అని తెలిపారు. ఆయన తండ్రి ఆ ఆసుపత్రిలో ఉద్యోగిగా పనిచేసేవారు, మరణించిన సమయంలో విధి నిర్వహణలో ఉన్నారు. "అక్కడి ఖాళీ ప్రదేశంలో సైకిల్ తొక్కడం నేర్చుకోవడానికి మేమిద్దరం (వ్యాస్, రోహన్) మా తండ్రితో కలిసి వెళ్లాము. మేము ఇంటికి తిరిగి వెళ్లేందుకు సిద్ధమవుతుండగా, ఒక రోగిని ట్రామా సెంటర్‌కు చేర్చడంలో సహాయం కోరుతూ మా తండ్రికి ఒక ఫోన్ కాల్ వచ్చింది. మేము ఆ కేంద్రానికి చేరుకున్న సమయంలోనే పేలుడు సంభవించింది" అని వ్యాస్ తెలిపారు.

సివిల్ హాస్పిటల్‌లో జరిగిన బాంబు దాడిలో మరణించిన వారిలో జశ్వంత్ పటేల్ (59) కూడా ఉన్నారు. పటేల్ అసర్వా ప్రాంతంలో ఒక గ్యారేజీని నడిపేవారు. అహ్మదాబాద్ నగరంలోని వివిధ ప్రాంతాల్లో జరిగిన పేలుళ్ల బాధితులకు సహాయం చేయడానికి ఆయన అక్కడికి వెళ్లారు. ఆయన ఆసుపత్రి వద్ద ఉన్నప్పుడు ట్రామా సెంటర్ ముందు ఒక పేలుడు సంభవించింది. ఆయన కుమారుడు అమ్రిష్ (49) అదే గ్యారేజీని నడుపుతున్నారు. ప్రస్తుతం నగరంలోని వస్త్రాపూర్ ప్రాంతంలో నివసిస్తున్నారు. అమ్రిష్ ఇలా అన్నారు, "మా నాన్నగారు సివిల్ ఆసుపత్రిలోని రోగులకు సహాయం చేసే స్థానిక బృందంలో ఒకరు. నగరంలో బాంబు పేలుళ్లు జరిగాయని తెలియగానే ఆయన ఆసుపత్రికి వెళ్లారు. అక్కడ ఆయన తీవ్రంగా గాయపడ్డారు. పేలుడు జరిగిన దాదాపు రెండు గంటల తర్వాత ఆయన మరణం గురించి నాకు తెలిసింది" అని అమ్రిష్ తెలిపారు. "మా నాన్నగారు గాయపడినప్పుడు మా చిన్నాన్న ఆసుపత్రిలోనే ఉన్నారు. అప్పుడు సివిల్ ఆసువత్రిలో గందరగోళం నెలకొనడంతో, ఆయనను సమీపంలోని రాజస్థాన్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మరణించారు" అని చెప్పారు. "హైకోర్టు నిందితులకు శిక్ష విధించడం మంచిదైంది. ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారు" అని హైకోర్టు తీర్పును ఆయన స్వాగతించారు.

– జాగృతి డెస్క్

హిందూ ధర్మంపై

సమాజంలో 'భావప్రకటన స్వేచ్ఛ' ముసుగులో హిందూధర్మం, దేవతలపై ప్రణాళిక ప్రకారం కుట్రపన్ని విద్వేషాన్ని చిమ్ముతున్నారు. కొందరు విద్రోహశక్తులు భారతదేశాన్ని, అందులోనూ ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌ను తమ విభజనవాద రాజకీయాలకు ఒక ప్రయోగశాలగా మార్చుకున్నారు. ఆ ద్రోహశక్తుల అసలు స్వరూపాన్ని ఇటీవల చోటుచేసుకున్న వరుస సంఘటనలు బట్టబయలు చేస్తున్నాయి.

సామాజిక న్యాయం అనే పదాన్ని అడ్డం పెట్టుకుని, సమాజంలో వైషమ్యాలు సృష్టించే కుటిల ప్రయత్నాలు పరాకాష్ఠకు చేరుకున్నాయి. ఏలూరులో 'దళిత క్రైస్తవ శంఖారావం' పేరిట నిర్వహించిన బహిరంగసభ ఇందుకు ఒక ప్రత్యక్ష ఉదాహరణ. ఈ సభలో న్యాయవాది జడ శ్రావణ్, యూట్యూబర్ బచలకూరి జోసెఫ్ (ప్రశ్న రావణ్) తదితరులు హిందూ మతంపై అత్యంత జుగుప్సాకరమైన రీతిలో విద్వేషం వెళ్లగక్కారు. గతంలో హిందూధర్మాన్ని విమర్శించినందుకు దేవాలయాల కూల్చివేత తదితర ఘటనల్లో ఖండించి, ప్రశ్నించి, విమర్శించిన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజులను దూషిస్తూ, హిందూదేవతలను అవమానపరుస్తూ, ద్వేషిస్తూ ఈ వేదిక నుంచే వారు అసభ్యకరమైన పదాలతో తీవ్రంగా దూషించారు. క్రైస్తవ వేదికలను ఏర్పాటు చేసుకున్నది ఆయా వర్గాల అభ్యున్నతి గురించి మాట్లాడటానికి కాగా, అందుకు భిన్నంగా, కేవలం హిందూ దేవతలను తూలనాడటానికి, కించపరచడానికే వేదికను ఉపయోగించుకోవడం సభ్యసమాజం తలదించుకునే చర్య. తమ మాటలు ఆలకించేవారిని హిందూమతంపై ఉసిగొలిపి, ఈర్ష్యాద్వేషాలు రగిలించి, సమాజంలో కులమతాల మధ్య చిచ్చుపెట్టి ధనం, రాజకీయ ప్రయోజనాలు పొందడమే లక్ష్యంగా ఇలాంటి వేదికలు ఏర్పాటయ్యాయి. ఈ పరిణామాల నేపథ్యంలో, మతమార్పిడుల వెనుక ఉన్న అసలు కుట్రలను, మత రాజ్యాలుగా మారితే సమాజం ఎదుర్కొనే దారుణమైన దుష్పరిణామాలను, అన్నింటినీ భరించే హిందూ ధర్మం విశిష్టతను లోతుగా విశ్లేషించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. హిందూ ధర్మంపై జరుగుతున్న దాడులను, హిందూ మతం కల్పిస్తున్న స్వేచ్ఛ, మత ఆధారిత దేశాల్లో ఎస్సీ, ఎస్టీలకు లేని ప్రాధాన్యతలు, మతాన్ని విమర్శిస్తే ఎదుర్కొంటున్న పర్యవసానాలు, హిందూమతం గొప్పతనం గురించి భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్, పార్టీ ప్యానలిస్టులు, అధికార ప్రతినిధుల సమావేశంలో వివరించారు.

మత రాజ్యాల అసలు స్వరూపం - కోల్పోయే హక్కులు

దళిత హక్కుల పరిరక్షణ పేరుతో, సామాజిక న్యాయం సాధిస్తామనే భ్రమలతో హిందూధర్మాన్ని వీడి ఇతర మతాలవైపు ఆకర్షితులవుతున్న వారు ఒక కఠోరమైన, చేదు చారిత్రక సత్యాన్ని పూర్తిగా విస్మరిస్తున్నారు. మత ప్రాతిపదికన ఏర్పడిన రాజ్యాలు, దేశాల్లో బహుజనులకు, దళితులకు, అల్పసంఖ్యాక వర్గాలకు కనీస మానవ హక్కులు కూడా మృగ్యమయ్యాయన్నది నగ్న సత్యం. మత రాజ్యంలో 'ఒకే మతం, ఒకే చట్టం' అనే నిరంకుశత్వం రాజ్యమేలుతుంది. అక్కడ భిన్నత్వానికి, సామాజిక సమానత్వానికి ఏమాత్రం తావుండదు. బాంగ్లాదేశ్, పాకిస్తాన్‌లాంటి ఇస్లామిక్ మత రాజ్యాల్లో దళితులు, ఎస్సీ,ఎస్టీలకు ఎలాంటి రాజ్యాంగ పరమైన హక్కులూ లేవు. మన దేశంలోలా అక్కడ అణగారిన వర్గాల రక్షణ కోసం ప్రత్యేక చట్టాలు (అట్రాసిటీ చట్టం వంటివి) గానీ, సామాజిక అభ్యున్నతి కోసం విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో రిజర్వేషన్లు గానీ లేవు. వారు అక్కడ ద్వితీయ శ్రేణి పౌరులుగానే ఉంటూ, కనీస గౌరవానికి నోచుకోక వారి బతుకులు దినదిన గండంగా, కన్నీటి గాథలుగా మారాయి. ఇతర దేశాల్లోనే కాదు... మన దేశంలోనే ఆర్టికల్ 370 రద్దు కాకముందు మత ఛాందసవాదం కోరల్లో చిక్కుకున్న జమ్మూ కశ్మీర్‌లో పరిస్థితి ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ. అక్కడ దశాబ్దాల పాటు ఎస్సీ, ఎస్టీల రక్షణ చట్టాలు అమలు కాలేదు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి అక్కడి గిరిజన సామాజిక వర్గానికి, ఇతర దళితులకు కనీస పౌరసత్వ హక్కులు, స్థానిక ఎన్నికల్లో ఓటు హక్కు, సాధారణ ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలు అందలేదు. ఇది మత ఛాందసవాదం అణగారిన వర్గాలకు చేసే ద్రోహానికి ఒక మాయని మచ్చ. మతాధారిత రాజ్యం ఏర్పడినప్పుడు, అక్కడ ముందుగా ప్రభావితమయ్యేవి భావప్రకటన స్వేచ్ఛ, సమానత్వపు హక్కులే. నిలదీసి, విమర్శించే స్వేచ్ఛ అక్కడ ఎంతమాత్రం ఉండదు. నేడు భారతదేశంలో పౌర హక్కులు రాజ్యాంగబద్ధంగా లభిస్తున్నాయి. అంటే, దానికి ఏకైక కారణం ఈ నేలకున్న విశాలమైన, సర్వమత సహనంతో కూడిన "హిందూత్వ" జీవనాడి. అందరినీ కలుపుకుపోయే సనాతన ధర్మం బలంగా ఉండటం వల్లే లౌకికవాదం, ప్రజాస్వామ్యం వర్ధిల్లుతున్నాయి. ఆ ధార్మిక జీవనాడిని విచ్ఛిన్నం చేస్తే, మనం అనుభవిస్తున్న స్వేచ్ఛ, సమానత్వం పూర్తిగా ఆవిరైపోయి చీకటి యుగంలోకి జారుకుంటాం.

దేవుడినే ప్రశ్నించే స్వేచ్ఛ..

మత రాజ్యాలు, నిరంకుశ సిద్ధాంతాలు సృష్టించిన మారణహోమాలు, అణచివేతలు కోకొల్లలు. 1979లో ఇరాన్‌లో ఇస్లామిక్ విప్లవం వచ్చిన తర్వాత జరిగిన దారుణాలు అన్నీ ఇన్నీ కావు. యజిడీలు, ఆఫ్ఘనీలు, అహ్మదీలు వంటి చిన్న చిన్న సమూహాలపై, భిన్నమైన నమ్మకాలు ఉన్నవారిపై కనీస కనికరం లేకుండా మారణకాండ సాగించి లక్షలాది మందిని పొట్టనబెట్టుకున్నారు. అంతెందుకు 1900 నుండి 2026 వరకు గమనిస్తే, అబ్రహామిక్ మతాలైన ఇస్లాం, క్రైస్తవాల్లో దేవుడిని, మత గ్రంథాలను లేదా వారిలోని మూఢవిశ్వాసాలను

‘విద్వేషపు’ పడగ

ప్రశ్నించడం చాలా తీవ్రమైన నేరంగా పరిగణించే వారు. ముఖ్యంగా ఇస్లామిక్ దేశాల్లో ఈ పరిస్థితి అత్యంత కఠినంగా ఉంటుంది. ‘బ్లాస్ఫెమీ’ (దైవదూషణ) చట్టాల పేరిట ప్రశ్నించిన వారిని జైళ్లలో పెట్టడం, బహిరంగంగా కొరడాలతో కొట్టడం, మరణశిక్షలు అమలుచేయడం చూశాం. ‘‘ది సాటానిక్ వర్సెస్’’ రాసినందుకు సల్మాన్ రష్దీపై ఫత్వా జారీ కావడం,ఆయన ప్రాణాపాయ దాడికి గురికావడం దీనికి ప్రత్యక్ష ఉదాహరణ. అలాగే మతమౌఢ్యాన్ని ప్రశ్నించిన బాంగ్లాదేశ్ రచయిత్రి తస్లీమా నస్రీన్‌ను దేశ బహిష్కరణ చేయడం, సౌదీ అరేబియాలో బ్లాగర్ రయీఫ్ బదావికి పదేళ్ల జైలుశిక్షతో పాటు కొరడా దెబ్బలు విధించడం మతపరమైన శిక్షలకు కొన్ని నిదర్శనాలు. క్రైస్తవమతంలో కూడా 20వ శతాబ్దపు మొదటి సగంలో మతవిశ్వాసాలను, సృష్టి సిద్ధాంతాలను ప్రశ్నించిన ఎందరో శాస్త్రవేత్తలను, హేతువాదులను చర్చి నుండి వెలివేశారు. వారి రచనలను నిషేధిత పుస్తకాల జాబితాలో చేర్చారు. కాలక్రమేణా చట్టపరమైన మరణశిక్షలు తగ్గినప్పటికీ, మతపెద్దల నుండి తీవ్ర సామాజిక బహిష్కరణలు, మానసిక వేధింపులు కొనసాగాయి. మిగతా ధర్మాలన్నీ కట్టుబాట్లకు లోబడి ఉంటాయి. ఒకేమార్గంలో నడవాలని శాసిస్తాయి. వారి ప్రవక్తను గానీ, దేవుడిని గానీ, పుస్తకాన్నిగానీ ప్రశ్నిస్తే సమాజం నుండి వెలివేస్తారు, దారుణమైన శిక్షలు విధిస్తారు. కానీ హిందూమతం విమర్శలను సైతం భరించి, క్షమించి, నాస్తికులను సైతం తనలో కలుపుకునే అత్యంత విశాలమైన సహిష్ణుతగల ధర్మం. విమర్శను ఒక దీవెనగా భావించి తన్ను తాను ఎప్పటికప్పుడు సంస్కరించుకునే శక్తి ఈ ధర్మానికి ఉంది. ఈ అంశాన్ని ఉదహరిస్తూ మాధవ్ ఒక సంఘటనను గుర్తుచేశారు. తాను స్వాతంత్ర్య సమరవీరుడు వీర సావర్కర్ పుస్తకం చదివానని, అందులో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ బౌద్ధం స్వీకరించే సమయంలో సావర్కర్ స్వయంగా రాసిన లేఖలోని అక్షర సత్యాలను ఇలా వివరించారు. “మిత్రమా! మతం మారే నిర్ణయంవల్ల నువ్వు బందీవి కాబోతున్నావు. నీ స్వేచ్ఛను కోల్పోతున్నావు. దేవుడు ఉన్నాడా? లేడా? అని తన దేవుడినే నేరుగా ప్రశ్నించే అధికారం, తాను ఎంచుకున్న మార్గాన్ని విమర్శించే అవకాశం, విగ్రహారాధన ఉన్నా, లేకున్నా... ఏ రకమైన ఆలోచనా విధానాన్నైనా అత్యంత స్వేచ్ఛగా చెప్పగలిగే అవకాశం కేవలం ఈ హిందూ ధర్మంలోనే ఉంది. ప్రపంచంలో ఇంకే ధర్మంలోనూ ఈ స్వేచ్ఛ లేదు. మిగతా ధర్మాలన్నీ కట్టుబాట్లకు లోబడి ఉంటాయి. ఒకే మార్గంలో నడవాలని శాసిస్తాయి’ అని తెలిపారు.

పీఓకేలో పాకిస్తాన్ దాడులు:అరాచక పాలన

పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో పాకిస్తాన్ ప్రభుత్వం, సైన్యం సాగిస్తున్న అరాచకాలు ఒక మతరాజ్యం చేసే దారుణాలకు సజీవసాక్ష్యం. దశాబ్దాలుగా పీఓకే ప్రజలు కనీస మానవ హక్కులు, స్వేచ్ఛ లేకుండా పాక్ సైన్యం చేతిలో బానిసలుగా బతుకు తున్నారు. పాకిస్తాన్ సహజ వనరులను విపరీతంగా దోచు కుంటూ, స్థానికులకు కనీస మౌలిక సదుపాయాలు కూడా కల్పించడంలేదు. తమ న్యాయమైన హక్కులకోసం, పెరుగుతున్న ధరలకు వ్యతిరేకంగా శాంతియుతంగా నిరసన తెలిపే స్థానిక ప్రజలపై పాక్‌సైన్యం అత్యంత దారుణంగా లాఠీచార్జీలు, తూటాలతో దాడులు జరుపుతూ నెత్తుటేరులు పారిస్తోంది. అక్కడ ప్రశ్నించే నాయకులను అక్రమంగా అరెస్టులుచేసి, కిడ్నాప్‌లకు పాల్పడు తున్నారు. అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న పీఓకే ప్రజలు పాకిస్తాన్ క్రూరత్వానికి బలవుతూ, తమ మనుగడకోసం నిరంతరం పోరాటం చేస్తున్నారు.

కమ్యూనిజం పేరుతో మతాన్ని పూర్తిగా నిషేధించిన చైనాలో మావో జిడాంగ్ హయాంలో జరిగిన ‘సాంస్కృతిక విప్లవం’లో కోట్లాదిమంది అమాయకులను క్రూరంగా ఊచకోత కోశారు. ప్రభుత్వ విధానాలను ప్రశ్నించే హక్కు కనీస మానవ హక్కులు అక్కడ బూతద్దంపెట్టి వెతికినా కనిపించవు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఒక్క మాట మాట్లాడినా జైలు పాలవ్వడం లేదా ప్రాణాలు కోల్పోవడం ఖాయం. కోవిడ్ లాంటి ప్రపంచ మహమ్మారి పుట్టింది చైనాలోని వుహాన్ నగరంలోనే అయినా, దానిపై ప్రపంచానికి వాస్తవాలు చెప్పే స్వేచ్ఛ అక్కడి పౌరులకుగానీ, పత్రికలకుగానీ, వైద్యులకుగానీ లేకుండా వారిగొంతు నొక్కేశారు. కానీ, భారత దేశంలో మాత్రం అత్యున్నత ప్రజాస్వామ్య స్వేచ్ఛను అనుభవిస్తున్న కమ్యూనిస్టులు, దళితవాదులు... చైనాను, హిడ్మా లాంటి రక్తపిపాసులైన మావోయిస్టు లను కీర్తిస్తూ, దేశ, సమాజ విచ్ఛిన్న విభజన ఎజెండాలు నడుపుతుంటారు. ఇక్కడ వారు అనుభవిస్తున్న భావప్రకటన స్వేచ్ఛ చైనాలో ఉంటే వారి పరిస్థితి ఏమయ్యేదో ఒక్కసారి ఆత్మవిమర్శ చేసుకోవాలి.

మత రాజ్యాల దారుణాలు...
భరతమాత ఆశ్రయం

మరోవైపు, ప్రపంచవ్యాప్తంగా మతహింసకు గురై, ప్రాణభయంతో వచ్చిన ఎన్నో అల్పసంఖ్యాక వర్గాలకు ఆశ్రయం ఇచ్చిన ఏకైక దేశం మనది. ప్రపంచమంతా యూదులను అకారణంగా ద్వేషించి, ఊచకోత కోసిన చరిత్ర ఉంది. కానీ, యూదులు ఇక్కడ ఎలాంటి వివక్ష లేకుండా, ఏ మతమార్పిడి ఒత్తిడులకు గురికాకుండా వందల ఏళ్లు ప్రశాంతంగా తలదాచుకున్నారు. వారు తిరిగి పూర్తి స్వాభిమానంతో ఇజ్రాయెల్ దేశాన్ని నిర్మించుకునే వరకు భారత్ వారికి ఒక రక్షణ కవచంలా నిలిచింది. అలాగే, ఇస్లామిక్ దాడుల వల్ల, మత ఛాందసవాదుల క్రూరత్వానికి బలైపోయి పర్షియా (నేటి ఇరాన్) నుండి ప్రాణభయంతో సముద్రం మీదుగా గుజరాత్ తీరానికి చేరుకున్న పార్శీలను (జొరాస్ట్రియన్లను) అక్కున చేర్చుకున్న ఘనత ఈ దేశానిది. పాలల్లో చక్కెరలా ఈ సమాజంలో కలిసిపోతామన్న వారిని నాటి హిందూ రాజులు సొంత బిడ్డల్లా ఆదరించారు. వారి మతాచారాలకు, అగ్ని దేవాలయాలకు పూర్తి రక్షణ కల్పించి, అత్యంత గౌరవప్రదంగా జీవించే హక్కును ప్రసాదించిన ఘనత కేవలం హిందూ ధర్మానికే దక్కుతుంది. భిన్నత్వాన్ని గౌరవించి, విమర్శలను సైతం స్వీకరించే సనాతన ధర్మం వల్లే ఇదంతా సాధ్యమైంది.

తురగా నాగభూషణం
సీనియర్ జర్నలిస్ట్

కలియుగ రావణుడు

సనాతన ధర్మాన్ని ఆచరించే వారు హిందూ పురాణాల్లో రాక్షస రాజైన రావణుడి వ్యక్తిత్వాన్ని గురించి చెడుగా చెప్పుకుంటారు. ఆయన లక్షణాలు ఎవరికీ ఉండకూడదని కోరుకుంటారు. అయితే కలియుగం వైపరీత్యంతో కొంతమంది ఆయన పేరు చెప్పుకొని అవే అవలక్షణాలతో విర్రవీగుతున్నారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్ పోలీసులు 'ఉపా'చట్టం కింద అరెస్టు చేసిన ప్రశ్న రావణ్ గురించి చెప్పుకుంటే, రామాయణంలోని రాక్షసుడు రావణుడే కొంచెం నయమే అనిపించేలా ఆధునిక రావణుడు వ్యవహరిస్తున్నాడు. అహంకారం, కామం, క్రూరత్వం, మూర్ఖత్వం వంటి రాక్షస ప్రవృత్తులతో దశ కంఠుడైన రావణుడి లక్షణాలను మించిపోయి, ఒక కంఠమే ఉన్నా లోక కంటకుడిగా మారిన నేటి ప్రశ్న రావణుడు సమాజానికి చీడపురుగుగా తయారయ్యాడు. సనాతన ధర్మం వినాశనమే లక్ష్యంగా భావస్వేచ్ఛ పేరుతో బరితెగిస్తున్న ప్రశ్న రావణ్‌తో పాటు ఇలాంటి వారికి భావప్రకటన స్వేచ్ఛ పేరిట మద్దతుగా నిలుస్తున్న వారి కుట్రలపై కూడా హిందూ సమాజం అప్రమత్తంగా ఉండాల్సిన ఆవశ్యకత ఉంది.

ప్రశ్నించడం మా హక్కంటూ 'ప్రశ్న' య్యూట్యూబ్ వేదికగా ఈ కలియుగ రావణుడు జర్నలిస్టు ముసుగులో అరాచకాలు చేస్తున్నాడు. రాజకీయాలకు సంబంధించిన అంశాలతో ఉండే ఈ యూట్యూబ్ వేదికగా రావణ్ ప్రజల మధ్య కుల, మతాల చిచ్చు రగిలిస్తూ విద్వేషాలు రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తున్నాడు. ఇటీవల ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లను కించపరుస్తూ రావణ్ చేసిన తీవ్ర వ్యాఖ్యలపై పలు ఫిర్యాదులు అందడంతో ఏపీ పోలీసులు ఆయనను హైదరాబాద్‌లో అరెస్టు చేశారు. దీంతో తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ దుమారం రేగింది. మేధావులు భావ ప్రకటన స్వేచ్ఛ పేరుతో రోడ్ల మీదకొచ్చారు. ప్రధానంగా పవన్ కల్యాణ్‌ను దుర్భాషలాడుతూ చేసిన వ్యాఖ్యలు సంచలనం రేపాయి. దీంతో జనసేనపార్టీ నేతలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో, పిఠాపురంలో నమోదైన కేసు ఆధారంగా రావణ్‌ను అరెస్టు చేశారు. రాజకీయాల నేపథ్యంలోనే రావణ్‌ను అరెస్టు చేసినట్టు పైకి కనిపిస్తున్నా దీనిపై లోతైన విశ్లేషణ చేస్తే భయంకరమైన విషయాలు వెలుగు చూస్తాయి. రాజకీయ నేతలపై వ్యాఖ్యలు చేస్తే కఠినమైన ఉపా చట్టం కింద కేసు నమోదు చేస్తారా? అన్ని ప్రశ్నించే వారికి 'ప్రశ్న రావణ్' కొంతకాలంగా చేస్తున్న వివాదస్పదమైన సనాతన ధర్మ వ్యతిరేక వ్యాఖ్యలు, దూషణల వెనుక భారీ కుట్ర ఉందనే సత్యం తెలుస్తుంది. అందుకే వారు ఇప్పుడు ప్రశ్నించే హక్కు లేదా? అంటూ రావణ్‌ను సమర్థిస్తూ సోషల్ మీడియా వేదికగా ప్రజల్లో విభేదాలకు మరింత ఆజ్యం పోస్తున్నారు.

రాజ్యాంగం కల్పించిన వ్యక్తిగత స్వేచ్ఛను, భావ ప్రకటన హక్కును అడ్డం పెట్టుకొని రావణ్ సనాతన ధర్మాన్ని హేళన చేస్తూ వ్యాఖ్యానించడం, సోషల్ మీడియా వేదికగా దూషిస్తూ ప్రసారాలు చేయడం తరచూ జరుగుతోంది. పవన్‌కల్యాణ్ సనాతన ధర్మానికి అనుకూలంగా మాట్లాడటం ప్రారంభించి నప్పటినుంచి ఆయన హిందూ వ్యతిరేకులకు లక్ష్యంగా మారారు. ఏపీలో రాజకీయ ప్రయోజనాల కోసం ప్రతిపక్షపార్టీ వైఎస్ఆర్‌సీపీ ప్రశ్నించే గొంతుకను అణచివేస్తున్నారంటూ రావణ్‌కు వత్తాసు పలుకుతోంది. రాజకీయ ప్రత్యర్థులుగా పార్టీలు లబ్ధి పొందేందుకు ప్రయత్నించవచ్చు. అయితే సనాతన ధర్మాన్ని ఆచరించే మెజార్టీ ప్రజల మనోభావాలను కూడా అర్థం చేసుకోవాల్సిన బాధ్యత రాజకీయ పార్టీలపై ఉంటుందనే వాస్తవాన్ని గ్రహించాలి. తమ రాజకీయ పబ్బం కోసం ఏమైనా మాట్లాడవచ్చు అనేలా వ్యవహరిస్తున్న రాజకీయ పార్టీలు, సంఘాలు, ప్రశ్న రావణ్ వంటి అరాచక శక్తులతో దేశ సమగ్రత దెబ్బతినడమే కాకుండా వారు ప్రమాదకరంగా మారుతున్నారనే సత్యాన్ని గ్రహించాలి.

సమాజంలో సంస్కరణల కోసం గొంతెత్తు తున్నట్టు కపట నాటకాలతో ఈ అభినవ రావణుడు సనాతన ధర్మాన్ని హేళన చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నాడు. ఆయన అసలు పేరు బచ్చలకూరి జోసెఫ్ అంటేనే అర్థం అవుతోంది ఈయన క్రైస్తవ మతస్తుడని. అయితే తాను క్రిస్టియన్, దళితుడిని కాదని, ఒక సంస్కరణవాదినని, హేతువాదినని చెప్పుకునే ఈ బచ్చలకూరి జోసెఫ్ అలియాస్ ప్రశ్న రావణ్ వ్యూహాత్మకంగా సనాతన ధర్మాన్ని, హిందూ దేవతలను, పురాణాలను దూషిస్తూ, జుగుప్సాకరంగా వ్యాఖ్యలు చేస్తున్నాడు. హిందూ ఆధ్యాత్మిక ప్రవచనకర్తలను బూతులు తిడుతున్నాడు. హిందువులు రాక్షసుడిగా భావించే రావణుడి పేరు పెట్టుకొని తార్కికంగా సనాతన ధర్మాన్ని ప్రశ్నిస్తున్నట్టు గెటప్ ఇస్తూ, ప్రశ్న రావణ్ పేరుతో హడావుడి చేస్తున్నాడు. ఈయన హేతువాదే అయితే కేవలం సనాతన ధర్మాన్నే ఎందుకు లక్ష్యంగా చేసుకుంటు న్నాడు? తాను ఏ మతానికి చెందని వాడినని చెప్పుకోవడానికి ప్రయత్నిస్తున్న రావణ్ వాక్ స్వాతంత్ర్యం పేరుతో కేవలం హిందూమతం గురించే మాట్లాడుతాడు. ఇతర మతాల పేరు కూడా ఎత్తని ఈ హేతువాదికి ఉన్న ధైర్యం కేవలం సనాతన ధర్మం ఆచరించే వారి సహనమే. హిందువులను, హిందూ దేవతలను, పురాణాలను హేళన చేసినా, దూషించినా ఎవరూ స్పందించరనే ధైర్యంతో ఒంటెత్తుపోకడలతో కారుకూతలు కూస్తున్నాడు. రాముడిని, సీతని, రామాయణాన్ని, కృష్ణుడిని, ద్రౌపదిని, మహా భారతాన్ని ఇలా ఎక్కడ పడితే అక్కడ, ఏమి తోస్తే అది మాట్లాడుతూ సనాతనధర్మాన్ని దూషిస్తున్నాడు.

ఒక సామాన్య యూట్యూబర్‌గా ఉన్న కలియుగ రావణుడు ఇంతగా బరితెగించడానికి వెనుక పెద్ద కుట్ర దాగి ఉంది. ఆయనను ఏపీ పోలీసులు అరెస్టు చేయగానే, కుహనా సెక్యులరిస్టులు, మేధావులు, వామపక్షవాదులు, నాస్తికులు, హేతువాదులతో పాటు కొన్ని రాజకీయపార్టీల నేతలు కూడా ఒక్కటయ్యారు. వీరికి కొందరు సినీ ప్రముఖులు కూడా తోడయ్యారు. ప్రశ్నించే గొంతుకను అణచివేస్తారా? అని అంటూ ప్రశ్నిస్తున్నారు. కేవలం సనాతన ధర్మాన్ని లక్ష్యంగా చేసుకొని దూషిస్తూ మెజార్టీ ప్రజల మనోభావాలను కించపరచడం లౌకికవాదం ఎలా అవుతుందో ఈ ప్రశ్నించే గొంతుకులకే తెలియాలి. ఉపా చట్టం కింద రావణ్‌ను అరెస్టు చేయగానే కొద్దిమంది సినీ ప్రముఖులు మాట్లాడిన ఆడియో రికార్డులు ప్రజల మధ్య మరింత విద్వేషాలను రెచ్చగొట్టేలా ఉన్నాయి. సమాజాన్ని ఉద్ధరించే మనిషిలా రావణ్‌ను చిత్రీకరిస్తున్న ఈ సంస్కరణ వాదులు ఆయన చేసిన అరాచకాలను ఎందుకు ప్రశ్నించడం లేదు. సనాతన ధర్మానికి వ్యతిరేకంగా జరుగుతున్న కుట్ర వెనుక ఈ అభినవ రావణ్ ఒక్కడే లేదు. దీని వెనుక రాజకీయం ఉంది. అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీం కోర్టు మతం మారిన వారికి రిజర్వేషన్లు వర్తించవు అని ఇచ్చిన చారిత్రాత్మక తీర్పుతో విభేదించే వారు అక్కసుతో వ్యూహాత్మకంగా మత విద్వేషాలను రెచ్చగొట్టాలని చూస్తున్నారు. హేతువాదులుగా ప్రకటించుకునే కొందరితో సభలు ఏర్పాటు చేయించి హిందూ సంప్రదాయాలను కించపరుస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్ పోలీసులు రావణ్‌ను అరెస్టు చేసిన కేసు కూడా ఇలాంటి సందర్భమే. ఏలూరులో దళిత క్రైస్తవ సమర శంఖారావం పేరిట నిర్వహించిన ఒక సభలో రావణ్ రాజకీయ నేతలను దూషించాడని, రెచ్చగొట్టేలా మాట్లాడాడని పోలీసులు అరెస్టు చేశారు. అయితే ఆయన అలాంటి వ్యాఖ్యలు చేయడం ఇదే మొదటిసారి కాదు. గతంలో నాలుగుసార్లు అరెస్టయ్యాడు. గతంలో పలుమార్లు సోషల్ మీడియాలో ఇంతకంటే జుగుప్సాకరంగా సనాతన ధర్మాన్ని హేళన చేశారు. అప్పుడు ప్రభుత్వాలు, పోలీసులు కూడా స్పందించలేదు. ఆలస్యమైనా రాజకీయ నేతలను దూషించాడని రావణ్‌ను అరెస్టు చేయడంతో ఆయన భాగోతాలు బయటపడుతున్నాయి. అతను గతంలో చేసిన వ్యాఖ్యలపై కూడా విచారణ జరిపి శిక్షించాలి.

సెక్యులర్ దేశంలో క్రిస్టియన్లు, ముస్లింలను దూషించిన వారిపై కేసులు పెట్టరు కానీ, హిందువులకు వ్యతిరేకంగా మాట్లాడితే మాత్రం కేసులు పెడుతున్నారనే కొత్త వాదనని ఇప్పుడు తెరపైకి తెస్తున్నారు. ఒక మతానికి వ్యతిరేకంగా మాట్లాడాడని గతంలో బీజేపీ నేత నుపూర్ శర్మని,

ఏలూరులో దళిత క్రైస్తవ సమర శంఖారావం పేరిట నిర్వహించిన ఒక సభలో రావణ్ రాజకీయ నేతలను దూషించారని, రెచ్చగొట్టేలా మాట్లాడారని పోలీసులు అరెస్టు చేశారు. అయితే ఆయన అలాంటి వ్యాఖ్యలు చేయడం ఇదే మొదటిసారి కాదు. గతంలో నాలుగుసార్లు అరెస్టయ్యాడు. గతంలో పలుమార్లు సోషల్ మీడియాలో ఇంతకంటే జుగుప్సాకరంగా సనాతన ధర్మాన్ని హేళన చేశారు. అప్పుడు ప్రభుత్వాలు, పోలీసులు కూడా స్పందించలేదు. ఆలస్యమైనా రాజకీయ నేతలను దూషించారని రావణ్‌ను అరెస్టు చేయడంతో ఆయన భాగోతాలు బయటపడుతున్నాయి.

తెలంగాణ ఎమ్మెల్యే రాజాసింగ్‌ను అరెస్టు చేసినా ఈ మేధావులు తెలియనట్టే నటించారు. ఎవరు ఏ మతాన్ని కించపరుస్తూ వ్యాఖ్యానించినా శిక్షించాల్సిందే. వారు ఏ రాజకీయ పార్టీకి చెందినా, ఎంతటి ప్రముఖులైనా వదిలిపెట్టకూడదని ప్రజలు కోరుకుంటారు.

తెలుగునాట రావణ్ ఉదంతం చోటు చేసుకున్న సమయంలోనే కలకత్తా హైకోర్టు గొప్ప తీర్పు ఇచ్చింది. రామకృష్ణ మిషన్ కళాశాలలో తమల్ దాస్‌గుప్తా అనే వ్యక్తి నియామకానికి సంబంధించి కోర్టు తీర్పు మేధావులకు చెంపపెట్టు. తమల్ దాస్‌గుప్తా గతంలో సామాజిక మాధ్యమాల్లో రామకృష్ణ మిషన్‌కు, ఆ సంస్థ సాధువులకు వ్యతిరేకంగా తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆయన రామకృష్ణ కళాశాలలో ఉద్యోగ నియామానికి అర్హత సాధించారు. తమ సంస్థపట్ల వ్యతిరేక భావాలున్న ఆయనకు ఉద్యోగం ఇవ్వడానికి రామకృష్ణ మిషన్ అంగీకరించలేదు. దీంతో సదరు వ్యక్తి కోర్టులో కేసు వేశాడు. ఈ సందర్భంగా ధర్మాసనం వ్యాఖ్యానిస్తూ... "ప్రతి వ్యక్తికీ తనకు నచ్చిన మతాన్ని ప్రచారం చేసుకునే హక్కు ఉంది. అయితే. దీనిని ఇతరుల విశ్వాసాలను గాయపర్చడానికి ఇచ్చిన అనుమతిగా భావించ రాదు..." అని పేర్కొంటూ తమల్ దాస్‌గుప్తా ఉద్యోగ నియామకాన్ని రద్దు చేసింది. ఇది కేవలం ఒక నియామకాన్ని రద్దు చేయడం కాదు, వాక్ స్వాతంత్ర్యం పేరిట ప్రశ్నించే హక్కు నెపంతో ఇతర మతాలను, వారి విశ్వాసాలను దూషించడం, కించపర్చడం ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదన్న కోర్టు తీర్పుతో మేధావులు కళ్లు తెరవాలి. ఏదైమైనా, ఏపీలో రావణ్ అరెస్టు, కలకత్తా తీర్పు రెండింటి మధ్య కొంత సారూప్యత ఉంది. ఈ రెండు ఉదంతాలతో సనాతన ధర్మం ఆచరించేవారిలో ఆత్మవిశ్వాసం పెరగడమే కాకుండా అవాకులు చెవాకులు పేలేవారికి ఒక హెచ్చరికగా కూడా ఉంది.

రాజకీయంగా దూషిస్తే దేశద్రోహం పేరిట కఠినమైన ఉపా చట్టం కేసు నమోదు చేయడం అన్యాయమని వాదిస్తున్న మేధావులు, ఉద్దేశ పూర్వకంగా వాస్తవాలను తక్కువ చేసి చూపిస్తున్నారు. నిషిద్ధ భావాలకు బచ్చలకూరి జోసఫ్ అలియాస్ ప్రశ్న రావణ్ బానటగా ఉన్నట్టు పోలీసుల విచారణలో తేలింది. మావో సిద్ధాంతాలను వ్యాప్తిచేస్తూ, సాయుధ తిరుగుబాటును ప్రోత్సాహిస్తూ, మావోయిస్టు నేత హిడ్మాను కీర్తిస్తూ వీడియోలు ప్రసారం చేశారంటూ యూట్యూబర్ ప్రశ్న రావణ్‌పై కేసులు నమోదయ్యాయి. ఈ తీవ్రమైన కేసుల నేపథ్యంలో ఈయనపై చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం ఉపా కేసు నమోదు చేశారు. ఒకవైపు మత విద్వేషాలు రెచ్చగొట్టేలా ప్రసంగాలు, మరోవైపు నిషద్ధభావాల సిద్ధాంతాలకు బాసటగా నిలవడం వంటి కార్యక్రమాలకు పాల్పడిన ప్రశ్న రావణ్ అరెస్టును ప్రశ్నిస్తూ ఆయనకు కొందరు మద్దతుగా ఉండడం దురదృష్టకరం.

'ప్రశ్న' పేరుతో యూట్యూబ్ నిర్వహించినా, తన పేరుకు ప్రశ్నను తగిలించుకున్నా రావణ్ మేధావి కాదు, సంస్కరణవాది కాదు. సనాతనధర్మాన్ని కించపరచడమే లక్ష్యంగా పేర్లతో జిమ్మిక్కులు చేసే ఇలాంటి సంఘ విద్రోహులను, ఇలాంటి వారికి మద్దతుగా నిలుస్తున్న వారికి గుణపాఠం చెప్పాల్సిన సమయం ఆనన్నమైంది. ఏమి మాట్లాడినా చెల్లుతుంది. ఏమి చేసినా పట్టించుకోరు అనే ధోరణితో సాగే శక్తులపై సరైన సమయంలో చర్యలు తీసుకునేలా ప్రభుత్వాలు, న్యాయస్థానాలు స్పందించడం ఆహ్వానించదగ్గ పరిణామం.

– శ్రీపాద

విపక్షాల చోరీ

అప్పట్లో మందిర ఉద్యమం అపారమైన రాజకీయ ప్రాముఖ్యతను సంతరించుకున్నట్లే, ఆ ఉద్యమానికి కేంద్ర బిందువైన యూపీలో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండటంతో, ఆలయంలో జరిగిన దొంగతనం కూడా రాజకీయంగా ప్రాచుర్యం పొందింది. జాతీయ, అంతర్జాతీయ మీడియా శీర్షికల్లో ప్రముఖంగా నిలుస్తున్న రామ మందిరంలోని నగదు దొంగతనం, 1990ల నాటి సైద్ధాంతిక ఘర్షణలను గుర్తుచేస్తూ, ఒక భారీ రాజకీయ వివాదంగా పరిణమించింది. ఈ రాజకీయ ఆసక్తి సహజమైనది, అర్థం చేసుకోదగినదే అయినప్పటికీ, నేటి పరిస్థితి పూర్తి భిన్నంగా ఉంది. అప్పటి మందిర ఉద్యమం, నేటిలా నిమిష నిమిషానికి బ్రేకింగ్ న్యూస్ అందించే మీడియా తీవ్రమైన పోటీని ఎదుర్కోవలసి రాలేదు. ఇంతటి ఉద్రేకపూరిత మీడియా యంత్రాంగం రాజకీయ ఎజెండాలతో కలిసినప్పుడు, సందర్భోచిత సంచలనాత్మక కథనాలకు అతీతంగా, సమగ్రంగా పరిశీలించడం ద్వారా మాత్రమే సత్యాన్ని వెలికితీయగలం.

ఈ దొంగతనం ఒకప్పుడు రామమందిరాన్ని వ్యతిరేకించిన వారిని అద్భుతంగా "జై శ్రీరామ్" అని జపించే ఆయన భక్తులుగా మార్చేసింది. 2024లో 'ప్రాణ ప్రతిష్ఠ' కార్యక్రమాన్ని బహిష్కరించిన కాంగ్రెస్ పార్టీ, రామ్ లల్లా దర్శనం కోసం తొమ్మిది మంది సభ్యులతో కూడిన ఉన్నత స్థాయి ప్రతినిధి బృందాన్ని ఇటీవల పంపింది. ఇది కేవలం రాజకీయ అవకాశవాదంతో ప్రేరేపించబడినప్పటికీ, స్వాగతించదగిన పరిణామం. ఎందుకంటే, ఆ పార్టీ ఆరాధించే మహాత్మా గాంధీ జాతీయ, వ్యక్తిగత సమస్యలన్నింటికీ "రామ నామాన్ని" నివారణగా భావించారు. 2024 మందిర కార్యక్రమాన్ని బహిష్కరించిన అరవింద్ కేజ్రీవాల్ కూడా తక్షణమే రామభక్తుడిగా మారిపోయారు. ఈ దొంగతనం సనాతనులందరినీ తీవ్రంగా బాధించిందని ప్రకటిస్తూ, రామ్‌లల్లాను దర్శించుకుంటానని తెలిపారు. అత్యంత విడ్డూరం ఏమిటంటే, 1990లో ములాయం సింగ్ యాదవ్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 16 మంది కరసేవకులను కాల్చి చంపమని పోలీసులను ఆదేశించారు. ఆ తర్వాత, 30 మంది చనిపోవాల్సి వచ్చినా అదే ఆదేశం ఇచ్చేవాడినని గర్వంగా ప్రకటించారు. ఈరోజు ఆయన సమాజ్‌వాదీ పార్టీ రామభక్తులు మోసపోయారని కన్నీరు కార్చుతోంది. బ్రేకింగ్ న్యూస్ కోసం పోటీపడుతున్న అతి ఉత్సాహపూరిత భారత మీడియా కూడా ఈ రాజకీయ బృందగానంలో గొంతు కలిపింది. ఒక మీడియా సంస్థ బీజేపీకి దీర్ఘకాలిక నష్టం వాటిల్లుతుందని అంచనా వేసింది. మరొకటి, పరిపాలనలో నిజాయతీకి, స్వర్ణ ప్రమాణమైన బీజేపీ రామరాజ్య వాగ్దానానికి ఇది తీవ్రమైన ఎదురుదెబ్బ అని పేర్కొంది.ఆలయం భౌగోళిక, రాజకీయ ప్రాముఖ్యతను సొమ్ము చేసుకుంటూ, భారత్, హిందూ వ్యతిరేక పక్షపాత చరిత్ర కలిగిన రాయిటర్స్, బీబీసీ, అల్‌జజీరా వంటి అంతర్జాతీయ మీడియా సంస్థలు, ఈ సంఘటనను ఒక బిలియన్ డాలర్ల దోపిడీగా చిత్రీకరించాయి. "దేవుళ్ల నుంచి దొంగతనం.. అవినీతి స్కామ్‌లో చిక్కుకున్న భారత్ రామమందిరం... కీలకమైన రాష్ట్ర ఎన్నికలకు ముందు నిధుల దుర్వినియోగ ఆరోపణల్లో కూరుకు పోయిన ఈ ఆలయం ప్రధాని మోదీ ప్రభుత్వాన్ని ఇబ్బంది పెడుతోంది," అని అల్‌జజీరా ఘోషించింది.



సమాజ్‌వాది పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్

ఇది కేవలం దొంగతనం.. అవినీతి లేదా స్కామ్ కాదు

రామమందిరంలో జరిగింది ఒక దొంగతనం మాత్రమే. నగదు నిర్వహణలో ఉన్న కింది స్థాయి సిబ్బంది సులభంగా చేసిన చిన్నపాటి అపహరణ ఇది. ఇది అవినీతి లేదా స్కామ్ కాదు. ఒకవేళ ఉన్నతాధికారులు దీనిని కప్పిపుచ్చడానికి ప్రయత్నించి ఉంటేనే అది అవినీతి అయ్యేది. కానీ దానికి భిన్నంగా, దొంగతనం వెలుగులోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే ఉన్నతాధికారులు కఠినమైన, రాజీలేని చర్యలు చేపట్టారు. దీనిని స్కామ్‌గా మార్చేలా చేసే 'సంస్థాగతంగా కప్పిపుచ్చడం' (institutional cover-up) వంటి ఆనవాళ్లు ఏవీ ఇందులో కనిపించలేదు.

దొంగతనాలు ఎక్కడైనా జరుగుతుంటాయి. మనం జీవిస్తున్న కాలం గురించి తెలుసుకోవాలంటే స్వామి చిన్మయానంద చేసిన వ్యాఖ్యను గుర్తు చేసుకోవాలి: "కృతయుగంలో మంచి, చెడు వేర్వేరు లోకాలలో (దేవతలు, అసురులు) ఉండేవి. త్రేతా యుగంలో అవి ఒకే లోకంలో (రాముడు, రావణుడు) ఉండేవి. ద్వాపరయుగంలో అవి ఒకే కుటుంబంలో (పాండవులు, కౌరవులు) ఉండేవి. కానీ కలియుగంలో అవి ఒకే మనిషిలో నివసిస్తున్నాయి" అని వారు అన్నారు. మనం కలియుగంలో ఉన్నాం. ఈ యుగంలో మనిషిలో మంచి, చెడు ఏకకాలంలో ఉంటాయి.

కోరిక, దురాశ సహజంగా మంచివారైన వారిని కూడా ప్రభావితం చేసినప్పుడు, చర్చిలు, మసీదులు లేదా దేవాలయాల వంటి అత్యంత పవిత్రమైన ప్రదేశాలలో కూడా నేరాలు జరగవచ్చు. దేవాలయ హుండీ (విరాళాలపెట్టె) నుండి డబ్బు దొంగిలించడం చాలా సులభం. దేవాలయ నిర్వహణపై సి.పి. రామస్వామి అయ్యర్ కమిటీ నివేదిక చాలా స్పష్టంగా పేర్కొన్నట్లుగా, హుండీలో వేసిన డబ్బు పవిత్రమైనది. కానీ దానిని బయటకు తీసిన క్షణంలో అది కేవలం కరెన్సీ నోట్లుగా మారుతుంది. సరిగ్గా ఇదే తర్కం ఆధారంగా, దేవాలయ నిధులను తమ అధీనంలోకి తీసుకోవడానికి ప్రభుత్వాలను న్యాయవ్యవస్థ అనుమతించింది.

రాజకీయాలు

బోఫోర్స్ స్కామ్‌పై మూడేళ్లు తాత్సారం

ఏ నంస్థలోనైనా నిజాయతీకి అనలైన కొలమానం తప్పులు జరగకపోవడం కాదు (అది ఆదర్శవంతమైన పరిస్థితి అయినప్పటికీ). ఆ తప్పులపై అధికారులు ఎంత వేగంగా, ఎంత దృఢంగా స్పందిస్తారన్నదే ముఖ్యం. దొంగతనాన్ని కప్పిపుచ్చడమే అవినీతి, మోసానికి దారితీస్తుంది. ఇది సాధారణంగా ఉన్నతాధికారులను రక్షించడానికి జరుగుతుంది. బోఫోర్స్ స్కామ్ 1987లో వెలుగులోకి వచ్చింది. అందులో అప్పటి ప్రధాని రాజీవ్ గాంధీ ప్రమేయం ఉండటంతో, ఆయన అధికారం కోల్పోయే వరకు ఎటువంటి ఎఫ్ఐఆర్ నమోదు కాలేదు. ఆయన ఓడిపోయిన మూడేళ్ల తర్వాత, 1990లో అది నమోదైంది.

వేగంగా స్పందించిన యోగి ప్రభుత్వం

ప్రభుత్వం ట్రస్టీగా వ్యవహరించిన దేవాలయాల్లోని దొంగతనాలకు సంబంధించి ఇటీవల జరిగిన ఉదంతాలలో కప్పిపుచ్చడం వంటి చారిత్రక నేపథ్యాన్ని దృష్టిలో ఉంచుకుని, రామమందిర ట్రస్ట్ తీసుకున్న చర్యలను మనం పరిశీలిద్దాం. రామమందిరానికి ఉన్న భౌగోళిక, రాజకీయ ప్రతిష్ట ద్వారా దేశ ప్రతిష్టకు విలువనిచ్చే ఈ ఘటన, దేశ ప్రతిష్టను పట్టించుకునే ప్రతి ఒక్కరికీ నిస్సందేహంగా దిగ్భ్రాంతికరం, బాధాకరమైనది. అయినప్పటికీ, కీలకమైన వాస్తవాలను కప్పిపుచ్చిన అతిశయోక్తి వార్తలు, ఆరోపణల సునామీ, జాతీయ ప్రతిష్టపై అన్యాయమైన, నివారించదగిన నీడను కమ్మేశాయి. ఇలాంటి ఇతర ఆలయ దొంగతనాల ఘటనలకు పూర్తి విరుద్ధంగా ట్రస్ట్, యూపీ ప్రభుత్వం ఎంత వేగంగా స్పందించాయో గమనించడంలో దురదృష్టవశాత్తూ తటస్థ వ్యాఖ్యాతలు కూడా విఫలమయ్యారు. కానీ ఈ గందరగోళంలో ఆ విషయం మరుగున పడిపోయింది.

ఏఐ మెచ్చుకోలు

శబరిమల, తిరువనంతపురం, పురీ, తమిళనాడులోని ప్రభుత్వ అధీనంలో ఉన్న ఆలయాలలో జరిగిన ఆస్తి దుర్వినియోగం, విగ్రహాల దొంగతనాల ఆరోపణలను గుర్తుకు తెచ్చుకోండి. ప్రభుత్వ సంస్థల స్పందనను రామమందిర ట్రస్ట్ స్పందనతో పోల్చి చూస్తే, ఆ కేసులలో రామమందిరం ట్రస్ట్, ప్రభుత్వ నియంత్రణలో ఉన్న ట్రస్టుల స్పందన మధ్య ఉన్న స్పష్టమైన వ్యత్యాసం వెల్లడవుతుంది. దీని కోసం దశాబ్దాల చరిత్ర పుటలు తిరగేయాల్సిన అవసరం లేదు. ఈ రోజు, కృత్రిమ మేధ(ఏఐ) సాధనం ఆ చరిత్రను ఆధారాలు సహా కంప్యూటర్ తెరపైకి తీసుకువస్తుంది. ఆ కేసులలో రామమందిరం ట్రస్ట్, ప్రభుత్వ ట్రస్టులు ఎలా వ్యవహరించాయో పోల్చి చూపమని ఏఐ సాధనం జెమినిని కోరినప్పుడు, అది "తమ నియంత్రణలో ఉన్న ఆలయాల్లోని ఆరోపణలపై ప్రభుత్వాలు చర్యలను అడ్డుకుని, ఆలస్యం చేసిన తీరుతో పోలిస్తే, రామమందిరం ట్రస్ట్ వేగవంతమైన చర్య ఆశ్చర్యకరంగా భిన్నంగా ఉంది'' అని సమాధానమిచ్చింది. శబరిమల, పురీ, తమిళనాడు విగ్రహాల దొంగతనాల వంటి కేసులలో ప్రభుత్వ బోర్డుల పూర్తి నిష్క్రియాత్మకత కారణంగా న్యాయస్థానాలు జోక్యం చేసుకుని విచారణకు ఆదేశించవలసివచ్చిందని, దీనివల్ల న్యాయం సంవత్సరాలు, కొన్నిసార్లు దశాబ్దాల పాటు ఆలస్యమైందని అది పేర్కొంది. దీనికి పూర్తి విరుద్ధంగా, నేరం వెలుగులోకి వచ్చిన కొద్ది రోజులకే రామమందిరం ట్రస్ట్ ఒక ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేయాలని యూపీ ప్రభుత్వాన్ని కోరింది. ''తమ సిద్ధాంతం, ఆత్మగౌరవంతో ప్రేరేపితమైన రామ మందిరం ట్రస్ట్ తక్షణం చర్య తీసుకుంది. దీనికి విరుద్ధంగా ప్రభుత్వ ట్రస్టులు తమ వ్యవస్థలను, అధికార యంత్రాంగాన్ని కాపాడుకునే ప్రయత్నంలో మందకొడిగా వ్యవహరించాయి'' అని ఏఐ సాధనం పేర్కొంది. (ఈ దొంగతనం వల్ల మలినమవుతుందని కొన్ని మీడియా సంస్థలు వాదించినా అదే సిద్ధాంతం, ఇంతటి రాజీలేని చర్యకు కచ్చితంగా ఉత్ప్రేరకంగా పనిచేసింది.)

"అంతేకాకుండా, రామమందిరం ఉన్నతాధికారులు నైతిక బాధ్యత వహించి వెంటనే రాజీనామా చేశారు. ప్రభుత్వ దేవాలయాల స్కామ్‌లలో, అధికారులు తమ పదవులకు అంటిపెట్టుకుని ఉండటమే కాకుండా, తమ పదవులను కాపాడుకోవడానికి వన్ను చెల్లింపుదారుల డబ్బుతో న్యాయపోరాటాలు చేస్తారు" అని తెలిపింది. "రామమందిరంలో దొంగతనానికి సంబంధించిన ప్రతిదీ సిట్ దర్యాప్తు నుండి అధికారిక నివేదిక, సామూహిక అరెస్టుల వరకు కేవలం కొద్ది రోజుల్లోనే జరిగిపోయింది. ట్రస్ట్ స్వచ్ఛందంగా తన ఆర్థిక నివేదికలను ఐదేళ్ల సమగ్ర పునఃఆడిట్‌కు సమర్పించింది. ప్రభుత్వ ఆధ్వర్యంలోని దేవాలయాలు సంప్రదాయం లేదా స్వయంప్రతిపత్తిని కారణంగా చూపి బాహ్య ఆడిట్‌లను సర్వసాధారణంగానే తప్పించుకుంటాయి" అని అది పేర్కొంది. **ఏఐ పరిజ్ఞానం ఉన్న పదవ తరగతి విద్యార్థి కూడా ల్యాప్‌టాప్ మౌస్‌ను క్లిక్ చేయడం ద్వారా ఈ పోలికను చేసి ఉండేవాడు. కానీ కోట్లాది దాలర్ల విలువైన జాతీయ, అంతర్జాతీయ మీడియా ఒకవైపు అత్యుత్సాహం ప్రదర్శిస్తూనే మరోవైపు పోలికను చేయడంలో విఫలమయ్యాయి. రామమందిరం ట్రస్ట్ తీసుకున్న ఈ అపూర్వమైన చర్యలు, ఇది ఒక ఉన్నత స్థాయి స్కామ్ కాదని, ఒక తక్కువ స్థాయి దొంగతనం అని కూడా స్పష్టంగా సూచిస్తున్నాయి. మీడియా సహకారంతో రాజకీయ నాయకులు దీనిని ఒక ఉన్నత స్థాయి వ్యవహారంగా అనుమానించడం దురదృష్టకరం.** ఇప్పుడు, ఇంతకుముందు ప్రస్తావించిన ఆలయ ట్రస్టుల చర్యలతో పోలిస్తే రామమందిరం ట్రస్ట్ వ్యవహారశైలిలో ఉన్న "స్పష్టమైన వ్యత్యాసం" వైపు దృష్టి సారిద్దాం.

తన జీవితాన్ని దేశానికి అంకితం చేసిన ఆర్ఎస్ఎస్ ప్రచారక్ రాయ్

నిజాయతీకి, నిష్కపటత్వానికి ప్రతీకగా నిలిచారు. పోలీసుల కంటే ముందే ఆయనే చర్యలు ప్రారంభించారన్న విషయాన్ని ప్రస్తావించకుండా, మీడియా దురదృష్టవశాత్తు ఆయన్ని ఈ వివాదంలోకి లాగుతోంది. సిట్ అనుమానిస్తున్న రూ. 7.5 కోట్లలో సగం కంటే తక్కువ దొంగతనం జరిగి ఉండవచ్చని, హిందూ జాతీయవాద దృక్పథాన్ని అప్రతిష్టపాలు చేయడానికి బూటకపు లౌకికవాద రాజకీయ శక్తులు మందిరంలో దొంగతనాన్ని ఎలా ఆయుధంగా వాడుకోవడానికి ప్రయత్నిస్తున్నాయో, పోరాట క్షేత్రమైన యూపీలో వారి ప్రయత్నాలకు ఆదరణ లభించే అవకాశాలు ఎంత తక్కువగా ఉన్నాయో గమనిద్దాం.

దొంగతనం ఘటన హిందుత్వంపై, యూపీ ఎన్నికలపై ప్రభావం చూపుతుందా?

జాతీయ పునరుజ్జీవనానికి కేంద్రబిందువైన ఉత్తర్‌ప్రదేశ్‌లో ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో, స్వాతంత్ర్యానికి పూర్వం నాటి హిందూ జాతీయవాద రాజకీయ తత్వాన్ని గుర్తుచేసి, పునఃస్థాపించిన ఆలయ ఉద్యమాన్ని విచ్ఛిన్నం చేయడానికి ఈ దొంగతనాన్ని ఉపయోగించుకోవాలనే విమర్శకుల లక్ష్యం ఇక్కడ సుస్పష్టంగా కనిపిస్తోంది.

శ్రీ రామ్ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ నగదు

జూన్ 4 నుండి 26 వరకు: మెరుపు వేగంతో చర్యలు

కోర్టులు జోక్యం చేసుకునే వరకు ప్రభుత్వ ట్రస్టులు తప్పులను కప్పిపుచ్చడానికి, మరోవైపు రామ మందిరం ట్రస్ట్ స్వచ్ఛందంగా, మెరుపు వేగంతో తప్పుపై చర్య తీసుకోవడానికి మధ్య ఉన్న ఈ స్పష్టమైన వ్యత్యాసాన్ని మీడియా గమనించక పోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది. వాస్తవాల కాలక్రమాన్ని చూడండి:

జూన్ 4: మొదటి ఆధారం బయటపడింది. మందిర ప్రాంగణంలోని ఒక స్నానాల గదిలో, ఎవరికీ చెందని ఒక సంచిలో రూ. 2 లక్షల నగదు లభ్యమైంది. ట్రస్ట్ అధికారులు వెంటనే సీసీటీవీ ఫుటేజీని సమీక్షించడం ప్రారంభించారు.

జూన్ 5: ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్, కీలక అనుమానితుడు అవినాష్ శుక్లాను లక్ష్యంగా చేసుకుని అంతర్గత విచారణకు ఆదేశించారు. పోలీసులు రాకముందే అతని ఇంటిపై దాడి చేసి, రూ. 58 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. రాయ్ తన సొంత సన్నిహిత వర్గంలోని వ్యక్తిపైనే మొదటి వేటు వేశారు. ఈ కఠినమైన చర్య ఇతర సహచరులను భయపెట్టి, దొంగిలించిన డబ్బును తిరిగి బ్యాంకు ఖాతాల్లో రహస్యంగా జమ చేసేలా చేసింది. దీంతో ఈ సమస్యను అంతర్గతంగానే పరిష్కరించుకోవచ్చని ట్రస్ట్ కొంతకాలం పాటు భావించింది.

జూన్ 7: రికవరీ వార్త బయటకు పొక్కడంతో, బంగారం, వెండి చోరీ అయ్యాయనే వదంతులు వ్యాపించాయి. డబ్బును అంతర్గతంగానే పూర్తిగా రికవరీ చేయవచ్చనే ప్రాథమిక అంచనాలపై ఆధారపడి, ఆడిట్‌లలో ఎటువంటి ముఖ్యమైన వ్యత్యాసాలు కనబడలేదని రాయ్ పేర్కొన్నారు.

జూన్ 13: ఆ అంచనా తప్పని గ్రహించిన ట్రస్ట్, ఉన్నత స్థాయి సిట్ విచారణను ఏర్పాటు చేయాలని యూపీ ప్రభుత్వాన్ని లాంఛనంగా కోరింది. ఈ ఆరు రోజుల స్తబ్ధత మొత్తం చర్యలో జరిగిన ఏకైక జాప్యంగా మిగిలింది.

జూన్ 25: క్యాష్ కౌంటర్ ఉద్యోగి మనీష్ యాదవ్, సీసీటీవీ బ్లైండ్ స్పాట్‌లను ఆసరాగా చేసుకుని పదేపదే డబ్బు దొంగిలించినట్లు సిట్ విచారణలో వెల్లడైంది. ఎఫ్ఐఆర్ నమోదైంది. జూన్ 26 తెల్లవారుజాము వరకు అర్ధరాత్రి మెరుపు వేగంతో దాడులు నిర్వహించగా, ఎనిమిది మందిని అరెస్టు చేశారు.

జూన్ 26: పరిపాలనా లోపాలకు పూర్తి నైతిక బాధ్యత వహిస్తూ, ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్, ట్రస్టీ అనిల్ మిశ్రా రాజీనామా చేశారు.

లెక్కింపు ప్రక్రియను స్థానిక ఎస్‌బీఐ శాఖకు అప్పగించగా, ఆ శాఖ 'సైనిక్ సెక్యూరిటీ సర్వీసెస్' అనే పొరుగు సంస్థను నియమించుకుంది. ట్రస్ట్ సిఫార్సు చేసిన కొందరితో సహా, ఎస్‌బీఐ 19 మంది సిబ్బందిని నియమించింది. అరెస్ట్ అయిన ఎనిమిది మందిలో, ఆరుగురు ఈ లెక్కింపు బృందానికి చెందినవారు కాగా, ఇద్దరు ట్రస్ట్ ఉద్యోగులు. వీరిలో ఒకరు, 'సమ్మకం నమ్మకాన్ని పెంచుతుంది' అనే ఆర్ఎస్ఎస్ మూల సూత్రంపై ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ తనపై ఉంచిన అపారమైన నమ్మకానికి ద్రోహం చేశారు. వ్యవస్థాగత కఠినత్వంపై కాకుండా, వ్యక్తిగత నమ్మకంపై అతిగా ఆధారపడటం వల్లే ఈ దొంగతనం జరిగింది. లెక్కింపు నియమావళిలో మితిమీరిన సడలింపులు ఉండటంతో, కుమ్మక్కుకు అస్కారం ఏర్పడింది. ఇది పరిపాలనా నిర్లక్ష్యానికి దారితీసి, దొంగతనానికి మార్గం సుగమం చేసింది. చంపత్ రాయ్ స్వయంగా చెప్పినట్లుగా, తాను గాఢంగా విశ్వసించిన వారే తనను మోసం చేశారు.

బుల్డోజర్ చర్య

దొంగిలించిన నగదులో ఇప్పటివరకు రూ.80 లక్షలను స్వాధీనం చేసుకున్నారు. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నిందితులకు చెందిన మిగిలిన ఆస్తుల ఆచూకీని కనుగొనడంతో పాటు, ఏవైనా ఇతర విలువైన వస్తువులు కూడా అపహరణకు గురయ్యాయా? అనే కోణంలో దర్యాప్తు చేస్తోంది. కేవలం రూ. 20,000 జీతం కలిగిన ఒక దొంగ నిర్మించిన రూ. 80 లక్షల విలువైన ఇంటిని బుల్డోజర్‌తో కూల్చివేయడం ద్వారా, తప్పు చేసిన వారి పట్ల ప్రభుత్వానికి ఉన్న కఠిన వైఖరి స్పష్టమవుతోంది.

చోరీ చేసింది తక్కువే?

రామమందిరానికి ఇప్పటివరకు రూ. 3,000 కోట్లకు పైగా విరాళాలు అందాయని, అందులో 90 శాతానికి పైగా బ్యాంక్ బదిలీల ద్వారా సురక్షితంగా చేరాయని సమాచారం. ఏప్రిల్, 2025 – ఫిబ్రవరి, 2026 మధ్య కాలంలో హుండీ ద్వారా రూ. 74 కోట్ల నగదు సేకరణ జరిగింది. ఈ నగదు నిధి నుండే దొంగతనం జరిగింది. అంతర్గత ఆడిట్‌లు, ప్రాథమిక సిట్ నివేదికల ఆధారంగా, మొదట్లో దుర్వినియోగమైన మొత్తం రూ. 7 కోట్ల నుండి రూ. 7.5 కోట్ల వరకు ఉంటుందని అంచనా వేశారు. ట్రస్ట్ వర్గాల నుండి తెలిసిన తాజా అంచనా ప్రకారం, ఈ మొత్తం చాలా తక్కువ. ఇందులో ఎక్కువ భాగం నగదు రూపంలోనూ, మరికొంత ఆస్తుల రూపంలోనూ తిరిగి స్వాధీనం చేసుకోవడం జరిగింది. ఒక్క గ్రాము ఆభరణం కూడా పోలేదని ట్రస్ట్ వర్గాలు ధృవీకరించాయి. చోరీ చేసిన నగదుకు సంబంధించిన తాజా అంచనా, ఆభరణాలేవీ పోకపోవడం అనే అంశాలు సిట్ ద్వారా తుది నిర్ధారణకు వస్తే, రూ.200 కోట్ల భారీ స్కామ్ జరిగిందంటూ ప్రతిపక్షాలు చేస్తున్న బాధ్యతా రహితమైన ఆరోపణలకు అది గట్టి ఎదురుదెబ్బ అవుతుంది. కోర్టు పర్యవేక్షణలో విచారణ జరగాలన్న వారి డిమాండ్, ప్రభుత్వ ట్రస్ట్ వ్యవహారాల్లో చర్యలు లేనప్పుడు కోర్టులు జోక్యం చేసుకుని విచారణను ప్రారంభించాల్సి వచ్చే పరిస్థితికి,మందిరం ట్రస్ట్ అత్యంత వేగంగా స్పందించి చర్యలు తీసుకోవడానికి మధ్య ఉన్న స్పష్టమైన వ్యత్యాసాన్ని విస్మరిస్తోంది. ఇక, వచ్చే ఏడాది ప్రారంభంలో ఉత్తరప్రదేశ్‌లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో, మందిరం వ్యవహారం రాజకీయ రణరంగంగా మారిన తరుణంలో ఈ దొంగతనం వల్ల తలెత్తిన రాజకీయ ,సైద్ధాంతిక ఘర్షణల విషయానికి వద్దాం.

హిందూ జాతీయవాదం

దొంగిలించిన ఒక్క రూపాయి కూడా శ్రీరామునికి జరిగిన ఘోరమైన ద్రోహమే. రాముడు కేవలం ఒక విగ్రహం కాదు. ఆయన ఈ ప్రాచీన జాతికి ఆత్మ స్వరూపం. మన నాగరికతా స్ఫూర్తిని విచ్ఛిన్నం చేసిన బూటకపు లౌకికవాద రాజకీయ వ్యవస్థను నిశ్చయంగా సరిదిద్దిన అయోధ్య ఉద్యమానికి ఆయనే ప్రతీక. రామమందిరం ఉద్యమం మన జాతీయ జీవన విధానాన్ని ఎలా పునర్వ్యవస్థీకరించిందో గుర్తుచేసుకుంటే, మీడియా తరచుగా మరచిపోయే చరిత్రలోని ఒక చిన్న భాగం ఇక్కడ ఉంది. స్వాతంత్ర్యం తరువాత, స్వాతంత్ర్య ఉద్యమం స్ఫూర్తిదాయక ఆదర్శాలు, చిహ్నాలుగా స్వామి వివేకానంద, మహర్షి అరబిందో యోగి, గాంధీజీ ప్రతిపాదించిన హిందూ జాతీయవాద భావన, రామరాజ్య దార్శనికత, 'భారత్ మాతా కీ జై', 'వందేమాతరం' వంటి స్వాతంత్ర్య పోరాట నినాదాలు విస్మరణకు గురయ్యాయి. రామమందిరం ఉద్యమం వాటి పునరుజ్జీవనానికి ఉత్ప్రేరకంగా పనిచేసింది. జాతీయ చర్చను నడిపిస్తున్న వారిలో

చాలా మందికి 'హిందూ రాష్ట్రం' (హిందూ జాతీయవాదం) అనే భావన ఆర్ఎస్ఎస్ సృష్టించినది కాదనే విషయం తెలియదు. అవును, అది ఆర్ఎస్ఎస్ భావజాలం కాదు. ఆర్ఎస్ఎస్ ఏర్పడటానికి దశాబ్దాల ముందే, ఈ జాతీయవాదాన్ని వివేకానంద, అరబిందులు ప్రబోధించారు. అది స్వాతంత్ర్య పోరాటానికి చోదక శక్తిగా మారింది. నమ్మండి.. నమ్మకపోండి! గాంధీజీ, నెహ్రూ, చివరికి కమ్యూనిస్ట్ దిగ్గజం రజనీ పాల్మే దత్ వంటి నాయకులు కూడా దీనిని పూర్తిగా అంగీకరించారు. తన విశిష్ట గ్రంథమైన హింద్ స్వరాజ్ (1909)లో హిందూ తీర్థయాత్రలు, చార్‌ధామ్ యాత్రలు, గంగాజల పూజలు మన జాతీయ సమైక్యతకు, జాతీయవాదానికి ప్రతీకలుగా నిలుస్తాయి అని గాంధీజీ రాశారు. "ఇద్దరు ఆంగ్లేయులు ఏకం కాలేరు. కానీ ఇవి మనల్ని ఏకం చేస్తాయి" అని ఆయన రాశారు. ముస్లింల గురించి అడిగినప్పుడు, వారు జాతీయ జన జీవన ప్రధాన ప్రవంతిలో చేరాలని ఆయన అన్నారు. ఈ విషయం మీడియాలో ఎంతమందికి తెలుసు?

స్వామి వివేకానందను భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమ మార్గదర్శకుడిగా నెహ్రూ కొనియాడారు. ఆయన తన 'గ్లింప్సెస్ ఆఫ్ వరల్డ్ హిస్టరీ' (1935) గ్రంథంలో "స్వామి ప్రబోధించిన హిందూ జాతీయవాదం హిందూ ధర్మం, సంస్కృతిలో లోతుగా వేళ్లూనుకుంది. అయినప్పటికీ అది ఏ విధంగానూ ముస్లింలకు వ్యతిరేకం కాదు" అని రాశారు (పే. 437).

"హిందూ జాతీయవాదానికి, నిజమైన జాతీయ వాదానికి మధ్య గీత గీయడం అంత సులభం కాదు. ఆ రెండూ కలిసిపోతాయి. ఎందుకంటే హిందువులకు భారతదేశమే ఏకైక నివాసం, అక్కడ వారే అధిక సంఖ్యాకులు" అని కూడా రాశారు(పే. 720). నేటి ప్రజా చర్చల్లో పాల్గొనేవారిలో ఎంతమంది నెహ్రూ రాసిన 'గ్లింప్సెస్ ఆఫ్ వరల్డ్ హిస్టరీ'ని చదివారు?

గ్రేట్ బ్రిటన్ కమ్యూనిస్ట్ పార్టీని స్థాపించిన భారతీయుడైన రజనీ పాల్మే దత్, తన 'ఇండియా టుడే' అనే పుస్తకంలో ఒకవేళ భారతీయులు ఆశ్రమ జీవనంలో వేదాలను మాత్రమే అభ్యసిస్తూ పెరిగినా, స్వాతంత్ర్య పోరాటానికి అవసరమైన స్ఫూర్తిని వారు నిస్సందేహంగా వాటి నుండే పొంది ఉండేవారు అని రాశారు. మీడియాలో ఎంతమందికి ఆయన పేరు తెలుసు? ఆయన 1939లో ఆ పుస్తకాన్ని రాసి, 1973లో దాన్ని సవరించినప్పటికీ 1939లో తాను చెప్పినదాన్ని మార్చలేదని ఎంతమందికి తెలుసు?

హిందూ జాతీయవాదంలో దృఢంగా వేళ్లూనుకున్న ఈ స్వాతంత్ర్య ఉద్యమం, మార్చి 22, 1940న తన గమనాన్ని అనూహ్యంగా మార్చుకుంది. ఎం.ఎ.జిన్నా నాయకత్వంలోని ముస్లిం

లీగ్ దేశ విభజన తీర్మానాన్ని ఆమోదించిన రోజు అది. ఆ రోజు నుండి, స్వాతంత్ర్య కథనం నుండి హిందూ జాతీయవాద దృక్పథాన్ని క్రమపద్ధతిలో తుడిచిపెట్టారు. వందేమాతరం, భారత్ మాతా కీ జై నినాదాలు ప్రజా జీవితం నుండి కనుమరుగవడం ప్రారంభించాయి. స్వాతంత్ర్యం తర్వాత నెహ్రూ నాయకత్వంలోని కాంగ్రెస్ ఒకప్పుడు నెహ్రూ స్వయంగా కీర్తించిన ఆదర్శాలను, చిహ్నాలను నిర్ద్వంద్వంగా తిరస్కరించింది. మన స్వాతంత్ర్యానికి పునాదులైన హిందూ జాతీయవాదం, వందేమాతరం, భారత్ మాతా కీ జై, రామరాజ్యం వంటివి బూటకపు లౌకిక రాజకీయ వ్యవస్థ వల్ల అనాథలుగా మిగిలిపోయాయి. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం సాగిన బూటకపు లౌకికవాద సునామీ ఉధృతి మధ్య, ఈ ఉదాత్తమైన భావజాలాలు, చిహ్నాల జ్యోతిని సజీవంగా ఉంచింది ఆర్ఎస్ఎస్సే.

ఆర్ఎస్ఎస్ నేతృత్వంలోని రామమందిరం ఉద్యమమే స్వాతంత్ర్యానికి పూర్వపు హిందూ జాతీయవాద విలువలను పునరుద్ధరించి, పట్టాలు తప్పిన జాతీయ రాజకీయ వ్యవస్థను తిరిగి సరైన మార్గంలోకి తీసుకువచ్చింది. భారతదేశ లౌకిక రాజ్యాంగంతో హిందుత్వానికి పొంతన లేదని కొందరు 'మిథ్యా లౌకికవాదులు' (pseudo-secularists) సవాలు చేసినప్పుడు, సుప్రీంకోర్టు 1996లో ఒక చారిత్రాత్మక తీర్పును వెలువ రించింది. హిందుత్వ అనేది భారతీయ ప్రజల జాతీయ ఆత్మ, సంస్కృతి, జీవన విధానం అని కోర్టు స్పష్టంగా పేర్కొంది. ఆ తర్వాత ఆ తీర్పును సమీక్షించాలన్న అభ్యర్థనలను కోర్టు పలుమార్లు తిరస్కరించడం ద్వారా, మన దేశం జాతీయవాదానికి ఉన్న హిందూ మూలాలను ధృవీకరించింది.

జాతీయవాదాన్ని దెబ్బతీయడానికి ఆయుధంగా దొంగతనం

రామమందిరం ఉద్యమం ఓటు ఆధారిత బూటకపు లౌకిక రాజకీయాలను విజయవంతంగా కూలదోసి, తద్వారా హిందూ జాతీయవాద దృక్పథానికి రాజ్యాంగంలో దాని సముచిత స్థానాన్ని పునఃస్థాపించింది. ఇప్పుడు, ఈ మందిరంలో జరిగిన దొంగతనాన్ని ఆయుధంగా వాడుకుంటూ, రామ మందిరం ఉద్యమం ద్వారా దేశం సాధిస్తున్న దిద్దుబాటు చర్యలను తీవ్రంగా వ్యతిరేకించిన శక్తులు, దానిని పట్టాలు తప్పించి, దేశాన్ని తిరిగి బూటకపు లౌకికవాద అగాధంలోకి లాగడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. రామమందిరం ఉద్యమం ప్రతిష్టను దెబ్బతీయడానికి ప్రతిపక్షాలు, జాతీయ, అంతర్జాతీయ మీడియాలోని కొన్ని వర్గాలు చేస్తున్న ప్రయత్నాలే బీజేపీకి ప్రస్తుత రాజకీయ, ఎన్నికల సవాలుగా ఉన్నాయి.

జాతీయ పునరుజ్జీవనానికి కేంద్రబిందువైన ఉత్తరప్రదేశ్‌లో ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో, స్వాతంత్ర్యానికి పూర్వం నాటి హిందూ జాతీయవాద రాజకీయ తత్వాన్ని గుర్తుచేసి, పునఃస్థాపించిన ఆలయ ఉద్యమాన్ని విచ్ఛిన్నం చేయడానికి ఈ దొంగతనాన్ని ఉపయోగించుకోవడం అనే విమర్శకుల లక్ష్యం సుస్పష్టంగా ఉంది. యూపీ ఎన్నికలకు ఇంకా నెలల సమయం ఉన్నందున, ఈ దొంగతనాన్ని ఉపయోగించుకుని ప్రభావం చూపించాలన్న ప్రతిపక్షాల ప్రయత్నం, పోలింగ్ ముగిసే వరకు ఈ అంశాన్ని సజీవంగా ఉంచగల వారి సామర్థ్యంపై ఆధారపడి ఉంటుంది. ఎందుకంటే సోషల్ మీడియా ప్రాబల్యం ఉన్న ఈ వ్యవస్థలో, అన్ని అంశాల ప్రాముఖ్యత రానురాను తగ్గిపోతోంది. ఒకవేళ ఈ దొంగతనం ఒక చిన్న విషయమని, ఎలాంటి ఆభరణాలు పోలేదని సిట్ నిర్ధారిస్తే, ప్రతిపక్షాలు పరువు కోల్పోతాయి. ఎన్నికలకు చాలా ముందే ఈ అంశం చరిత్రలో కలిసిపోతుంది.

ఎస్. గురుమూర్తి
సంపాదకులు, తుగ్లక్ తమిళ పత్రిక

('ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్' సౌజన్యంతో)

రామమందిరాన్ని లక్ష్యంగా చేసుకుని విస్తరిస్తున్న నకిలీ వార్తలు, సమన్వయంతో కూడిన దుష్ప్రచారాలు ఆ పుణ్యక్షేత్రాన్ని అప్రతిష్టపాలు చేయడానికి సనాతన వ్యతిరేక శక్తులు చేస్తున్న తీవ్ర ప్రయత్నాన్ని బట్టబయలు చేస్తోంది. ఈ సమగ్ర నివేదిక దురుద్దేశపూరిత అబద్ధాల వలయాన్ని నిశితంగా ఛేదిస్తుంది. దొంగతనం, ఆర్థిక అవకతవకలపై ప్రతి ఒక్క ఆరోపణను వాస్తవాలు, అధికారిక దర్యాప్తుల ద్వారా ఖండనకు అర్హమైన వైనాన్ని వెల్లడిస్తోంది. రామమందిరం నుండి బంగారు రామచరితమానస్, కాక్‌భూషుండి విగ్రహం, ధనుస్సు, వెండి ఫలకం, కిరీటం సహా అనేక పవిత్ర వస్తువులు అదృశ్యమయ్యాయని సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ ఇటీవల నిరాధారమైన ఆరోపణలు చేశారు. ఈ దుష్ప్రచారాలను శ్రీ రామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ వెంటనే ఖండించింది. ప్రతి ఒక్క పవిత్ర వస్తువు పూర్తిగా సురక్షితంగా ఉందని స్పష్టం చేసింది.

అడుగడుగునా అబద్ధాలు.. ఇవిగో నిజాలు..!

బంగారు రామచరితమానస్ మందిర ప్రాంగణంలో భద్రంగా ఉంది. పూజనీయమైన కాక్ భూషుండి విగ్రహం భరత్ కుటి మందిరంలో సంరక్షణలో ఉంది. అక్కడ విగ్రహానికి నిత్య ధూప దీపనైవేద్యాలు నిరాటంకంగా కొనసాగుతున్నాయి. భవ్యమైన రామమందిరాన్ని అప్రతిష్టపాలు చేయడానికి, సనాతన ధర్మాన్ని బలహీనపరచడానికి బరితెగించిన ప్రయత్నాలు జరుగుతున్నాయి. మందిరానికి అందిన విరాళాల గురించి భక్తులను తప్పుదారి పట్టించేలా దురుద్దేశపూర్వకమైన పుకార్లను సృష్టించడం సనాతనధర్మ వ్యతిరేకశక్తులకు ఇది మొదటిసారి కాదు.

పొంతన లేని ఫొటోతో అసత్య ప్రచారం

ఒక కారులో దాచిన నగదు ఫొటోను సనాతన ధర్మ వ్యతిరేక ప్రచారకులు తెరమీదకు తెచ్చారు. దానిని మందిరంలో విరాళాల దొంగతనంతో కావాలనే ముడిపెట్టారు. రామమందిరాన్ని అప్రతిష్టపాలు చేయడానికి ఒక పథకం ప్రకారం తప్పుడు ప్రచారానికి దిగారు. విశ్వాస్ న్యూస్ జరిపిన ఫ్యాక్ట్ చెక్ – వాస్తవ విచారణ ఈ మోసాన్ని పూర్తిగా బట్టబయలు చేసింది. నిందితుడు అవినాష్ శుక్లా ఫొటో నిజమైనదే అయినప్పటికీ స్వాధీనం చేసుకున్న నగదు దృశ్యానికి ,అయోధ్య వ్యవహారంతో ఏమాత్రం సంబంధం లేదని తేలింది. ఛత్తీస్‌గఢ్‌లో పోలీసులు జరిపిన దాడులకు సంబంధించి ఈ నగదు వీడియో(దీని నుంచి ఫొటోను సృష్టించారు) 2025 నుండి ప్రచారంలో ఉంది. జూన్ 25,2026న అయోధ్య విరాళాల అవకతవకలకు సంబంధించిన ఎఫ్ఐఆర్ దాఖలైంది. కనుక ఒక నకిలీ స్కామ్‌ను సృష్టించడానికి సంబంధంలేని ఫొటోలను, వీడియోలను ఆలయ వ్యతిరేక శక్తులు కావాలనే వ్యాపింప జేస్తున్నాయనే విషయం దీనితో బట్టబయలైంది.

పుకార్లకు చెల్లుచీటీ.. కాక్‌భూషుండి విగ్రహం భద్రం

విరాళంగా ఇచ్చిన వెండి కాక్‌భూషుండి విగ్రహం రామమందిర ప్రాంగణం నుండి అదృశ్యమైందంటూ వ్యాపించిన కథనం భక్తులను దిగ్భ్రాంతికి గురి చేసింది. కానీ ఆ విగ్రహం పూర్తిగా సురక్షితంగా ఉందని అధికారిక ధ్రువీకరణలో రుజువు కావడంతో ఆ కథనం బూటకమని తేలింది. మెరుగైన భద్రత, సంరక్షణకోసం, ఆ పవిత్ర విగ్రహాన్ని అయోధ్యలోని ప్రసిద్ధ భరత్ కుటీ మందిరంలో జాగ్రత్తగా ఉంచారు. ఆ విగ్రహం భద్రంగా ఉందని, అది కనిపించకుండా పోయిందంటూ వైరల్ అవుతున్న ఆరోపణలు పూర్తిగా కల్పితమని స్థానిక పూజారి అనురాగ్ పాండే ధ్రువీకరించారు. దీంతో ఆలయంలో విగ్రహాల నిర్వహణపై అపవాదులు వేయడానికి పనిచేస్తున్న దుష్ప్రచార యంత్రాంగానికి గట్టి దెబ్బ తగిలింది.

దర్యాప్తు సంస్థలు, కఠినమైన వాస్తవ తనిఖీల మద్దతుతో సంపూర్ణ పారదర్శకతను కలిగి ఉన్న శ్రీరామ్ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఈ దుష్ప్రచారాలకు వ్యతిరేకంగా ఒక దుర్భేద్యమైన కోటలా నిలుస్తోంది. పుణ్యక్షేత్రం పవిత్రత, సంపద, వైభవం పూర్తిగా అభేద్యంగా, సురక్షితంగా ఉండేలా భరోసా ఇస్తోంది.

విరాళం వాపసు పోస్టు కార్డు నకిలీది

మధ్యప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు జితు పట్వారీ, రామమందిరానికి తాను ఇచ్చిన రూ. 1,100 విరాళాన్ని వాపసు ఇవ్వాలని డిమాండ్ చేశారన్నట్లుగా, మందిర వ్యతిరేకశక్తులు ఒక కల్పిత పోస్ట్‌కార్డును సోషల్ మీడియాలో ప్రచారం చేశాయి. అయితే, జరిపిన డిజిటల్ ఫోరెన్సిక్స్, పరిశోధన, విశ్లేషణ కేంద్రం (డీఎఫ్ఆర్ఏసీ) కఠినమైన వాస్తవ తనిఖీలో ఆ పోస్టుకార్డు పూర్తిగా నకిలీదని తేలింది. దీంతో అలాంటి ప్రకటన గానీ, పోస్ట్‌కార్డు గానీ ఎన్నడూ జారీ కాలేదని నిర్ధారణ అయింది. వైరల్ అయిన ఆ పోస్ట్ పూర్తిగా అబద్ధమని జితు పట్వారీతో పాటుగా మధ్యప్రదేశ్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అమిత్ శర్మ ఖండించారు. ఈ పవిత్ర పుణ్యక్షేత్రం చుట్టూ అనవసర వివాదాలను సృష్టించడానికి నిరంతరం నకిలీ వార్తలను అరాచక శక్తులు కల్పిస్తున్న వైనాన్ని ఇది స్పష్టం చేస్తుంది.

బంగారు రామచరితమానస్ భద్రం

తమ కుటుంబం విరాళంగా ఇచ్చిన సుమారు రూ. 5 కోట్ల విలువైన 151 కిలోల బంగారు పూత పూసిన రామచరితమానస్‌ను రామమందిరం నుంచి రహస్యంగా తొలగించారని ఆరోపించడం ద్వారా కేంద్ర హోం శాఖ మాజీ కార్యదర్శి, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎస్. లక్ష్మీనారాయణన్ అనవసరమైన వివాదాన్ని లేవనెత్తారు. ఆయన చేసిన నిరాధారమైన ఆరోపణలను శ్రీరామ్ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ వెంటనే ఖండించింది.

ఆ బంగారు గ్రంథం పూర్తిగా సురక్షితంగా ఉందని, దానికి లెక్క కూడా ఉందని ప్రజలకు భరోసా ఇచ్చింది. స్థలాభావం, భద్రతా కారణాల దృష్ట్యా, అధిక విలువ కలిగిన ప్రతి విరాళాన్ని అందరికి కనిపించే ప్రాంతంలో ఒకేసారి ప్రదర్శించడం ఆచరణ సాధ్యం కాదని ట్రస్ట్ స్పష్టం చేసింది. తద్వారా ఆలయ పారదర్శకతను ప్రశ్నార్థకం చేయాలనుకున్న ఆ మాజీ అధికారి ప్రయత్నాన్ని సమర్థవంతంగా తిప్పికొట్టింది.

రామమందిరంలో చోరీకి బెంగళూరు ఘటన వీడియోతో లింకు!

భవ్యమైన మందిరం చుట్టూ అరాచకం నెలకొని ఉందనే తప్పుడు ప్రచారం చేయడానికి ఒక గుడిలో చోరీకి సంబంధించి వైరల్ అయిన ఒక సీసీటీవీ వీడియోను రామమందిరం వ్యతిరేకులు రంగంలోకి దించారు. ఇండియా టుడే చేసిన ఒక వాస్తవ తనిఖీ ఈ నకిలీ కథనాన్ని ఖండించింది. ఆ ఫుటేజ్ వాస్తవానికి 2024లో బెంగళూరులోని గాలి ఆంజనేయ స్వామి మందిరంలో జరిగిన ఒక సంఘటనకు సంబంధించినదని వెల్లడించింది. రామ జన్మభూమి ప్రాంగణం పవిత్రతను, భద్రతను అపఖ్యాతిపాలు చేయడానికి, కర్ణాటకకు చెందిన ఈ పాత వీడియోను ఆన్‌లైన్‌లో వామపక్ష– ఉదారవాద వర్గాలు మోసపూరితంగా తిరిగి ప్రచారం చేశాయి.

200 కిలోల వెండి చోరీ అవాస్తవం

రామ మందిరం నుండి విరాళంగా వచ్చిన దాదాపు 200 కిలోగ్రాముల వెండి ఇటుకలు, కడ్డీలు చోరీకి గురయ్యాయని ఆరోపిస్తూ మీడియాలో ఒక వర్గం చేసిన ప్రచారాన్ని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం నియమించిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) పూర్తిగా ఖండించింది. సిట్ జరిపిన సమగ్ర ఆడిట్‌లో ఎటువంటి దొంగతనం జరగలేదని నిర్ధారణ అయింది. ఆలయ నిర్మాణ అవసరాల కోసం చాలా వరకు వెండిని చట్టబద్ధంగా కరిగించగా, అనేక వెండి కడ్డీలను అధికారిక నాణేలుగా ముద్రించడం కోసం సెక్యూరిటీ ప్రింటింగ్ అండ్ మింటింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు భద్రంగా పంపించారు. ఆలయ రికార్డులలో ప్రతి గ్రాము వెండి కూడా నమోదు చేసినట్టు తేలింది. దీంతో ఆ తప్పుడు ప్రచారం పూర్తిగా అసత్యమని తేలింది.

వెండి ఇటుక సురక్షితం.. రౌత్ ఆరోపణ అసత్యం

తమ పార్టీ విరాళంగా ఇచ్చిన 4 కిలోల వెండి ఇటుక అదృశ్యమైందని ఆరోపిస్తూ ఆలయ ట్రస్టును లక్ష్యంగా చేసుకునేందుకు శివసేన (యూబీటీ) నాయకుడు, రాజ్యసభ ఎంపీ సంజయ్‌రౌత్ ప్రయత్నించారు. అయితే, ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) జరిపిన క్షుణ్ణమైన పరిశీలనలో ఆయన ఆరోపణ కేవలం రాజకీయ ఆర్భాటమేనని తేటతెల్లమైంది.

ఆ విరాళం అధికారిక లెడ్జర్లలో పక్కాగా నమోదై ఉన్న వైనాన్ని సిట్ కనుగొంది. అంతేకాకుండా, విరాళంగా వచ్చిన వెండిని భవ్యమైన ఆలయ నిర్మాణానికి నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగానే కచ్చితంగా వినియోగిస్తున్నామని, విలువైన కానుకలన్నీ పూర్తిగా సురక్షితంగా ఉన్నాయని శ్రీరామ్ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ పునరుద్ఘాటించింది.

రామమందిరంపై బీజేపీ ఎంపీ మనోజ్ తివారీ వ్యాఖ్య కల్పితం

భక్తులను ఆగ్రహానికి గురిచేసేలా రూపొందించిన కల్పిత గ్రాఫిక్స్ సోషల్ మీడియాలో వెల్లువెత్తాయి. వాటిలో నవభారత్ టైమ్స్ లోగోతో ఉన్న ఒక నకిలీ పోస్ట్‌కార్డ్ కూడా ఉంది. ఆ పోస్ట్‌కార్డ్‌లో "మేము రామ మందిరాన్ని నిర్మించాము; మేము దానిని దోచుకున్నా, దొంగిలించినా, లేదా అమ్మేసినా, దానితో ప్రతిపక్షానికి ఏమి సంబంధం?" అని బీజేపీ ఎంపీ మనోజ్ తివారీ అన్నట్లు తప్పుగా చిత్రీకరించారు.

ఓన్లీ ఫ్యాక్ట్ జరిపిన దర్యాప్తులో ఆ వ్యాఖ్య పూర్తిగా కల్పితమని, ఆ మీడియా సంస్థ అటువంటి నివేదికను ఎన్నడూ ప్రచురించలేదని రుజువైంది. నవభారత్ టైమ్స్ ఆ గ్రాఫిక్‌ను పూర్తిగా నకిలీదని అధికారికంగా ప్రకటించగా, తన వ్యక్తిత్వాన్ని, పవిత్ర ఆలయాన్ని అప్రతిష్టపాలు చేయడానికి పన్నిన ఈ పథకాన్ని మనోజ్ తివారీ తీవ్రంగా ఖండించారు.

సీఎం యోగిపై అభూత కల్పన

2027లో రామ మందిర నిధులపై తమ పార్టీ(బీజేపీ) మాత్రమే సంపూర్ణ నియంత్రణను కలిగి ఉంటుందని, ప్రతిపక్షాలు వాటిని దుర్వినియోగం చేయకుండా ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ అడ్డుకున్నట్లు ఒక డిజిటల్ మార్ఫింగ్ గ్రాఫిక్‌ను ప్రచార నెట్‌వర్క్‌లు వ్యాప్తి చేశాయి. అయితే, వైరల్ అయిన ఆ చిత్రం ఎన్‌డీటీవీ ఇండియాకు చెందిన ఒక అసలైన వార్తా గ్రాఫిక్‌ను మార్ఫింగ్ చేసి సృష్టించిన ఒక చౌకబారు నకిలీదని వివరణాత్మక డిజిటల్ ఫోరెన్సిక్ విశ్లేషణలో రుజువైంది. ముఖ్యమంత్రి అటువంటి ప్రకటన ఎన్నడూ చేయలేదు. ఇది రామ మందిర నిధుల స్వచ్ఛమైన ఆర్థిక నిర్వహణపై సందేహాలు రేకెత్తించి, రాజకీయం చేయడానికి అరాచక శక్తులు చేస్తున్న ఒక వ్యవస్థీకృత ప్రయత్నాన్ని బట్టబయలు చేసింది.

రామ మందిరం చుట్టూ కేంద్రీకృతమైన సాంస్కృతిక, ఆధ్యాత్మిక పునరుజ్జీవనాన్ని దెబ్బతీయడమే లక్ష్యంగా ఈ నిరాధారమైన వదంతులు, అభూత కల్పనలు వెల్లువెత్తుతున్నాయి. నిధులు పుష్కలంగా ఉన్న సనాతనధర్మ వ్యతిరేక శక్తులు ఈ దురాగతానికి పాల్పడుతున్నాయి. రాజకీయ ఆర్భాటాల నుండి చౌకబారు డిజిటల్ కుతంత్రాల వరకు ఇవ్వన్నీ కూడా ఆలయ ట్రస్టును అప్రతిష్టపాలు చేయడానికి, సనాతన ధర్మాన్ని అనుసరించే వారి మనోభావాలను దెబ్బతీయడానికి ఉద్దేశించినవి. ఇలాంటి ప్రతి ఒక్క కథనం, అభూతకల్పనలు వాస్తవాలు, అధికారిక దర్యాప్తుల ద్వారా పూర్తిగా వీగిపోయాయి. దర్యాప్తు సంస్థలు, కఠినమైన వాస్తవ తనిఖీల మద్దతుతో సంపూర్ణ పారదర్శకతను కలిగి ఉన్న శ్రీరామ్ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఈ దుష్ప్రచారాలకు వ్యతిరేకంగా ఒక దుర్భేద్యమైన కోటలా నిలుస్తోంది. పుణ్యక్షేత్రం పవిత్రత, సంపద, వైభవం పూర్తిగా అభేద్యంగా, సురక్షితంగా ఉండేలా భరోసా ఇస్తోంది.

– జాగృతి డెస్క్



సిట్ దర్యాప్తుపై ఆర్ఎస్ఎస్ ఆశాభావం

శ్రీ రామజన్మభూమి మందిరంలోని విరాళాల పెట్టె కానుకల లెక్కింపులో జరిగిన అక్రమాల ఘటనపై రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) విచారం వ్యక్తం చేసింది. 'శ్రీ రామజన్మభూమి తీర్థక్షేత్ర' అభ్యర్థన మేరకు చేపట్టిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్), పోలీసుల చర్యలు ఒక నిర్ణయాత్మక దశకు చేరుకుంటాయనే విశ్వాసాన్ని వ్యక్తీకరించింది. రామమందిరం పట్ల రామభక్తులకు ఉన్న అపారమైన విశ్వాసం, భక్తిభావాలకు భంగం కలిగించేలాంటి ఘటనలు భవిష్యత్తులో జరగకుండా చూసుకోవాలని 'తీర్థక్షేత్ర ట్రస్ట్'ను కోరింది. జూలై 10 నుంచి 12వ తేదీ వరకు కర్ణాటకలోని బెలగావిలో మూడురోజుల పాటు జరిగిన ఆర్ఎస్ఎస్ వార్షిక అఖిల భారతీయ ప్రాంత ప్రచారక్ బైఠక్‌కు పూజనీయ సర్‌సంఘచాలక్ డాక్టర్ మోహన్ భాగవత్, సర్‌కార్యవాహ దత్తాత్రేయ హోసబళేతో పాటు 226 మంది కార్యకర్తలు హాజరయ్యారు. మార్చి, 2026 తర్వాత సంఘ్ ఆధ్వర్యంలో వివిధ స్థాయిలలో నిర్వహించిన శిక్షణా శిబిరాలపై సమీక్ష జరిగింది. ఈ ఏడాది దేశవ్యాప్తంగా మొత్తం 83 'సంఘ శిక్షా వర్గ్'లు, 12 'కార్యకర్త వికాస్ వర్గ్'లు పూర్తయ్యాయి. వీటిలో మొత్తం 18,842 మంది స్వయంసేవకులు శిక్షణ పొందారు. ఈ శిక్షణలో దైనందిన శాఖ, సంఘ కార్యపద్ధతి, గ్రామ వికాస్, కుటుంబ ప్రబోధన్, విపత్తు నిర్వహణ, పర్యావరణం వంటి అంశాలు ఉన్నాయి. శాఖా స్థాయిలో కార్యాచరణ ప్రణాళిక అమలుపై, సెప్టెంబర్ నెలకు సంబంధించిన 'శాఖా విస్తార్ యోజన'పై సమగ్ర చర్చలు జరిగాయి. సంఘ్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా పూర్తయిన కార్యక్రమాల సమీక్ష, మిగిలిన కార్యక్రమాల ప్రణాళికపై కూడా చర్చించారు. శతాబ్ది ఉత్సవ కార్యక్రమాల ద్వారా పరిచయమైన వ్యక్తులను సామాజిక సేవాకార్యకలాపాలు, 'పంచపరివర్తన' కార్యక్రమాలలో క్రియాశీలకంగా భాగస్వాములను చేసే ప్రణాళికలపై చర్చ జరిగింది. 2026-27 సంవత్సరానికిగాను పరమపూజనీయ సర్‌సంఘ చాలక్ పర్యటన ప్రణాళిక గురించి కూడా చర్చించారు. ఈ సమావేశంలో ప్రస్తుత పరిస్థితులకు సంబంధించిన వివిధ అంశాలపై చర్చించారు. ముఖ్యంగా జనగణన, జనాభా అసమతుల్యతవల్ల తలెత్తే సవాళ్లపై చర్చ జరిగింది. మాదకద్రవ్యాల వల్ల పెరుగుతున్న దుష్ప్రభావాలపై సమావేశం ఆందోళన వ్యక్తం చేసింది. వ్యసన విముక్తి కోసం ప్రాధాన్యతతో కూడిన కృషి అవసరం అని పేర్కొంది. సంత్ శిరోమణి రవిదాస్ మహారాజ్ 650వ జయంతి ఉత్సవాల నిర్వహణకు సంబంధించిన ప్రణాళికల గురించి కూడా సమావేశం చర్చించిందని జూలై 12న విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆర్ఎస్ఎస్ అఖిల భారతీయ ప్రచారప్రముఖ్ సునీల్ అంబేకర్ తెలిపారు.

ఖమ్మం : తెలంగాణ సంచారతెగల సంక్షేమసమితి ఆధ్వర్యంలో ఖమ్మంలోని మాధవనిలయంలో విద్యార్థుల ఆత్మీయసమ్మేళనం జూలై 12న జరిగింది. సంచార జాతుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పీటల స్వర్ణకుమార్ ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. 2026 పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సంచారతెగలసంక్షేమసమితి ప్రముఖులు సువీర్, సిద్ధి రాఘవేంద్ర, సభ్యులు మిట్టపల్లి చిరంజీవి, ఆవుల దుర్గేష్, సామాజిక సమరసత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జైపాల్‌రెడ్డి, సంచార తెగల కుటుంబాలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ASVINS
Specialty Hospitals
Care+Cure+Comfort

40+ Years of Oncology Expertise
Over **7,00,000** Patients Treated
75,000 Successful Surgeries

Dr. G. Suryanarayana Raju
M.S. Mch, FRCS, FUICC
Chief of Surgical Oncology
40+ Years of Experience

Dr. D. Raghunadharao
MD, DM, FRCP (London), FACP
Chief of Medical Oncology
40+ Years of Experience

Expert Treatment At Affordable Prices

We Expertise in Treating All Cancers

We do all types of Radical, Organ Sparing and Laparoscopic Surgeries

SERVICES

SURGICAL SPECIALTIES:

Anaesthesiology • Breast Surgery • Bone & Soft Tissue Tumors • Gynaecology & Gynaec Oncology Head & Neck Oncology • Minimal Access Surgery • Neurosurgery • Plastic & Reconstructive Surgery • Surgical Oncology Thoracic Oncology • Transplant Surgery • Urology, Andrology & Endo Urology • Vascular Surgery

MEDICAL SPECIALTIES:

Bone Marrow Transplant • Cardiology • Chest Medicine • Endocrinology • Gastroenterology Hematology & Hemato Oncology • Internal Medicine • Intensive Care • Medical Genetics • Medical Oncology • Nephrology & Dialysis • Neurology • Orthopaedic & Rheumatology

Asvins Specialty Hospitals

6-3-903/A&B, Raj Bhavan Road, Somajiguda, Hyderabad, Telangana 500082.

Book Your Consultation Now +91 9440445775

www.asvinshospitals.com

భీమవరంలో అశ్విన్ క్యాన్సర్ కేర్

ప్రతి నెల మొదటి ఆదివారం

ప్రముఖ సర్జికల్ ఆంకాలజిస్ట్

డా॥ జి. సూర్యనారాయణ రాజు
M.S. MCh, FRCS, FUICC సర్జికల్ ఆంకాలజీ అధినేత
వ్యవస్థాపక డైరెక్టర్, అశ్విన్స్ స్పెషలిటీ హాస్పిటల్స్
మాజీ సభ్యుడు, MARB, NMC, న్యూఢిల్లీ
మాజీ సహచరుడు. రీసెర్చ్ & ప్రాజెక్ట్స్ డీన్, రిజిస్ట్రార్, ప్రొఫెసర్
మరియు సర్జికల్ ఆంకాలజీ వ్యవస్థాపక అధిపతి, నిమ్స్

ప్రముఖ గైనో ఆంకాలజిస్ట్

డా॥ రమణి GSV
MS, OBG
కన్సల్టెంట్ గైనకాలజీ, గైనక్ ఆంకాలజీ & ప్రివెంటివ్ ఆంకాలజీ

అభినవ్ డయగ్నోస్టిక్స్, జెపి రోడ్, ఆనంద బ్లడ్ బ్యాంకు దగ్గర, భీమవరం
08816 224338

ప్రతి నెల రెండవ ఆదివారం

ప్రముఖ హేమాటో ఆంకాలజిస్ట్

డా॥ గెంటే. విక్రమ్ కుమార్
MBBS, MD ఇమ్యునో- హెమటాలజీ మరియు రక్త మార్పిడి (JIPMER),
పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్ ఇన్ క్లినికల్ హెమటాలజీ (CMC వెల్లూర్), కన్సల్టెంట్ హెమటాలజీ మరియు హెమటో- ఆంకాలజీ

లోటస్ డయగ్నోస్టిక్స్, జెపి రోడ్, ఆనంద బ్లడ్ బ్యాంకు దగ్గర, భీమవరం
08816 230555

అపాయింట్మెంట్ కొరకు అచ్చయ్య: **98858 45775** సీత: 9618161032

గణపతిదేవుడు

45

ఎంతో తీవ్ర ప్రయత్నం వల్ల గణపతిదేవుని చేజిక్కించుకుంది.మరుక్షణమే ఆమె తన బృందంతో తిరుగు ప్రయాణమైంది.

కానీ తిమ్మప్ప లేకుండా ఆ అడవిలో వెనక్కు వెళ్లడం చాలా కష్టమని ఆమెకు మరో గంటకే అర్థమైంది. దారి తప్పి కవ్వల బృందం ఎటేటో పోతోంది. అడవిలో నానప్పను ముక్కలుగా నరికిన చోటుకు కాస్త ఆవలగా వెళ్లారు. దగ్గరగా భరించలేని దుర్గంధం. అడవిలో ఎక్కడో ఏదో జంతువు చనిపోవడమూ, ఆ కళేబరం మట్టిలో కలిసేవరకు దుర్గంధం వ్యాపించడం సహజం. దగ్గరలో అలాంటి జంతు కళేబరం వల్లే ఆ దుర్గంధం అనుకుంటూ కళ్లూ,ముక్కూ మూసుకుని దాటిపోయారు.

తిరిగి తిరిగి నాలుగు రోజులకు బెలగావి చేరింది.

నానప్ప కోష్టాగారానికి చేరింది కవ్వల.

బృందాన్ని దూరంగా ఉంచి తను ఒంటరిగా లోపలికి వెళ్లింది.కాని అక్కడ నానప్పశెట్టి లేడు.

ఆయన సమాచారం తెలియక కుటుంబ సభ్యులు ఆందోళనలో ఉన్నారు. కోష్టాగార ఉద్యోగులంతా ఆయన కోసమే వెదకులాట మొదలెట్టినట్లు చెప్పారు.

నానప్పశెట్టి, తిమ్మప్ప, గౌరయ, గణపతిదేవుడు అదృశ్యం కావడంలో ఏమైనా సంబంధం ఉందా.. ప్చ్.. అంతా ఊహాతీతం.

కిం కర్తవ్యమ్??

కవ్వలకు ఆందోళన రెట్టింపయ్యింది. చేసేది లేక

మత్తి భానుమూర్తి

తిరిగి అడవి పయనమైంది.

ఎంత వెదికినా.. నరమానవుడు కనిపించని దారిలో వెళ్లడం చేత ఇప్పుడు కూడా ఎవ్వరూ కనిపించడంలేదు.

ఆ దారిలో గణపతిదేవుని ఆచూకీ చెప్పగల వారేవ్వరూ కనిపించే అవకాశం లేదు కూడా. ఈసారికూడా నానప్పను గణపతిదేవుడు ఖండ ఖండాలుగా నరికి చంపిన ప్రదేశం మీదుగానే వెళ్లారు. అక్కడేదో జంతు కళేబరం బదులు మానవ శరీరభాగాల ఆనవాళ్లు కనిపించాయి. వాటిని చూసిన ఆమె భృకుటి ముడివడింది.

ఇక్కడకు మనుష్యులెవరు వచ్చారు? వారిని ఎవరు చంపారు??..బ అనుకుంటూ, అటూ ఇటూ వివరంగా చూస్తే గౌరయ మృతదేహం. కాస్త ఇవతలగా శిథిలస్థితిలో మానవ శిరస్సు.కళ్లు చికిలించి చూస్తే అది నానప్పశెట్టి శిరస్సుగా గుర్తించి భళ్లున వాంతి చేసుకుంది కవ్వల.

ఆ దృశ్యం మొత్తం వివరంగా చూసిన ఆమె గజగజా వణికిపోయింది.

నానప్పను, గౌరయను ఎవరో చంపేశారు. అదీ అతి క్రూరం.గౌరయ శిరస్సు పగిలిపోయి ఉంది. శరీరం తెలుస్తోంది.నానప్ప శరీరం లేదు. ఎముకలున్నాయి. ఆతని శరీరాన్ని ముక్కలుగా నరికినట్లు శరీర భాగాలు.. పక్షులు, జంతువులూ పొడుచుకు తిన్నట్లు కనిపిస్తోంది.

దుస్తులు, అక్కడ పడి ఉన్న బంగారు ఆభరణాల వల్ల నానప్ప మరణాన్ని నిర్ధారించుకుంది. కూలబడిపోయింది.

నానప్ప గౌరయ మరణించారంటే అంటే గణపతిదేవుడు, తిమ్మప్ప కూడా అక్కడికి వచ్చే ఉండాలి. అంటే గణపతిదేవుడే నానప్పను, గౌరయను చంపి ఉండాలి. ఇంత దారుణంగా.. ముక్కలు ముక్కలు చేయడం తిమ్మప్ప వల్ల కాని పని. కానీ, గణపతిదేవుడు చేయగలడేమో! మహావీరుడుగా అతని యుద్ధ ప్రతిభను ఆయన దేవగిరి కారాగారవాసిగా ఉన్నప్పుడే గుర్తించింది. అనంతర కాలంలో అనేకానేక రాజ్యాలలో మహా వీరుడుగా గుర్తింపు పొందాడు. వాడే..వాడే చేసి తప్పించుకుపోయాడు.

నవనాడులు కుంగిపోయాయి.

గణపతిదేవుడే తిమ్మప్పను తన నియంత్రణలోకి తీసుకున్నాడు. వాడు నానప్పను ఇక్కడికి రప్పించాడు. ఎదిరించిన గౌరయను కూడా చంపేసి తిమ్మప్పతో పారిపోయాడు ఆ దుష్టుడు.

ఇవి కవ్వలకు వచ్చిన ఆలోచనలు.. అనుమానాలు..

గణపతిదేవుని తిరిగి తన నియంత్రణలోకి తీసుకోవడం దాదాపు అసాధ్యం.

నిస్పృహతో కూలబడగా ఆమె బృందసభ్యులు ఒకరిద్దరు ఆమెతో ఏదో చెప్పడానికి సంశయిస్తూ నిలబడ్డారు.

“ఏవిటో చెప్పండి..” అన్నది.

“మా బట్టలు, గుడారాలు, మీ వస్తువులు కూడా అన్ని అక్కడే వదలి వచ్చాం. అవి తీసుకుందాం మహారాణీ..”

సరే అన్నట్లుగా తల ఊపింది ఆమె.

ఆమె పల్లకి అధిరోహించగా అంతా కదిలారు. గణపతిదేవుడు అదృశ్యమైన ప్రదేశం వైపు ఉత్తర దిక్కుగా వెళుతున్నారు కాని అసలు ఆ ప్రదేశాన్ని ఎలా గుర్తించాలో కవ్వలకు గానీ ఆ నరరూప రాక్షసులకు గానీ తెలియడంలేదు. సాగిపోతున్నారు కానీ ఆ ప్రదేశం ఏదో కనిపించడం లేదు. బండగుర్తులేవీ అప్పుడు గుర్తుపెట్టుకోలేదు.

“ఇదిగో ఇక్కడే కవ్వల మహారాణీ వారి గుడారం వేశాము. ఇదిగో.. ఇక్కడే వంట చేశాము..”

అది వాళ్లు బస చేసిన ఓ ప్రదేశం కావచ్చు. కానీ అక్కడ వదలి వెళ్లిన సామాగ్రి లేదు. ముందుకు సాగుతూ, ఎన్నో ప్రదేశాలను పరిశీలిస్తున్నారు.అవన్నీ వాళ్లు బస చేసిన ప్రదేశాలే. కాని సామాగ్రి వదలిన ప్రదేశాన్ని గుర్తించలేక పోతున్నారు..

ఇదొక కొత్త సమస్యగా పరిణమించింది కవ్వలకు.

తిమ్మప్ప, గౌరయ ఉన్నప్పుడు దారి తెన్నూ తెలియకపోవడం అనే సమస్య లేదు. మిగిలినవాళ్లు కీకారణ్యాలవాసులే కాని ఈ గతంలో బస చేసిన ప్రదేశాన్ని గుర్చించలేకపొతున్నారు.

గణవతిదేవుడు, తిమ్మప్ప, గౌరయ మాయమవడం ఒక సమస్యకగా, దారి తెన్నూ తెలియకపోవడం కొత్త సమస్య.

ఆ రాత్రి మరో కొత్త సమస్య వచ్చి పడింది. అది కొన్ని వులులు కవ్వల గుడారాన్ని చుట్టుముట్టడం.

అర్ధరాత్రి తరువాత గుర్రం సకిలింపుతో కవ్వలకు చటుక్కున మెలకువ వచ్చింది. దగ్గరగా

'జాగృతి' నిర్వహించిన స్వర్గీయ కొండపాక కిషన్‌రావు స్మారక నవలల పోటీలో ప్రథమ బహుమతి పొందిన రచన

పులి గాండ్రింపు తక్కువ శబ్దంతో వినిపిస్తోంది. చటుక్కున లేచి కూర్చుంది.

పులి దగ్గరగా కదలుతోంది. చటుక్కున నడబంధంలోని చురక మీదికి చేయి పోయింది. చురక చేతికి తగిలింది. చెయ్యి కదుపుతూ దగ్గరగా చుట్టూ కరవాలం కోసం తచ్చాడింది. అది కూడా కుడివైపు చేతికందేటంత దగ్గరగానే ఉంది. వేగంగా దానికి దొరకబుచ్చుకుని చురుగ్గా లేచింది. మెల్లగా అడుగులో అడుగు వేస్తూ గుడారం గుడ్డ తొలగించి చూసింది.

అంతా గాడాంధకారం. రెండు చేతులతో కరవాలాన్ని సిద్ధంగా పట్టుకుని, కళ్లు చికిలించి, చెవులు రిక్కించి మెల్లగా బయటకు వచ్చింది.

ఆమె గుడారం చుట్టూ కాస్త కాస్త దూరంలో ఆమె బృందం అంతా పడుకుని ఉన్నారు.

పులి గాండ్రింపు ఎటు నుండి వినవచ్చింది అన్నట్లు కవ్వల పరకాయించి చూస్తోంది.

అంతే.. పులి ఒక్కసారిగా ఆమె ముందుకు దబ్బున దూకింది. నిద్రిస్తున్న కవ్వల అనుచరుడిపైకి ఉరకబోయింది. కవ్వల చురుకుగా తన కరవాలంతో పులిపై ఒక్క వేటు వేసింది.

పులి గిర్రున తలతిప్పి ఆమెను చూసింది. కవ్వల అదే వేగంతో భీకరంగా అరుస్తూ దానిపై మరో వేటు వేసింది. ఈసారి కరవాలం వేగంగా వెళ్లి దాని శరీరాన్ని గాయపరచింది. ఇదంతా లిప్తల కాలంలోనే జరిగింది. అప్పటికి ఆ అనుచరులంతా అరుస్తూ లేచి పులిని గుర్తించి తమ తమ ఆయుధాలను దొరకబుచ్చుకుని పులి వెంట పడ్డారు.

అప్పటికే కవ్వల చేసిన గాయంతో దెబ్బతిన్న పులి భీకరంగా అరుస్తూ పారిపోయింది.

కవ్వల బృందమంతా కత్తులతో చురుగ్గా చూస్తూ తిరుగాడుతున్నారు. దెబ్బతిన్న పులి దూరంగా పోలేదు. దానితోపాటు మరికొన్ని పులుల అరుపులు కూడా వినిపిస్తూనే ఉన్నాయి.

కవ్వల, తన పాతికమంది సభ్యుల బృందం.. పులుల అరుపులతో స్థిమితంగా ఉండలేక పోతున్నారు.

తెల్లవార వస్తోంది. రానూరానూ వెలుగు పెరుగుతోంది. అలా కత్తులు పట్టుకుని ఎంతసేపు పులుల దెబ్బను కాచుకోవడం..!??

"మహారాణీ! మనం ఇక్కడ ఉండటం క్షేమం కాదు. పులులు మనలను వదలి పెట్టవు. ఇక్కడి నుండి వెళ్లిపోదాం. దయచేసి ముందుకు కదలండి.." అని బృందంలో ఒకడు.. బంటయదొర అన్నాడు.

మౌనంగా తల ఊపి కరవాలం అలా పట్టుకునే ఉత్తరంగా పరుగులాంటి నడకతో ముందుకు అడుగు వేసింది.

ఆమె వెంట చుట్టూ చూస్తూ.. అనుచరగణం.. కదలుతోంది.

పులులు కూడా గాండ్రిస్తూ, కనిపించనంత ఆవలగా వాళ్ల వెంటే వస్తున్నాయి.

కొంతసేపటి తర్వాత పులుల గాండ్రింపు ఆగడంత కాస్త మెల్లగా నడవ సాగారు. అంతలోనే గాండ్రింపులు మళ్లీ వినిపించాయి. తిరిగి ఆయుధాలు గట్టిగా పట్టుకుని నలువైపులా చూస్తూ నడవసాగారు.

అలా పులి గాండ్రింపు వినిపించనప్పుడు మెల్లగా.. వినిపించినప్పుడు చురుగ్గా ప్రయాణం సాగుతోంది.

రానురానూ సూర్యుడు బలపడుతున్నాడు. ఎండ చురుగ్గా తాకుతోంది.

చేసేది లేక ముందుకు సాగుతున్నారు.

అప్పుడు జరిగిందిది..

కవ్వల ముందు ఓ దృశ్యం!!

అదిరిపోయింది.. నిజమా అన్నట్లు కన్నులు చికిలించి చూసింది.

నిజమే!! ఎదురుగా ఓ చెట్టు క్రింద పద్మాసనంలో కన్నులు మూసుకుని యోగముద్రలో గణపతిదేవుడు!!

ఆయన మాయమైన చోటే హాయిగా ప్రశాంతంగా కూర్చుని ఉన్నాడు. ఐదు రోజులుగా ఆయన కోసం కింద మీదయిపోతోంది కవ్వల. మోసం చేసి అర్ధరాత్రి పారిపోయినవాడు తిరిగి వచ్చి అక్కడే కూర్చుని ఉండటంతో ఆమె దిగ్భ్రాంతితో, స్థాణువై నిలబడిపోయింది. పులిని ఎదుర్కోవడానికి రెండు చేతులతో పుచ్చుకున్న కరవాలం అలాగే ఉంది.

పరుగున వచ్చిన అనుచరులు కూడా ఆయనను చూసి వెర్రిచూపులు చూస్తున్నారు. అంతా చిత్తరువుల్లా కొయ్యబారిపోయినవేళ మెల్లగా కళ్లు తెరిచాడు గణపతిదేవుడు.

ఎప్పటిలా ప్రశాంతంగా చూపులు కలిపాడు కాని ఏమీ మాట్లాడలేదు. కేవలం మౌనమే ఆయన భాష!!

లిప్తకాలంలో కవ్వల మనస్సంతా ఆనందంతో పులకించిపోయింది.

గుప్పిట జారిన శత్రువు తిరిగి తనంతట తానే వచ్చి చేయిపట్టి తన గుప్పిటలో ఒదిగి కూర్చున్నట్లు..

మరో లిప్తకాలంలో మరో ఆలోచన. ఎందుకు నానప్పను కలసినట్లు! ఇద్దరి మధ్య ఏమి జరిగినట్లు! ఆయన గణపతిదేవుడిని ఎందుకు వదలిపెట్టినట్లు!

నానప్ప వదలలేదు. ఈయనే ఆయన్ను చంపేశాడు. అదీ అతి దారుణాతి దారుణంగా. ఖండఖండాలుగా నరికి కాకులకు గ్రద్దలకు విసిరివేసినట్లుగా అక్కడ ఆనవాల్లు చెబుతున్నాయి. ఇద్దరు మధ్య అంత శత్రుత్వం ఏముంది? తనకు తెలిసినంత వరకు ఇద్దరికీ అసలు పరిచయమే లేదు.

ఇప్పుడు ఈ కారడవిలో ఇద్దరూ ఎదురుపడ్డారు అంటే... ది తనే కేంద్రంగా జరిగి ఉండాలి..

అసలు ఏమి జరిగిందో చెప్పగలవాడు తిమ్మప్ప మాత్రమే.

అసలు వాడు ఏడి??

చివ్వున తల తిప్పి అడవి కనిపించినంత మేర

చూసింది..

కనిపించలేదు... వాడిని కూడా చంపేశాడా??

ఆమె ఒళ్లు జలదరించింది.

తనను మాత్రమే గౌరవిస్తూ మౌనంగా తన వెంట మాట మాట్లాడకుండా తను ఎన్ని మాటలన్నా, ఎంత అవమానపరచినా,పన్నెత్తు మాట ఎదురు మాటలాడని ఈ మహావీరుడు...నానప్పను, వాడి ఇద్దరి మనుషులను చంపేసి తన వద్ద మాత్రం ఎందుకు మౌనంగా ఉంటున్నాడు? తనకు సహకరిస్తునట్లు.. తను విధిస్తున్న శిక్షలను భరిస్తున్నట్లు, తాను విధించబోయే మరణశిక్షకు సిద్ధమన్నట్లు..

ఆమెకు ఓ నీతికథ జ్ఞప్తికి వచ్చింది. పులికి చిక్కిన ఓ ఆవు తన బిడ్డకు పాలిచ్చి వస్తానని చెప్పి వెళ్లి మాట ఇచ్చినట్లుగానే తిరిగి పులి వద్దకు వచ్చిందట.

చటుక్కున మనస్సులోని వచ్చిన ఆ కథను మర్చిపోవడానికన్నట్లు.. వేగంగా ఓసారి గాలిలో కరవాల ప్రహారం చేసింది.

అప్పుడే అనుకోని సంఘటన జరిగింది.

అడవి లోపలినుండి ఏవేవో పండ్లు, దుంపలు రెండు చేతులనిండా పట్టుకుని వచ్చాడు తిమ్మప్ప.

బాల కవ్వలను చూడగానే... "మహారాణీ! వచ్చారా? మీ కోసమే మహారాజు గారు తిరిగి వచ్చారు. ఆయన నిజంగా దేవుడమ్మా. దేవుళ్లకే దేవుడు. మీ బందీగా ఉన్న ఆయనను నేనూ, గౌరయ తీసుకువెళ్లి నానప్పశెట్టికి చూపాము. కానీ నానప్పశెట్టి మిమ్మల్ని ఉద్దేశించి అనరాని,వినరాని మాటలు అన్నాడు. అందుకు కోపించిన మహారాజుగారు నానప్పను, గౌరయను అక్కడికక్కడే చంపేశారు. నా చుట్టూ ఓ వృత్తం గీచి అందుండి బయటకు వస్తే నన్నూ చంపేస్తానన్నారు. నానప్పను చంపడానికి కారణం ఏవిటో తెలుసా మహారాణీ!. మిమ్మల్ని ఆయన పరమ అసహ్యంగా మాట్లాడటం. అందుకే గౌరయను కూడా ఒక్క రాతిదెబ్బతో చంపేశారు. నానప్ప శరీరాన్ని ఖండఖండాలుగా నరికి కాకులకు గ్రద్దలకు విసిరేశారు. అదంతా నేను నా కళ్లారా చూశాను.

ఆయన మహావీరుడమ్మా.. కేవలం మీకు మాత్రమే ఆయన చేతులు కట్టుకుని ఎందుకు బందీగా ఉన్నారో నాకు తెలియదు. ఆయన వీరత్వాన్ని నేను స్వయంగా చూశాను మహారాణీ. ఆయన తలచుకుంటే వీళ్లందరినీ...మిమ్మల్ని కూడా సునాయాసంగా చంపేసి వెళ్లిపోగలరు. ఇది నిజం. ఆయనను బందీగా, శత్రువుగా చూడటంవల్ల మీకొచ్చే ప్రయోజనం ఏమీ లేదు. మీ పాదాలకు మొక్కుతాను. ఆయనను వదిలి మీ ప్రాణాలను కాపాడుకోండి."

ఇదంతా తిమ్మప్ప చెప్పాలనుకున్నాడు. కాని చెప్పలేకపోయాడు.

అతన్ని చూడగానే కవ్వల పట్టరాని క్రోధంతో ఊగిపోయింది. గాలిలో కత్తి ప్రహారాలు చేసింది.

"ఈ ద్రోహి నాకు తెలియకుండా వీడిని ఎక్కడికి తీసుకుపోయారు? నన్నే మోసం చేస్తావా.." అంటూనే రెండు చేతులతో పట్టుకున్న కరవాలంతో అతని శిరస్సును ఒక్క వేటుతో ఖండించింది.

తిమ్మప్ప తల తెగి గణపతిదేవుని ముందు పడింది.

చటుక్కున కదిలి తిమ్మప్ప తలను అందుకున్నాడాయన..

'అయ్యో తిమ్మప్పా'.. అన్నట్లు గణపతిదేవుడు చూస్తుండగా ఆతని ప్రాణాలు కళ్ల నుండి అనంత వాయువుల్లో కలిసిపోయాయి.

భారంగా నిట్టూర్చాడు గణపతిదేవుడు. తిమ్మప్ప మరణంతో మనసు మూలల్లో ఎక్కడో ఉన్న కాస్త ఆశాదీపం కొండెక్కింది.

"ఈ ద్రోహిని బంధించి, పల్లకిలోకేక్కించండి.." అనుచరులను ఆజ్ఞాపించింది కవ్వల..

మౌనంగా చూస్తూ.. తననే చూస్తోన్న తిమ్మప్ప కళ్లు మూశాడు గణపతిదేవుడు.

తర్వాత గణపతిదేవుడు బందీగా తీసుకుని కవ్వల బృందం తిరిగి దేవగిరి వైపు కదిలింది.

* * *

దేవగిరి కోటలో రాజప్రాసాదం..

సంధ్యవేళ ఆరుగంటలు మోగాయి ఘటికలో. దీపాలు, దివిటీలు, కాగడాలు ప్రాసాదం నిండా వెలిగిస్తున్నారు సంబంధిత ఉద్యోగులు.

మహారాజు సింఘణదేవుని విశాలమైన ఆంతరంగిక మందిరంలో సింఘణ దేవుడు, దేవగిరి ప్రత్యేక సంధివిగ్రహి బాలకవ్వలబాయి ఉన్నారు.

ఇద్దరూ తీవ్రమైన ఆలోచనలతో, చాలా ఉద్వేగంగానూ.. అంతకు మించిన ఉద్రేకంగానూ ఉన్నారు. దీపరక్షకులు ఊపిరి పీల్చడం లేదన్నంత నిశ్శబ్దంగా మౌనంగా దీపాలు వెలిగిస్తున్నారు. రానురానూ చీకట్లు పారిపోగా మందిరమంతా వెలుగులు నిండాయి.

దిగువ నైరుతిలోని బెలగావి నగరంలో కాకతీయ మహానేత గణపతిదేవుని బంధించిన బాలకవ్వలా బాయి ఎవ్వరికి తెలియకుండా,ఎవ్వరూ అడ్డగించకుండా.. అతి రహస్యంగా ఆయనను కాపాడుకుంటూ మూడు నెలలు ప్రయాణించి దేవగిరి రాజ్యానికి చేరింది.

రాజ్యపు పొలిమేరల్లో ఉన్న ఓ మిత్రురాలి ఉద్యానవనంలో ఆయన్ను ఉంచి అశ్వాన్ని అధిరోహించి ఎప్పటిలా దేవగిరి కోటకు వచ్చి మహారాజును కలిసింది. ఆమెను చూడటంతోనే సింఘణదేవుడు కంగారుపడిపోయాడు. వెనువెంటనే ఆంతరంగిక మందిరానికి ఆమెను తీసుకుపోయాడు.

అక్కడ ఆమె చెప్పిన మాటతో వణికిపోతున్నాడు.

"ప్రతిజ్ఞ చేసినట్లు ఆ ద్రోహి గణపతిదేవుని పట్టి బంధించి ఇక్కడికి తీసుకొచ్చాను బావగారూ! నా పగ తీర్చుకోవడానికి సహకరిస్తానని మాట ఇచ్చారు. ఇప్పుడు వాడిని కోటలోని ఆ శిథిలకోష్టాగారం వద్దకు తీసుకువెళ్లేందుకు అనుజ్ఞ ఇవ్వమని కోరుతున్నా." చేతులు జోడించి చెప్పి నిలుచుంది.

ఆమె మాటలు వినగానే నవనాడులు క్రుంగిపోయాయి సింఘణకు.

మహావీరుడు, ఓ మహాసామ్రాజ్యానికి పాలకుడైన గొప్ప వ్యక్తిని..అందునా స్వయంగా తన బావ అయిన గణపతిదేవుడిని.. దాదాపు అరవైఏళ్ల ఆ మనీషిని.. ఈ ఆడది తన పగలో భాగంగా పట్టి బంధించి ఎవరికి తెలియకుండా, అనుమానం రాకుండా రహస్యంగా ఇన్ని వేల యోజనాలు ప్రయాణించి తీసుకువచ్చిందంటే....

గుండె దడదడలాడింది.

ఆమెకు వాగ్దానం చేసిన మాట నిజం. ముఖ్యంగా తను, తల్లి చిల్లాదేవి కవ్వల విషయంలో నిర్వహించిన గత అంశాలు సామాన్యమైనవి కావు. అవన్నీ ఇప్పుడు అప్రస్తుతం. ఆమెకు గతంలో మాట ఇచ్చాడు. ఇప్పుడు ఆమె చెప్పినట్లుగానే ఇన్నేళ్లు పోరాడి, తంత్రాలు నడిపి చివరికి ఆయనను బంధించి ఇక్కడికి తెచ్చింది. ఇప్పుడు కోష్టాగారం వద్దకు తీసుకువెళ్లి ఆమె అక్కను చంపినట్లే ఆయనను ఖండఖండాలుగా నరుకుతాను అంటోంది.

ఆయనెవరో అనామకుడు, సాధారణవ్యక్తి కాదు. ఆయనను బంధించినట్లు తెలిస్తే....అశేష కాకతీయ సైన్యం విరుచుకు పడుతుంది. కాకతీయ వీరయోధులు ఈమెను చూర్ణం చూర్ణం చేస్తారు. దేవగిరి రాజ్యాన్ని, దేవగిరి నగరాన్ని అగ్నిప్రీతం చేస్తారు. లక్షలాది ప్రజల మరణాన్ని చూడవలసి వస్తుంది. అంతేకాదు తనను కూడా వదలరు. దొరకబుచ్చుకుని ఖండఖండాలుగా నరికేస్తారు. చరిత్ర కొత్త అధ్యాయాన్ని లిఖిస్తుంది. భాషా రాజ్యాలను రూపొందించాలన్న ఆయన దీక్ష, పోరాటం అంతిమదశకు వచ్చాయి. దక్షిణాది రాజ్యాలపై జరుగుతున్న యుద్ధాలలో కూడా విజయం కాకతీయ సైన్యం పక్షాన్నే ఉన్నట్లుగా వార్తలు వస్తున్నాయి. తన దేవగిరి సైన్యం కూడా వెనుకంజ వేసినట్లు సైన్యాధ్యక్షుడు లేఖ ద్వారా తెలియపరచాడు. అలాంటి వీర విక్రమ పరాక్రముడిని బంధించి తెచ్చి తన ముందు ఉంచి, చంపేస్తాను.. సహకరించమని అడుగుతోంది బాల కవ్వల. ఏమి చెయ్యాలి?

తలెత్తి చూశాడు. ఆమె రెప్ప వెయ్యకుండా అతని జవాబుకోసం చూస్తోంది. ఓ ఉద్వేగవు మంకుతనంతో, నమ్మిన పగతో ఊహాతీతమైన దూరాభారంతో వచ్చి తన ముందు నిలుచున్న భయంకరమైన పిశాచిలాగా కనిపించింది బాల కవ్వల.ఆమెకు ఏమి చెప్పాలో తోచక, చేతులు

పిసుక్కుంటూ మరో వైపు నడిచాడు. అటూ ఇటూ తిరుగుతూ ఆలోచిస్తున్నాడు.

ఏకైక ధ్యేయంతో నిలుచున్న బాలకవ్వల అతన్నే చూస్తోంది.

సింఘణదేవుని ఆలోచన మారింది.

తను ఒకప్రక్కే ఆలోచిస్తున్నాడేమో.

మరో కోణంలో ఆలోచిస్తే గణపతిదేవుడు చిట్టెలుకలాగా బోనులో చిక్కాడు. అతనికి కవ్వలకు పాత పగలున్నాయి. వాళ్లూవాళ్లూ తేల్చుకుంటారు. మధ్యలో తనెందుకు తల దూర్చాలి. అతన్ని తొలగిస్తే తనకే కదా ప్రయోజనం! మొత్తం కాకతీయ రాజ్యం తన హస్తగతం అవుతుంది. ఇప్పటికే కన్నడ రాజ్యమంతా తన అధీనంలో ఉంది. గణపతిదేవుడు లేని కాకతీయరాజ్యం మొత్తంగా తన హస్తగతం అవడానికి పెద్దగా కష్టపడనక్కరలేదు. దక్షిణాపథం అంతా తన రాజ్యం అవుతుంది. దేవగిరిరాజ్యం అంటే ఉత్తరాదికి దక్షిణాదికి మధ్య ఉన్న విశాల రాజ్యం. యాదవ మహాసామ్రాజ్యం తనదే..తనదే!!

ఈ ఆలోచన మహదానందాన్ని ఇచ్చింది. ఈ కోణమే సింఘణదేవుడు స్థిరపరచుకున్నాడు. మరోవైపు చూడటం ఇష్టం లేనట్లు కవ్వలతో చటుక్కున అనేశాడు.

"అభినందనలు బాలకవ్వలా..అభినందనలు. ఇక్కడివరకు నీ పోరాటం అద్భుతం,అభినందనీయం. నేను, అమ్మ చిల్లాదేవిగారు నీకు వాగ్దానం చేయడం, నిన్ను ప్రోత్సహించిన మాట నిజం. ఇప్పుడు అమ్మలేదు కాని నీకు అండగా నేనుంటాను. కాని అదే సమయంలో నాకు నష్టం, కష్టం రాకూడదు కనుక నేను ఇప్పుడే నా భార్యాపిల్లలతో ఉత్తరాపథం లోని కాశీ ప్రయాణం పెట్టు కుంటాను. నేను కోటలో లేని సమయంలో కోట దండ నాయకుడు నీకు సహాయం చేస్తాడు. నువ్వు క్షేమంగా కోటలో శిథిల కోష్టాగారం చేరడానికి సహకరిస్తాడు. అక్కడికి మరెవ్వరూ రాకుండా ఆపుతాడు. ఆపై నీ ఇష్టం.."

బాలకవ్వల ఆనందంతో అతని కాళ్లపై పడిపోయింది.

* * *

తల ఎత్తి కళ్లు కదిపి చూశాడు గణపతిదేవుడు.

ఎక్కడో ఎప్పుడో చూసినట్లుగా ఉంది. లిప్తకాలంలో గుర్తుపట్టాడు. అది దేవగిరికోటలోని శిథిల కోష్టాగారం.

స్పందనతో విచలితుడయ్యాడు. శరీరమంతా వణికింది. లిప్తల కాలంలోనే మనసులో ఏవేవో పాత దృశ్యాలు కలగాపులగంగా కదలాడగా కన్నీళ్లు ఉబికి వచ్చాయి. మూడు మాసాలుగా బాలకవ్వల చెరపట్టిన నాటి నుండి ఏనాడూ చమర్చని కళ్లు, ఇప్పుడు ఇక్కడ పాత స్మృతులు మనసు ముందుకు రాగా హఠాత్తుగా చెమ్మతో తడిసిపోయాయి.

ఇది తను, తన ప్రేయసి కవ్వల కలుసుకున్న ఆఖరి ప్రేమమందిరం. తమ అనురాగం పరిమళించి తనువులు మరింత దగ్గరైన యవ్వనోల్బణ స్వర్గం.

భారంగా కళ్లు మూసుకున్నాడు. అదిగో అక్కడే..అక్కడక్కడ ఆమె సుకుమార శరీర భాగాలు రక్తపు మరకలతో కనిపించిన ప్రాంతం..

దాదాపు నలభై ఏళ్లు దాటినా ఇంకా అలాగే తన మనసులో, కళ్లలో కదలాడుతున్నాయి.

భారంగా నిట్టూర్చాడు.. ప్చ్..

కళ్లు తుడుచుకోవడానికి ఉత్తరీయం కోసం చేయి కదిలింది కానీ అది కింద పడింది. దానిని అందు కునేందుకు నేలను తాకాడు. శరీరం జల్లుమంది. ఉత్తరీయం అందుకుని కళ్లు తుడుచుకున్నాడు.

చప్పట్ల శబ్దం వినరావడంతో తలెత్తి చూశాడు. చప్పట్లు చరిచింది బాల కవ్వల.

"ఇక్కడైనా తమరికి కన్నీళ్లు వస్తాయా?రావా? అనుకున్నాను మహాప్రభూ! వచ్చాయంటే నమ్మశక్యం కావడం లేదు. అసలు అవి కన్నీళ్లా?ఆనంద బాష్పాలా??"

మనసు చివ్వుక్కుమంది. ఏదో జవాబివ్వాలని నోరు కదలాడింది. కానీ మనసు నియంత్రించింది.

గత మూడు మాసాలుగా ఇదే పరిస్థితి. ఆమె తనను రెప్ప వేయకుండా చూస్తూనే ఉంది. తన ప్రతి కదలిక ప్రతి నిట్టూర్పు, ప్రతి భావప్రకటన ఆమె క్రీగంట పరిశీలిస్తూనే మనసు కష్టపెట్టేలా వంకరగా ఏదో అంటూనే ఉంది. కాని తన కష్టసహిష్ణత శక్తి ఎంత బలమైనదో.. శారీరకంగానే కాదు మానసికంగా కూడా తనెంత బలవంతుడో ఆమెకు తెలియదు కదా! ఏది ఏమైనా ఆమె ఏమి అన్నా, ఎన్ని అన్నా.. అన్నింటికీ మౌనమే తన సమాధానం. కారణం బాలకవ్వల పగకు, ఆమె అక్క కవ్వల మరణానికి తనే కారణం!

బెలగావిలో బంధించినప్పటి నుండి ఇప్పుడు ఈ దేవగిరి కోటలోకి వచ్చేవరకూ..ప్రయాణ కాలం దాదాపు మూడుమాసాలపైనే పట్టింది ఈ కాలమంతా ఆమె, ఆమె బృందం తనను కొంతవరకు గౌరవంగానే చూసుకున్నారని భావించవచ్చు అనుకున్నాడిప్పుడు గణపతిదేవుడు.

మెరుపుదాడి జరిగినరోజు, కవ్వల దుర్మరణం చెందినరోజు నుండి.. తిరిగి ఇప్పుడు ఇక్కడికి తనను బంధించి తెచ్చిన ఈరోజువరకు పరిశీలిస్తే బాలకవ్వల తన అక్క మరణంపట్ల ఎంతగా వ్యథ చెందిందో ఆయన ఊహించాడు. ఇంతకాలం తనదే వ్యథ అనుకున్నాడు కాని తన భగ్నప్రేమ కంటే వాళ్ల కుటుంబం పొందిన నరకయాతన ఎక్కువే కదా? అనే భావనే బాలకవ్వల ఎన్ని బాధలు పెట్టినా ఆయన మౌనంగా భరించడానికి కారణం.

(సశేషం)

వ్యూహాత్మక దౌత్యంలో

కేవలం అమెరికాపై మాత్రమే పూర్తిగా ఆధారపడకుండా, ఇండో-పసిఫిక్ ప్రాంతంలో సొంతంగా ఒక బలమైన కూటమిని ఏర్పాటు చేసే లక్ష్యంతో ప్రధాని నరేంద్ర మోదీ జూలై 6 నుండి 11 వరకు ఆస్ట్రేలియా, ఇండోనేషియా, న్యూజిలాండ్ దేశాలలో పర్యటించారు. అమెరికా తన 'ఇండో-పసిఫిక్ కమాండ్' పేరును తిరిగి 'పసిఫిక్ కమాండ్స్ (యూఎస్‌పీఏసీఓఎం)గా మారుస్తూ తీసుకున్న నిర్ణయం, ట్రంప్ చేస్తున్న కొన్ని ప్రతికూల వ్యాఖ్యల నేపథ్యంలో, హిందూ మహా సముద్ర ప్రాంతంలో తన వ్యూహాత్మక ప్రాధాన్యతను కాపాడుకోవడానికి భారత్ వేగంగా పావులు కదుపుతోంది.

అమెరికా సైన్యం తన కమాండ్ పేరు నుండి ''ఇండో'' అనే పదాన్ని తొలగించినప్పటికీ, భౌగోళికంగా ఆ ప్రాంత బాధ్యతలు మారలేదని అమెరికా రక్షణశాఖ ప్రకటించినప్పటికీ, భవిష్యత్తులో ట్రంప్ ప్రభుత్వం చైనాతో మెతక వైఖరి అవలంబిస్తే ఎదురయ్యే సవాళ్లను తట్టుకోవడానికి భారత్ సిద్ధమవుతోంది. అంతేకాదు డోనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న ఒంటెత్తు పోకడల వల్ల హిందూ మహాసముద్రంలో ఏర్పడే ఖాళీని చైనా భర్తీ చేయకుండా అడ్డుకోవడానికి ఇండోనేషియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాలు భారత్‌కు కీలకం. ఈ క్రమంలో భారత్ కేవలం ఒక ప్రాంతీయ శక్తిగా కాక, పశ్చిమ దేశాలకు , ఆసియా దేశాలకు మధ్య ఒక సమతుల్య దౌత్యవారధిగా నిలుస్తున్న సంగతి ప్రధాని పర్యటన ద్వారా స్పష్టమైంది. చైనా లేదా అమెరికాల వైపు మాత్రమే మొగ్గు చూపకుండా, వ్యూహాత్మక స్వతంత్ర విధానంతో సరికొత్త బహుళ-ధ్రువ ప్రపంచక్రమాన్ని నిర్మించడంలో భారతదేశం ఇప్పుడు గ్లోబల్ లీడర్‌గా తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంటోంది. అమెరికా మద్దతు తగ్గినా, చైనా దూకుడును ఒంటరిగా ఎదుర్కోకుండా ఈ మూడు దేశాలతో కలిసి భారత్ ఒక బలమైన ప్రాంతీయ కూటమిని (ఆర్క్ ట్రస్ట్) ఏర్పాటు చేసుకుంటోంది.

ఇండోనేషియా...

పసిఫిక్, హిందూ మహాసముద్రాలను కలిపే అత్యంత కీలకమైన 'మలక్కా జలసంధి'పై పట్టు సాధించడానికి ఇండోనేషియా భారత్‌కు అత్యంత కీలకం. జకార్తాలో ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంతోతో జరిగిన భేటీలో భారత్ 14 వ్యూహాత్మక ఒప్పందాలను కుదుర్చుకుంది. ఇండోనేషియా సైనిక ఆధునికీకరణలో భాగస్వామవుతూ, భారత్ తన రక్షణ ఉత్పత్తులను ఆ దేశానికి ఎగుమతి చేయడానికి అంగీకరించింది. ఇండోనేషియాలో ఐఐఎమ్ బెంగళూరు క్యాంపస్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. ఇది కేవలం ఇండోనేషియాకే కాక మొత్తం ఆసియా (ఆసియన్) ప్రాంత యువతకు భారత విద్యా ప్రమాణాలను అందిస్తూ గ్లోబల్ సౌత్‌లో దేశ గౌరవాన్ని పెంచనుంది. అంతర్జాతీయ యవనికపై భారత్ ప్రాధాన్యతను గుర్తించారు కనుకనే జకార్తాలో అధ్యక్షుడు ప్రభోవో సుబియాంతో ప్రోటోకాల్‌ను పక్కనపెట్టి ప్రధాని మోదీకి ఘన స్వాగతం పలికారు. నరేంద్ర మోదీకి ఇండోనేషియా దేశ అత్యున్నత పౌర పురస్కారమైన 'బింటాంగ్ ఆదిపూర్ణ' పురస్కారాన్ని అందించి గౌరవించారు. ఇండోనేషియా 'ఎమాస్ విజన్', భారతదేశ 'వికసిత్ భారత్' సంకల్పం ఒక దానికొకటి తోడ్పడతాయని ఇరు దేశాలు ప్రకటించాయి. వ్యూహాత్మకంగా ఎంతో కీలకమైన సబాంగ్ పోర్ట్ నిర్మాణంలో భారత్ భారీగా పెట్టుబడులు పెట్టనుంది. ఇది హిందూ మహా సముద్రంలో చైనా ఉనికిని అడ్డుకోవడానికి భారత్‌కు వ్యూహాత్మక బలాన్ని ఇస్తుంది. ఇండోనేషియాలో ఈవీఎంల అభివృద్ధి, సాంకేతికతను మెరుగు పరచడానికి భారత్ పూర్తి మద్దతును ప్రకటించింది. ఇది గ్లోబల్ సౌత్ దేశాల్లో భారత సాంకేతి కతకున్న విశ్వసనీయతను చాటుతున్నది. ఇండోనేషియాలోని స్టీల్, నికెల్ ఖనిజ రంగాల్లో భారత్ భారీగా పెట్టుబడులు పెట్టడానికి మార్గం సుగమమైంది. భారతదేశంలో తయారీ రంగానికి (ఈవీలు, ఇండస్ట్రీస్) నికెల్ వంటి ఖనిజాలు ఎంతో కీలకం. పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ ప్రసిద్ధ ప్రంబానన్ దేవాలయ సముదాయాన్ని సందర్శించారు. విదేశాల్లోని చారిత్రక హిందూ దేవాలయాలు, భారతీయ సంస్కృతికి చెందిన వారసత్వ కట్టడాల పరిరక్షణ, పునరుద్ధరణ కోసం భారత్ అందిస్తున్న ఆర్థిక, సాంకేతిక సాయం రెండు దేశాల సాంస్కృతిక దౌత్యాన్ని మరింత బలోపేతం చేసింది. భారతదేశం దౌత్య వ్యూహం ద్వారా ఇండోనేషియాను తన వైపుకు తిప్పుకోవడంలో విజయం సాధించింది. ఉమ్మడి పరిశోధనలు, టెక్నాలజీ బదిలీ, కో-ప్రొడక్షన్‌ను ఆఫర్ చేయడం ద్వారా భారత దౌత్యం ఇండోనేషియా మనసు గెలుచుకుంది. అభివృద్ధి చెందుతున్న ఆసియా, ఆఫ్రికా దేశాల (గ్లోబల్ సౌత్) వాణిని వినిపించడంలో భారత్ ముందుం టోంది. హిందూ మహాసముద్రం నుండి పసిఫిక్ మహాసముద్రంలోకి ప్రవేశించడానికి ఇండోనేషియా భౌగోళికంగా కీలకమైన స్థానంలో ఉంది. ప్రపంచ వాణిజ్యం, చైనాకు అవసరమైన 80% ఇంధన సరఫరా 'మలక్కా జలసంధి' గుండానే సాగుతుంది. ఇండోనేషియాతో బలమైన రక్షణ సంబంధాలతో, యుద్ధ సమయాల్లో చైనా నౌకల రాకపోకలను అడ్డుకునే శక్తి భారత్‌కు లభిస్తుంది. ఇక్కడ సబాంగ్‌లో ఉన్న వ్యూహాత్మక రేవును భారత్ అభివృద్ధి చేస్తోంది. ఇది అండమాన్ దీవులకు అత్యంత సమీపంలో ఉండటం వల్ల చైనా జలాంతర్గాము లపై భారత్ సులభంగా నిఘా పెట్టగలదు.

ఆస్ట్రేలియాతో...

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జూలై 2026

నాటి ఆస్ట్రేలియా పర్యటన రెండు దేశాల మధ్య దౌత్య వ్యూహాత్మక సంబంధాలను నూతన శిఖరాలకు చేర్చింది. మెల్‌బోర్న్‌లో ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ ఆల్బనీతో జరిగిన 3వ భారత్-ఆస్ట్రేలియా వార్షిక నదస్సు ద్వారా భారతదేశానికి కీలకమైన దౌత్యపరమైన ప్రయోజనాలు చేకూరాయి. రక్షణ, ఇంధన భద్రత, వాణిజ్యం వంటి విభిన్న రంగాలలో భారత్ ఏకంగా18 ముఖ్యమైన ఒప్పందాలపై సంతకాలు చేసింది. ఇరు దేశాలు 'డిఫెన్స్ అండ్ సెక్యూరిటీ కోఆపరేషన్'పై ఒక ఉమ్మడి ప్రకటనను ఆమోదించాయి. హిందూ మహాసముద్ర పరిధిలో భద్రతను పర్యవేక్షించడానికి ఇండియన్ కోస్ట్ గార్డ్, ఆస్ట్రేలియా మారిటైమ్ బోర్డర్ కమాండ్ మధ్య ఒప్పందం కుదిరింది. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పౌర అణు ఒప్పందాన్ని ఇరు దేశాలు అధికారికంగా పట్టాలెక్కించాయి. దీనివల్ల భారతదేశ అణుశక్తి ప్రాజెక్టుల కోసం ఆస్ట్రేలియా నుండి యురేనియం దిగుమతి సులువవుతుంది. గ్రీన్ హైడ్రో

తిరుగులేని భారత్!

జన్, పునరుత్పాదక ఇంధన రంగాలలో సరఫరా లంకెలను మెరుగుపరచడానికి ఉమ్మడి రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేశారు. భారతదేశంలో ఎలక్ట్రిక్ వాహనాలు (ఈవీ), సోలార్ ప్యానెల్స్ తయారీకి అవసరమైన లిథియం, కోబాల్ట్ వంటి కీలక ఖనిజాల సరఫరా కోసం 'క్రిటికల్ మినరల్స్ కారిడార్'పై ఇరు దేశాలు పనిచేస్తున్నాయి. దీనివల్ల ఈ ఖనిజాల కోసం చైనాపై భారత్ ఆధార పడటం తగ్గుతుంది. ఇస్రో ప్రతిష్టాత్మకంగా చేపట్టబోయే గగన్‌యాన్ మానవ అంతరిక్ష యాత్రకు మద్దతుగా ఆస్ట్రేలియాకు చెందిన

'కోకోస్ కీలింగ్ దీవులలో' ఒక తాత్కాలిక స్పేస్ ట్రాకింగ్ టెర్మినల్‌ను ఏర్పాటు చేయడానికి ఆస్ట్రేలియా అంగీకరించింది. ఫలితంగా, భారత నౌకాదళం ఆస్ట్రేలియా సైనిక స్థావరాలను, కోకోస్ దీవులను వాడుకోవచ్చు.

తద్వారా భారత నౌకాదళ పరిధి దక్షిణ పసిఫిక్ మహాసముద్రం వరకు విస్తరిస్తుంది. చైనాకు ప్రత్యామ్నాయంగా భారత్, ఆస్ట్రేలియా, జపాన్‌లు కలిసి 'సప్లై చైన్ రెసిలియన్స్ ఇనిషియేటివ్స్ (ఎస్‌సీఆర్‌ఐ)ను నిర్వహిస్తున్నాయి. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో భారతదేశానికి శాశ్వత సభ్యత్వం లభించాలనే డిమాండ్‌కు ఆస్ట్రేలియా తన పూర్తి మద్దతును పునరుద్ఘాటిం చింది. ద్వంద్వ ప్రమాణాలు లేకుండా ఉగ్రవాదాన్ని అంతం చేయాలని ఇరు దేశాలు అంగీకరించాయి. ఈ పర్యటన సందర్భంగా ఫ్లిండర్స్ యూనివర్సిటీ బెంగళూరులో తన క్యాంపస్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. ఇది భారతీయ విద్యార్థులకు స్వదేశంలోనే అంతర్జాతీయ విద్యను అందిస్తుంది.

న్యూజిలాండ్

సుదీర్ఘ కాలంగా పెద్దగా ప్రాధాన్యత ఇవ్వని పసిఫిక్ దీవుల దేశాలతో సంబంధాలను మెరుగు పరుచుకోవడానికి న్యూజిలాండ్‌ను భారత్ ప్రస్తుతం ఒక వంతెనలా ఉపయోగిస్తోంది. 1986లో రాజీవ్ గాంధీ పర్యటన తర్వాత, మళ్లీ భారత ప్రధాని మోదీయే న్యూజిలాండ్‌లో అధికారికంగా పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా ఆ దేశ ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్‌తో జరిపిన ద్వైపాక్షిక చర్చలు ఇరుదేశాల మధ్య సరికొత్త దౌత్య, ఆర్థిక సంబంధా లకు పునాది వేశాయి. భారత్–న్యూజిలాండ్ ద్వైపాక్షిక సంబంధాలను తొలిసారి "వ్యూహాత్మక భాగ స్వామ్యం" స్థాయికి పెంచారు. రక్షణ, వాణిజ్యం, మ్యారిటైమ్ సెక్యూరిటీ, సైన్స్, టెక్నాలజీ వంటి రంగాలలో ఇరు దేశాలు పలు ఒప్పందాలపై సంతకాలు చేశాయి. ఇటీవల కుదిరిన ఉచిత వాణిజ్య ఒప్పందాన్ని వేగంగా అమలు చేయడానికి ఇరు ప్రధానులు అంగీకరించారు. దీనితో న్యూజిలాండ్ నుంచి భారత్‌కు వచ్చే 57% ఎగుమతులపై సుంకాలు రద్దుకానున్నాయి. చైనా దూకుడు పెరుగు తున్న నేపథ్యంలో, ఇండో–పసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్వేచ్ఛాయుత వాతావరణం కోసం ఉమ్మడి వ్యూహాన్ని ప్రకటించారు. ఇరు దేశాల మధ్య క్రమం తప్పకుండా సమాచార మార్పిడి కోసం ప్రత్యేకంగా మ్యారిటైమ్ సెక్యూరిటీ డైలాగ్ ఏర్పాటుకు అంగీకారం కుదిరింది.

చైనా కట్టడికి న్యూజిలాండ్ సహకారం

పసిఫిక్ దీవుల దేశాలలో చైనా తన ఆర్థిక, సైనిక దౌత్యం ద్వారా పెంచుకుంటున్న ప్రభావాన్ని అడ్డుకోవడానికి భారతదేశానికి న్యూజిలాండ్ సహకారం అవసరం. ఫిజీ, సోలమన్ దీవులు, కిరిబాటి, పాపువా న్యూగినియా వంటి దీవులలో ప్రాబల్యమున్న చైనాను ఒంటరిగా ఎదుర్కోవడం కంటే, అక్కడ దశాబ్దాలుగా బలమైన పట్టున్న న్యూజిలాండ్‌తో కలిసి పనిచేయడం భారత్‌కు ఎంతో లాభిస్తుంది.

న్యూజిలాండ్ భౌగోళికంగా పసిఫిక్ దీవులకు దగ్గరగా ఉంటుంది. అక్కడి రాజకీయాలు, సంస్కృతి, స్థానిక నాయకులతో న్యూజిలాండ్‌కు బలమైన మైత్రి ఉంది. వీటితో భారత్‌కు నేరుగా సంబంధాలు లేనందువల్ల న్యూజిలాండ్ దౌత్య సహాయంతో భారత్ ఆయా దేశాలకు సులభంగా చేరువ కాగలదు. చైనా పసిఫిక్ దీవులకు భారీగా అప్పులు ఇచ్చి, వాటిని తన గుప్పిట్లోకి తెచ్చు కుంటోంది. దీనిని అడ్డుకోవ డానికి ఇరు దేశాలూ కలిసి ఆ చిన్న దేశాలకు ప్రత్యామ్నాయ ఆర్థిక సహాయం, మౌలిక సదు పాయాల కల్పన, విపత్తు నిర్వహణలో సహాయాన్ని అందిస్తున్నాయి. పసిఫిక్ రీజియన్లోని అన్ని దేశాలతో కూడిన అత్యున్నత సంస్థ 'పసిఫిక్ ఐలాండ్స్ ఫోరమ్ (పీఐఎఫ్)'లో న్యూజిలాండ్ కీలక సభ్య దేశం. ఈ ఫోరమ్‌లో చైనా ఏకపక్ష నిర్ణయాలు తీసుకోకుండా అడ్డుకోవడానికి, భారత్ 'ఫోరమ్ ఫర్ ఇండియా–పసిఫిక్ ఐలాండ్స్ కోఆపరేషన్ (ఎఫ్ఐపీఐసీ) వ్యూహాన్ని ముందుకు తీసుకెళ్లడానికి న్యూజిలాండ్ దౌత్యపరంగా భారత్‌కు వెన్నుదన్నుగా నిలుస్తుంది. పసిఫిక్ మహా సముద్రంలో చైనా తన సైనిక నౌకలు, జలాంతర్గాముల కదలికలను పెంచుతోంది. ఈ క్రమంలో న్యూజిలాండ్ నౌకాదళం, నిఘా వ్యవస్థలు ఈ ప్రాంతంలో నిరంతర నిఘా ఉంచుతాయి. ఆ సమాచారాన్ని భారత్‌తో పంచుకోవడం ద్వారా, చైనా పసిఫిక్ ప్రాంతం నుండి హిందూ మహాసముద్రంలోకి ఎలా ప్రవేశిస్తుందో భారత్ ముందే అంచనా వేయగలదు. పసిఫిక్ దీవుల దేశాలు ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్య 'వాతావరణ మార్పులు.

భారత్, న్యూజిలాండ్ కలిసి ఈ దీవులకు గ్రీన్ ఎనర్జీ, పర్యావరణ రక్షణ సాంకేతికతను అందిస్తున్నాయి. దక్షిణ పసిఫిక్ ప్రాంతంలో చైనా అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించకుండా న్యూజిలాండ్, ఆస్ట్రేలియాలతో కలిసి భారత్ ఒత్తిడి తీసుకు రాగలదు. అమెరికా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, జపాన్, యూకే కలిసి జూన్ 2022లో ప్రారంభిం చిన 'పార్ట్‌నర్స్ ఇన్ ది బ్లూ పసిఫిక్' వ్యూహాత్మక కూటమి, పసిఫిక్ దేశాలు చైనా అప్పులవలలో పడకుండా నిరోధించేందుకే. మనదేశం నేరుగా ఇందులో అధికారిక సభ్యదేశం కాకపోయినప్పటికీ, ఈ కూటమి సభ్యులైన అమెరికా, జపాన్, ఆస్ట్రేలియాలతో భారత్‌కు 'క్వాడ్' ద్వారా, దేశీయ ఫోరం ఫర్ ఇండియా–పసిఫిక్ ఐలాండ్స్ కోఆపరేషన్ ద్వారా బలమైన సంబంధాలు ఉన్నాయి. చైనాను కట్టడి చేయడం వల్ల హిందూ మహా సముద్రంలో చైనా దూకుడు తగ్గుతుంది, ఇది భౌగోళికంగా భారత్‌కు ఎంతో లాభిస్తుంది.

జమలాపురపు విఠల్‌రావు
సీనియర్ జర్నలిస్ట్

భారత 'జలాంతర్గామి

భారత్–పాక్ యుద్ధం తర్వాత ఉత్తర అరేబియా సముద్ర జలాల్లోనే పాక్ నావికాదళం మోహరింపులు చేస్తూ వచ్చింది. 1971 తర్వాత బంగాళాఖాతం వైపు కన్నెత్తి చూసేందుకు జంకిన పాకిస్థాన్ ఇప్పుడు చైనా అండతో విర్రవీగుతోంది. చైనా నుంచి కొనుగోలు చేసిన పీఎన్ఎస్ హాంగోర్‌ను బంగాళాఖాతంలో మోహరిస్తామంటూ కొలంబో పోర్ట్ వేదికగా కెప్టెన్ ఒమర్ ఫరూక్ హెచ్చరించాడు. ఈ హెచ్చరిక వెనుక పాకిస్థాన్‌కు ఓ భయముంది. పాకిస్థాన్‌ది కేవలం అట్టహాసం, ఆర్భాటం, అర్థరహిత వాగాడంబరం. అందుకే తరచూ మాటలు పేలుతూ ఉంటుంది.

భారత రక్షణ శాఖ గడచిన దశాబ్ద కాలంలో జలాంతర్గాముల కోనుగోలుపై దృష్టి పెట్టింది. రష్యా నుంచి అణు జలాంతర్గాములను కొనుగోలు చేసేందుకు ఒప్పందం చేసుకుంది. గతేడాది డిసెంబర్‌లో 2 బిలియన్ డాలర్ల అణు జలాంతర్గామిని భారత్ లీజుకు తీసుకుంది. భారత్ వద్ద ఇప్పటికే ఐఎన్ఎస్ అరిహంత్, ఐఎన్ఎస్ అరిఘాత్, అకులా తరగతి అణు జలాంతర్గాములతో సహా మరో 19 సంప్రదాయక సబ్‌మెరైన్లున్నాయి. అంతే కాదు, క్షిపణి వ్యవస్థ, గగనతల రక్షణ వ్యవస్థ విశేషంగా బల పడ్డాయి.

డ్రోన్ రంగం అతివేగంగా బలపడుతూ వస్తోంది. భారత రక్షణ రంగం గత పదేళ్ల కాలంలో పటిష్ఠ మవుతూ వస్తోంది. గతేడాది జూలైలో మనదేశం జలాంతర్గామి విధ్వంసక రాకెట్ ప్రయోగాన్ని విజయవంతంగా పూర్తిచేసింది. అండమాన్ నికోబార్ దీవుల చుట్టూ భారత్ తన నావికాదళ సామర్థ్యాన్ని పెంచుకుంటోంది. అందుకే పాక్ ఆర్థికంగా దివాళా తీసినా.. బలూచిస్థాన్ ప్రాంతాన్ని చైనాకు ధారాదత్తం చేసి హాంగోర్ సబ్ మెరైన్‌ను కొనుగోలు చేసింది.

పాక్ వ్యవహార శైలి వ్యూహాత్మక ప్రమాదమే అయినా, ఆ దేశంతో పోలిస్తే భారత జలాంతర్గామి శక్తి, రక్షణ వ్యవస్థలకు మధ్య నక్కకూ నాకలోకానికీ ఉన్నంత వ్యత్యాసముందని చెప్పాలి. రమారమి ఐదున్నర దశాబ్దాల తర్వాత పాకిస్థాన్ ఇలాంటి శక్తికి మించిన హెచ్చరికలు చేయడానికి ప్రధాన కారణం చైనా–అమెరికాల మద్దతు. పాకిస్థాన్ 1965 నుంచి హాంగోర్ తరగతి జలాంతర్గాములను తన నావికాదళంలో వినియోగిస్తోంది.

1971 భారత్–పాక్ యుద్ధసమయంలో ఫ్రాన్స్ నుంచి కొనుగోలు చేసిన హాంగోర్‌ను భారత్ పై ప్రయోగించింది. ఐఎన్ఎస్ ఖుక్రీని ధ్వంసం చేయడంలో దీన్ని వినియోగించింది. పాక్ కెప్టెన్ అహ్మద్ తాషిమ్ డిసెంబర్ 9న ఐఎన్ఎస్ ఖుక్రీపై దాడిచేయడంలో కీలక పాత్ర పోషించాడు. ఈ దాడిలో భారత సబ్‌మెరైన్ కేప్టెన్ మహేంద్రనాథ్ సహా 170 మంది అమరులయ్యారు.

ఈ దాడికి ముందు డిసెంబర్ 4వ తేదీన పీఎన్ఎస్ ఘాజీని భారత నావికాదళం బంగాళాఖాతంలో జలసమాధి చేసింది. 1971 యుద్ధంలో భారత్ చేస్తున్న వరుస దాడులకు బెంబేలెత్తిన పాకిస్థాన్ నావికాదళం ఓడిపోయే ముందు

డిసెంబర్‌లో హాంగోర్ జలాంతర్గామిని మన నావికాదళంపై ప్రయోగించింది. చైనా–పాకిస్థాన్ మధ్య జరిగిన రక్షణ ఒప్పందంలో భాగంగా 8 హాంగోర్ తరహా జలాంతర్గాములను కొనుగోలు చేస్తోంది. తొలి విడతలో భాగంగా చైనా ఈ నెల తొలివారంలో ఒక హాంగోర్ సబ్‌మెరైన్‌ను పాక్‌కు అందజేసింది.

జలాంతర్గాములకు ఎందుకింత ప్రాధాన్యం?

'జలాంతర్గామి రణనీతి.. సైనిక బలగాలు యుద్ధంలో ఆడే చదరంగం. శత్రువు ఏం చేయబోతున్నాడో ముందే గ్రహించి, ప్రత్యర్థికి అర్థం కాకముందే దాడి చేయడమే సబ్ మెరైన్ యుద్ధనీతి' అంటారు ఇంగ్లండ్ సబ్‌మెరైన్ కమాండర్ సారావెస్ట్. రాయల్ నేవీలో సారావెస్ట్ తొలి సబ్‌మెరైన్ కమాండర్. ప్రపంచ వ్యాప్తంగా సుమారు 42 దేశాలు తమ నావికాదళంలో జలాంతర్గాములను వినియోగిస్తున్నాయి. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత రణరంగాన్ని జలాంతర్గామి గుణాత్మకంగా మార్చేసింది.

16వ శతాబ్దం నుంచి జలాంతర్గాముల తయారీపై అనేక పరిశోధనలూ జరుగుతూ వచ్చాయి. శతాబ్దం కాలం తర్వాత ప్రాథమిక దళ సబ్‌మెరైన్‌ను అమెరికా తయారు చేసింది. 1774లో జరిగిన అమెరికా అంతర్యుద్ధంలో హెచ్.ఎల్.హ్యూన్లీ మొట్టమొదటిసారి జలాంతర్గామిని పేల్చి నీటిలో ముంచేశాడు. 1800లో నెపోలియన్ బోన్‌పార్ట్ సైతం అమెరికాకు చెందిన రాబర్ట్ ఫుల్టన్ నుంచి సబ్‌మెరైన్‌ను కొనుగోలు చేశాడంటారు పౌల్ లెంజ్. ఐరిష్ మెరైన్ ఇంజనీర్ జాన్ ఫిలిప్ హోలెండ్ 1897లో రెండోదశ జలాంతర్గామిని తయారు చేసి, అమెరికా చేత ఔరా అనిపించుకున్నాడు.

ప్రపంచ యుద్ధాల్లో జలాంతర్గాముల మోహరింపు

మొదటి ప్రపంచ యుద్ధంలో మిత్ర రాజ్యాల కూటమి, కేంద్ర రాజ్యాల కూటమి సబ్ మెరైన్‌లను విస్తృతంగానే వాడాయి. అయితే అవి రెండవ ప్రపంచ యుద్ధంతో పోలిస్తే సాంకేతికంగా ఉన్నతమైనవి కావు. రెండవ ప్రపంచ యుద్ధంలో మిత్ర రాజ్యాల కూటమి, అక్ష రాజ్యాల కూటమి జలాంతర్గాములను విస్తృతంగా వాడాయి. పరస్పరం జల సమాధి చేసుకున్నాయి. అట్లాంటిక్ మహా సముద్రంలో జర్మనీ మిత్ర రాజ్యాల ఆయుధ సరఫరాకు అంతరాయం కల్పించేందుకు పెద్ద ఎత్తున సబ్‌మెరైన్లను

శక్తి'కి పాక్ సవాలు?

వినియోగించింది. జపాన్‌ను నిలువరించేందుకు అమెరికా పసిఫిక్ థియేటర్‌లో 11నాటికల్ మైళ్ల పొడవునా..తన సబ్‌మెరైన్లను మోహరించింది.

పీటర్ పాడీ ఫీల్డ్ రాసిన 'వార్ బినీత్ ది సీ' పుస్తకం రెండవ ప్రపంచ యుద్ధంలో జలాంతర్గాముల మోహరింపులను విస్తృతంగా చర్చించింది. బ్రిటన్, అమెరికా, జర్మనీ, జపాన్, ఇటలీ దేశాలు సబ్ మెరైన్లను ఎలా మోహరించాయో విపులంగా రాశారు. ఏ యే దేశాలు ఎలాంటి సబ్ మెరైన్లను వినియోగించాయో వివరించారు. మొదటి ప్రపంచ యుద్ధంతో పోలిస్తే రెండవ ప్రపంచ యుద్ధంలో మోహరించిన జలాంతర్గాములు మొత్తం ప్రపంచ

యుద్ధనీతినే ప్రభావితం చేశాయనేది పాడీ ఫీల్డ్ అంచనా. భవిష్యత్ రణస్థలి స్వభావాన్నే మార్చేసిందంటారు.

రష్యా, చైనా, అమెరికాల వద్ద ఎన్ని జలాంతర్గాములున్నాయి?

చైనా వద్ద 60 సబ్‌మెరైన్లు ఉన్నాయి. వీటిలో సగం జలాంతర్గాములు నిరంతరం మోహరింపులోనే ఉంటాయి. ప్రధానంగా దక్షిణా చైనా సముద్రంలో వీటిని ఆ దేశం మోహరిస్తుంది. దశాబ్దాలుగా వ్యూహాత్మకంగా దక్షిణ చైనా సముద్రంపై పట్టుకోసం అనేక దేశాలను భయపెడుతూ ఉంటుంది డ్రాగన్. సాగర గర్భంలో అగ్రరాజ్య ఏకఛత్రాధిపత్యానికి గండికొట్టే ప్రయత్నాలను ఇటీవలే ముమ్మరం చేసింది.

ఇటీవలి కాలంలో అణు ఆధారిత జలాంతర్గాముల తయారీలో వేగం పెంచింది. లండన్‌కు చెందిన 'ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ స్ట్రాటజిక్ స్టడీస్' సంస్థ ఈ ఏడాది ఫిబ్రవరిలో వెలువరించిన నివేదిక ఆశ్చర్యకరమైన విషయాలు వెల్లడించింది. గడచిన ఐదేళ్లలో అమెరికాతో పోలిస్తే చైనాయే వేగంగా అణు జలాంతర్గాములను తయారు చేస్తున్నట్టు పేర్కొంది. 2021-25 మధ్య కాలంలో చైనా ఏకంగా 10 అణు జలాంతర్గాములను మోహరింపునకు సిద్ధం చేసింది. అమెరికా కేవలం 7కు పరిమితమైంది.

చైనా సబ్‌మెరైన్ల బరువు 70 వేల మెట్రిక్ టన్నులు కాగా, అమెరికా తయారు చేసిన వాటి బరువు కేవలం 55వేల మెట్రిక్ టన్నులు మాత్రమే. 2030 నాటికి చైనా అణు జలాంతర్గాముల సంఖ్య అమెరికాను మించిపోతుందని 'ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ స్ట్రాటజిక్ స్టడీస్' వెల్లడించింది. పాకిస్థాన్, బంగ్లాదేశ్, మయన్మార్‌లకు చైనా జలాంతర్గాములను అమ్ముతోంది. అంటే భారత్ పొరుగున విద్వేషాలు రగులుస్తున్న దేశాలకు మాత్రమే అమ్ముతోంది. దీని ఉద్దేశం చాలా వ్యూహాత్మకం. ఈ మూడింటిలో పాకిస్థాన్ అతిపెద్ద వినియోగదారు. బాంగ్లాదేశ్ వద్ద 2035-మైన్ క్లాస్ డీజిల్-ఎలక్ట్రిక్ సబ్‌మెరైన్లు ఉంటే మయన్మార్ వద్ద ఒకటి ఉంది. ఇవి సెకండ్ హ్యాండ్ జలాంతర్గాములు. ఈ మధ్య కాలంలో థాయిలాండ్ సైతం సబ్‌మెరైన్ల కోసం చైనా వద్ద ఆర్డర్లు పెట్టింది.

రష్యా వద్ద 66 జలాంతర్గాములుంటే ఇందులో 14 బాలిస్టిక్ మిసైల్ సబ్‌మెరైన్లున్నాయి. ఇవి మాస్కో రక్షణ వ్యవస్థలో అత్యంత కీలకమైనవి. న్యూక్లియర్ పవర్డ్ క్రూయిజ్ మిసైళ్లు 25 ఉన్నాయి. డీజిల్-ఎలక్ట్రిక్ సబ్‌మెరైన్లు 22 ఉన్నాయి. ప్రత్యేక అవసరాల కోసం తయారుచేసిన జలాంతర్గాములు 8 ఉన్నాయి. వీటిని సముద్ర గర్భంలో పరిశోధనకు వినియోగిస్తారు. భారత్ సహా వియత్నాం, అల్జీరియా, ఇరాన్ తదితర 15 దేశాలకు రష్యా జలాంతర్గాములను విక్రయిస్తుంది. అత్యంత వ్యూహాత్మక ప్రయోజనాల కోసం వియత్నాం, ఇరాన్‌లకు రష్యా వాటిని విక్రయిస్తోంది.

అమెరికా వద్ద 72 అణు ఆధారిత సబ్‌మెరైన్లు ఉన్నాయి. ఇందులో 14 అణు జలాంతర్గాములు వ్యూహాత్మకంగా కీలకమైనవి. 4 క్రూయిజ్ మిసైల్ సబ్‌మెరైన్లు, 54 సబ్ మెరైన్లు శత్రువేట కోసం మోహరించేందుకు ఉపయోగించేవి. అమెరికా కేవలం ఆస్ట్రేలియాకు మాత్రమే 2030వరకూ సెకండ్ హ్యాండ్ వర్జీనియా తరహా సబ్‌మెరైన్లను అందిస్తానని చెప్పింది మినహా మరెవరికీ విక్రయించదు. ప్రచ్ఛన్న యుద్ధ సమయంలో మిత్రదేశాలకు మాత్రమే డీజిల్-ఎలక్ట్రిక్ జలాంతర్గాములను విక్రయించేది. సబ్ మెరైన్ల విక్రయం మందకొడిగా ఉండటానికి ప్రధాన కారణం వాటి తయారీకి సుమారు 20 నుంచి 25 సంవత్సరాలు పట్టడమే. సంక్లిష్టమైన, సంకీర్ణమైన వ్యవహారం. సాగర గర్భంలో వినియోగించే యుద్ధ సాధనాలను అత్యంత జాగరూకతతో తయారు చేయాలి. అందుకే సమయాభావం అవుతుంది.

భారత్‌పై కాలు దువ్వుతున్న పాకిస్థాన్ వద్ద ఉన్నవి కేవలం 10 సబ్‌మెరైన్లు. ఇవన్నీ డీజిల్-ఎలక్ట్రిక్ సబ్‌మెరైన్లు. అందుకే చైనా హాంగోర్ సబ్ మెరైన్లను కొనుగోలు చేసేందుకు 5 బిలియన్ డాలర్ల ఒప్పందం కుదుర్చుకుంది. మొత్తం 8 సబ్‌మెరైన్ల కొనుగోలుకు ఈ ఒప్పందం ఉద్దేశించింది. ఇందులో నాలుగు జలాంతర్గాములు 'కరాచీ షిప్ యార్డ్ ఇంజనీరింగ్ వర్క్స్'లో చైనా మెరైన్ ఇంజనీర్లు తయారు చేస్తున్నారు. మరో నాలుగు చైనాలో తయారవుతున్నాయి. ఈ ఎనిమిదింటిలో ఒకటి మాత్రమే ఇప్పుడు పాకిస్థాన్ నావికా దళానికి చేరింది. ఈ హాంగోర్ సబ్‌మెరైన్లు 2028 వరకూ అందజేయాలనేది ఒప్పందం సారాంశం.

ప్రశాంత్ జోషి
సీనియర్ జర్నలిస్ట్

కనిపించని

మనం హోటల్‌కు వెళ్లి టిఫిన్ తింటే దేశ జీడీపీ పెరుగుతుంది. అదే అమ్మ లేదా భార్య అంతకంటే రుచిగా, ఆరోగ్యంగా ఇంట్లో వండి పెడితే దేశ సంపద పెరగదు. భారతదేశ స్థూల దేశీయోత్పత్తి లెక్కల్లోనే మహిళల శ్రమ పట్ల ఓ కనిపించని కోణం ఉంది. ఉదయం అందరికంటే ముందే లేచి, రాత్రి అందరూ పడుకున్నాక కూడా విశ్రమించని గృహిణి శ్రమను మన సమాజం ఉచిత సేవగా చూస్తుంది. కానీ, ఆధునిక ఆర్థికశాస్త్ర కోణంలో చూస్తే... ఈ ఉచిత సేవలే దేశ ఆర్థిక వ్యవస్థకు అసలైన ఇంధనంగా పనిచేస్తున్నాయి. ఒక సాధారణ మధ్య తరగతి గృహిణి శ్రమకు మార్కెట్ పరంగా విలువ కడితే అది ఏ ఐటీ ఉద్యోగి జీతానికీ తక్కువ కాదు.

ఉద్యోగం చేసే పురుషుడికి ఆఫీస్ పని ముగియగానే విశ్రాంతి దొరుకుతుంది, కానీ మహిళకు ఆఫీస్ ముగిసిన వెంటనే ఇంట్లో రెండో షిఫ్ట్ మొదలవుతుంది. ఈ ద్వంద్వ భారాన్ని మోయలేక ఎంతోమంది చదువుకున్న మహిళలు తమ వృత్తిజీవితాన్ని మధ్యలోనే వదిలేస్తున్నారు. భారతదేశంలో 25 నుండి 59సంవత్సరాల వయస్సు గల మహిళలు ప్రతిరోజూ దాదాపు ఏడు గంటలు ఉచిత గృహ సేవలకు కేటాయిస్తున్నారు. సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పుల్లో ఈ శ్రమకు భావనాయుక్త ఆదాయం (నోషనల్ ఇన్‌కమ్) లెక్కించాలని స్పష్టం చేసినా, సమాజంలోనూ, ప్రభుత్వ గణాంకాల్లోనూ దీనికి తగిన గుర్తింపు లభించడం లేదు. అటు ఆఫీస్, ఇటు ఇల్లు ఏ బాధ్యతను వదలకుండా మహిళలు అనుభవిస్తున్న ద్వంద్వ భారం వారిని తీవ్రమైన 'టైమ్ పావర్టీ' (సమయ దారిద్ర్యం)లోకి నెట్టేస్తోంది. ఈ కనిపించని శ్రమను గుర్తించకపోతే, భవిష్యత్తులో అభివృద్ధి చెందిన దేశాలు ఎదుర్కొంటున్న 'బామోల్ కాస్ట్ డిసీజ్', జనాభా సంక్షోభంవంటి ముప్పులను భారతదేశం కూడా ఎదుర్కోవాల్సి వస్తుంది.

అభివృద్ధి చెందిన దేశాలలో మహిళల ఆర్థిక భాగస్వామ్యం పెరిగినా, సరైన కుటుంబ సహకారం, వ్యవస్థ లేక జనాభా రేటు పడిపోతోంది. ఫలితంగా ఆయా దేశాలు బామోల్ కాస్ట్ డిసీజ్ బారిన పడుతున్నాయి.

ఉద్యోగం చేసే మహిళలు ఆఫీసు, ఇంటి పనులను రెండింటినీ బ్యాలెన్స్ చేయాల్సి రావడం వల్ల విపరీతమైన శారీరక, మానసిక ఒత్తిడికి లోనవుతున్నారు. భారతదేశంలో మహిళల శ్రమశక్తి భాగస్వామ్యం తక్కువగా ఉండటానికి ఇది కూడా ప్రధాన కారణం. పురుషులు ఇంటి పనుల కోసం 45 నిమిషాల కంటే తక్కువ సమయం కేటాయిస్తున్నారు అని కొన్ని పరిశోధనలు చెప్తున్నాయి. ఇది శ్రమ విభజనలో ఉన్న అనమతుల్యతను చూపుతోంది. ఇంటి పని కేవలం మహిళల బాధ్యత మాత్రమే కాదనే స్పృహ, పురుషులలో బాధ్యతను పంచుకునే తత్వం పెరిగినప్పుడే ఈ ద్వంద్వ భారం తగ్గుతుంది.

ప్రస్తుత మన దేశ అధికారిక స్థూల దేశీయోత్పత్తి కేవలం మార్కెట్లో డబ్బు చేతులు మారే లావాదేవీలను మాత్రమే లెక్కిస్తుంది. ఆర్థికవేత్తలు చెప్పే ప్రకారం చూస్తే మనం బట్టలు డ్రైక్లీనింగ్‌కు ఇస్తే దేశ సంపద పెరుగుతుంది, అదే భార్య ఇంట్లో ఉతికితే పెరగదు. భారత ప్రభుత్వ 'టైమ్ యూజ్ సర్వే' ప్రకారం, మహిళల ఉచిత సేవలను గనుక దేశ ఆర్థిక వ్యవస్థలో లెక్కిస్తే... భారతదేశ అధికారిక జీడీపీ విలువకు అదనంగా కనీసం 15% నుండి 30% వరకు పెరిగే అవకాశం ఉంది. అప్పుడు మహిళల ఆర్థిక సహకారం ఏంటో ప్రపంచానికి స్పష్టమైన గణాంకాలతో తెలుస్తుంది.

ఇల్లు ఊడవడం, వండడం, పిల్లల, వృద్ధుల సంరక్షణ వంటి పనులను సమాజం బాధ్యత లేదా ప్రేమ అనే పేరుతో చూస్తుంది తప్ప, దాని వెనుక ఉన్న శ్రమను గుర్తించదు. దీన్ని 'అన్‌పెయిడ్ కేర్ వర్క్' అంటారు. మహిళలు ఇంట్లో చేసే కనీస నాలుగు గంటల ఉచిత సేవలకు గనుక ఆర్థిక విలువ కట్టి, ఒక బయటి వ్యక్తిని పనికి పెట్టుకుంటే ఎంత ఖర్చవుతుందో అంత విలువ జీడీపీలో చేరిస్తే, దేశ ఆర్థిక వ్యవస్థ పరిమాణం గణనీయంగా పెరుగుతుంది. అప్పుడు మహిళల శ్రమ దేశ పురోగతికి ఎంత పునాదిగా ఉందో స్పష్టమైన గణాంకాలతో నిరూపితమవుతుంది.

ఇంటి సేవలకు విలువ కట్టడానికి ఆర్థికవేత్తలు ప్రధానంగా రెండు పద్ధతులను ఉపయోగిస్తారు.

మార్కెట్ రీప్లేస్‌మెంట్ పద్ధతి

ఇంట్లో మహిళలు చేసే ప్రతి పనిని విడివిడిగా చూసి, అదే పనిని బయటి వ్యక్తులతో చేయిస్తే ఎంత ఖర్చవుతుందో లెక్కించడం. హోటల్ నుండి భోజనం తెప్పించడానికి లేదా వంట మనిషికి ఇచ్చే జీతం. పిల్లల లేదా వృద్ధుల సంరక్షణ, బేబీ సిట్టర్ లేదా ప్రొఫెషనల్ కేర్ టేకర్ ఫీజు, ఇల్లు శుభ్రం చేయడం,

బట్టలు ఉతకడం, హౌస్ కీపింగ్ లేదా మెయింటెనెన్స్ వంటివి అన్నీ ఈ ఉచిత సేవల్లోకే వస్తాయి. ఈ సేవలన్నింటికీ మార్కెట్ రేట్ల ప్రకారం నెలవారీ ఖర్చు లెక్కిస్తే, ఒక సాధారణ గృహిణి చేసే శ్రమ విలువ నెలకు వేల రూపాయల్లో కొన్నిసార్లు ఐటీ ఉద్యోగి జీతంతో సమానంగా ఉంటుంది.

ఒక మహిళ 7గంటలు ఇంట్లో ఉచిత సేవలు చేయకుండా, బయట మార్కెట్లో ఉద్యోగం చేసి ఉంటే ఆమె విద్యార్హత, నైపుణ్యాల బట్టి ఎంత సంపాదించగలదో లెక్కించడం కూడా ఒక పద్ధతి. అంటే ఇంటి పని కోసం ఆమె ఎంత సంపాదనను త్యాగం చేసిందో చెప్పేదే ఈ పద్ధతి.

విలువ వల్ల మార్పు

మహిళల్లో ఆత్మగౌరవం పెరుగుతుంది: ఇంట్లో ఖాళీగానే ఉంటున్నావుగా అనే మాటల స్థానంలో, వారి శ్రమకు ఒక గుర్తింపు లభిస్తుంది.

న్యాయపరమైన రక్షణ

ప్రమాదవశాత్తు ఒక గృహిణి చనిపోతే, ఆమె కుటుంబానికి ఇచ్చే బీమా లేదా నష్టపరిహారాన్ని లెక్కించడానికి సుప్రీంకోర్టు కూడా ఇప్పుడు గృహిణి శ్రమ ఆర్థిక విలువను పరిగణనలోకి తీసుకోవాలని

ఆర్థిక 'శక్తి'

స్పష్టం చేసింది.

పాలసీల రూపకల్పన

ప్రభుత్వం మహిళల కోసం పథకాలు లేదా పెన్షన్లు ప్రవేశపెట్టేటప్పుడు వారిని ఉత్పాదకత లేనివారిగా కాకుండా, కనిపించని ఆర్థిక భాగస్వాములుగా గుర్తిస్తుంది. అందుకే, ఇంట్లో చేసే సేవలు ఉచితం కావచ్చు...కానీ అవి అమూల్యమైనవే కాక వాటికి ఆర్థిక విలువ కట్టడం సాధ్యమౌతుంది.

సమాజం గుర్తించకపోయినా, భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు గృహిణి శ్రమ విలువను చట్టపరంగా అంగీకరించింది. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాల్లో గృహిణులు మరణించినప్పుడు వారి కుటుంబాలకు ఇచ్చే నష్టపరిహారాన్ని లెక్కించే సందర్భాల్లో కోర్టులు చారిత్రాత్మక తీర్పులను ఇచ్చాయి.

2021 నాటి ఒక కీలక కేసులో ఒక గృహిణి ఇంట్లో చేసే శ్రమ, ఆఫీసులో భర్త సంపాదించే సంపాదన కంటే ఏ మాత్రం తక్కువ కాదని, ఆమె సేవలకు కచ్చితమైన భావనాయుక్త ఆదాయం లెక్కించాల్సిందేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అంతే కాదు గృహిణి శ్రమను తక్కువ చేసి చూడటం లింగ సమానత్వానికి విరుద్ధం అని పేర్కొంది. ఈ తీర్పు గృహిణుల శ్రమకు దక్కిన ఒక పెద్ద నైతిక విజయం.

మార్పు ఎక్కడ రావాలి?

గృహిణి శ్రమకు విలువ కట్టడం అంటే ఆమెకు కుటుంబం జీతం ఇవ్వాలని కాదు... ఆమె చేసే పనికి గౌరవం, గుర్తింపు ఇవ్వడం. ఈ మార్పు కేవలం ప్రభుత్వ లెక్కల్లోనే కాదు, ప్రతి ఇంట్లోనూ రావాలి. ఇంటి పని కేవలం మహిళల బాధ్యత అనే ఆలోచన నుండి బయటపడి, పురుషులు కూడా ఇంటి పనుల్లో, పిల్లల పెంపకంలో సమానంగా భాగ స్వాములు కావాలి.

పరిస్థితి అధ్యయనం

అభివృద్ధి చెందిన దేశాలలో, కార్మికశక్తిలో మహిళల భాగస్వామ్యం పెరగడం అనేది కుటుంబ వ్యవస్థ దెబ్బతినేలా చేసింది. అక్కడ సంతానోత్పత్తి రేటు భర్తీ రేటు కంటే గణనీయంగా పడిపోయింది, వృద్ధుల జనాభా వాటా పెరిగింది, బంధువులు లేని ఒంటరి వృద్ధుల శాతం ఆందోళనకరంగా పెరిగింది. దీనివల్ల ఆయా దేశాల ఆర్థిక వ్యవస్థలు జీడీపీలో పెద్ద వాటాను వృద్ధుల సంరక్షణ కోసమే ఖర్చు చేయాల్సి వస్తోంది. ఈ సంరక్షణ పరిశ్రమ ఎంతో శ్రమతో కూడుకున్నది, కాబట్టి ఇది బామోల్ వ్యయ సంక్షోభానికి (బామోల్ కాస్ట్ డిసీజ్) లోనవుతుంది. అంటే కాలక్రమేణా సంరక్షణ అందించే ఖర్చు పెరుగుతూనే ఉంటుంది. జపాన్, దక్షిణ కొరియా, పశ్చిమ ఐరోపా వంటి అభివృద్ధి చెందిన దేశాలు నేడు ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాలు ఇదే.

సంతానోత్పత్తి రేటు క్షీణత

అభివృద్ధి చెందిన దేశాలలో జీవన వ్యయం పెరగడం, మహిళలు కెరీర్‌కు ప్రాధాన్యత, ద్వంద్వ భారం మోయలేకపోవడం వల్ల చాలామంది పిల్లలను కనకూడదని లేదా ఒక్కరితోనే ఆగిపోవాలని నిర్ణయించుకుంటున్నారు. దీంతో జనాభా స్థిరంగా ఉండటానికి కావలసిన భర్తీ రేటు పెరగటం లేదు. ప్రస్తుతం దక్షిణ కొరియా, జపాన్, ఇటలీ వంటి దేశాలలో ఇది ప్రమాదకర స్థాయికి పడిపోయింది. దీనివల్ల యువ జనాభా తగ్గి, దేశాలు వృద్ధాప్యం వైపు వేగంగా దూసుకుపోతున్నాయి. కుటుంబ వ్యవస్థ బలహీనపడటం, ఒంటరితనం కూడా భారీగా పెరుగుతున్నాయి.

సాంప్రదాయ ఉమ్మడి కుటుంబ వ్యవస్థలు లేకపోవడం, సామాజిక వైయక్తీకరణ పెరగడం వల్ల వృద్ధులను చూసుకునే బంధువులు కరవయ్యారు. జపాన్ లాంటి దేశాల్లో ఒంటరిగా జీవిస్తూ, ఎవరికీ తెలియకుండా వృద్ధులు మరణించే కోడోకుషి (ఒంటరి మరణాలు) అనే భయంకర సామాజిక సమస్య దీనివల్లనే పుట్టుకొచ్చింది. ఆర్థికవేత్త విలియం బామోల్ చెప్పిన 'కాస్ట్ డిసీజ్' సంరక్షణ రంగానికి వంద శాతం వర్తిస్తుంది.

ప్రస్తుతం దక్షిణ కొరియా, జపాన్, ఇటలీ వంటి దేశాలలో సంతానోత్పత్తి రేటు ప్రమాదకర స్థాయికి పడి పోయింది. దీనివల్ల యువ జనాభా తగ్గి, దేశాలు వృద్ధాప్యం వైపు వేగంగా దూసుకుపోతున్నాయి. కుటుంబ వ్యవస్థ బలహీనపడటం, ఒంటరితనం కూడా భారీగా పెరుగుతున్నాయి.

ఐటీ లేదా మాన్యుఫ్యాక్చరింగ్ రంగాల్లో సాంకేతికత వల్ల ఒక ఉద్యోగి చేసే పని సామర్థ్యం రేటు పెరుగుతుంది. కానీ, ఒక వృద్ధుడిని లేదా రోగిని చూసుకోవడానికి ఒక మనిషి ఇచ్చే సమయం, సానుభూతి మారవు. టెక్నాలజీ వచ్చినా ఒక నర్సు లేదా కేర్‌టేకర్ చేయాల్సిన శ్రమ తగ్గదు. ఇతర రంగాల్లో జీతాలు పెరుగుతున్నప్పుడు, కేర్ ఇండస్ట్రీలో కూడా పని చేసేవారికి సమానంగా జీతాలు పెంచాలి లేకపోతే ఆ పనిలో ఎవరూ చేరరు. ఉత్పాదకత పెరగక పోయినా జీతాల ఖర్చు పెరగడం వల్ల, కాలక్రమేణా వృద్ధుల సంరక్షణ అనేది ప్రభుత్వంపై, కుటుంబాలపై మోయలేని ఆర్థిక భారంగా మారుతుంది.

మనకు ఎలాంటి హెచ్చరిక?

భారతదేశం ప్రస్తుతం యువ జనాభా ఎక్కువగా ఉన్న కాలంలో ఉంది. కానీ, మనం కూడా అభివృద్ధి చెందిన దేశాల తప్పుల నుండి పాఠాలు నేర్చుకోకపోతే అటువంటి పరిణామాలనే ఎదుర్కోవాల్సి వస్తుంది. మహిళలు ఉద్యోగాలు చేయడాన్ని ఆపడం దీనికి పరిష్కారం కాదు. ఎందుకంటే దేశ ఆర్థిక వృద్ధికి వారి భాగస్వామ్యం అవసరం. కెరీర్ కోసం వారు కుటుంబాన్ని లేదా పిల్లలను పూర్తిగా వదులుకునే పరిస్థితి రాకుండా ఉండాలంటే... ప్రభుత్వం, సమాజం కలిసి సంస్థాగత మద్దతు అందించాలి. నాణ్యమైన, ఉచిత లేదా తక్కువ ఖర్చుతో కూడిన చైల్డ్ కేర్ సెంటర్లు, వృద్ధుల సంరక్షణ కేంద్రాలు అందుబాటులోకి తేవాలి. పురుషులు ఇంట్లో బాధ్యతలను సమానంగా పంచుకోవడం, ఫ్లెక్సిబుల్ వర్క్ సంస్కృతిని తీసుకురావడం ద్వారా మాత్రమే ఈ పాశ్చాత్య దేశాల సంక్షోభం మన దేశానికి రాకుండా చూసుకోగలం.

జయశ్రీ ఆచంట

సీనియర్ జర్నలిస్ట్

వందేళ్ల

శ్రీ పుట్టపర్తి నారాయణాచార్యులు తన 12వ ఏట "పెనుగొండలక్ష్మి" అనే పుస్తకం రచించారు."దీనిని వ్రాయువేళకు నా వయస్సు పండ్రెండు సంవత్సరములు. ఆనాటికి నాకు ఛందస్సు కూడా రాదు కాని చిన్ననాటి నుండి తిక్కన భారతమును, జదువులు మాత్రమలవాటు. ఆ వాచక శక్తియే యీ రచనమునకు బునాది" అని ఉపోద్ఘాతములో రాసుకున్నారు పుట్టపర్తివారు.

1336-1350 ప్రాంతాలలో హరిహరరాయలు విద్యానగరాన్ని పాలిస్తున్నప్పుడు, వారి తమ్ముడు బుక్కరాయలు పెనుగొండలో రాజ ప్రతినిధిగా నివసించారట! బుక్కరాయలు విజయనగరం రాజైనప్పుడు అనంత సాగరుడు పెనుగొండ కోటను కట్టించాడు. ఇక కృష్ణదేవరాయలు వేసవి విడిదిగా పెనుగొండను తీర్చిదిద్దాడు. తళ్లికోట యుద్ధానంతరం తిరుమల రాయుడు పెనుగొండను రాజధానిగా చేసుకొని పాలన సాగించాడు. నిజాము మూడుమార్లు దండెత్తి రాగా తిరుమలరాయుడు మూడుమార్లూ అతనిని తరిమికొట్టాడట.

పెనుగొండ కోట నిర్మాణంలో వాడిన శిలల గురించి "ఎట్లు పైకెత్తిరో యేనుగున్నలకైన తల దిమ్ముగొలుపు నీ శిలల బరువు" అనే పద్యంలో ఏనుగులకు సైతం తల దిమ్మెక్కే బలమైన శిలలు ఎలా ఎత్తారో ఆనాడు అంటారు

డా. కాశింశెట్టి సత్యనారాయణ
విశ్రాంత ఆచార్యుడు

నారాయణాచార్యులు.

బంగారు పల్లకీలలో కవులను కూర్చోబెట్టి పండితులు వారిని కీర్తిస్తూ ఉండగా, సార్వభౌముడు తాను సైతం మోసుకొని వచ్చిన దృశ్యం పుట్టపర్తి వారికి గుర్తువచ్చింది.

ఈ కావ్యమంతా గత వైభవ ఘనకీర్తిని గానం చేస్తూ - దాన్ని పునరుజ్జీవింప చేయగలిగే శక్తి యుక్తులను సహజంగా అలవర్చుకోవాలన్న సందేశం వినిపిస్తుంది. పుట్టపర్తి వారి మనసులో గుబాళించిన మల్లెల సౌరభం పెనుగొండ ఉద్యానవనాల్లోనిదే. ఘనగిరిగా ప్రసిద్ధమైన పెనుగొండరాయల కాలంలో దానిమ్మ తోటలకు, ద్రాక్ష తోటలకు లవంగ లతికలకూ ఆకారంగా ఉండేదట! పెనుగొండలో విహరించి అక్కడ మల్లెపూల గుబాళింపులకు పులకించి, ద్రాక్ష తోటల సోయగాలకు సొలసి, అల్లసాని పెద్దన హిమాలయ సానుసీమల ప్రకృతి సౌందర్యాన్ని అంత హృద్యంగా రూపు కట్టించాడనీ, భట్టుమూర్తి వసుచరిత్ర నేపథ్యమంతా ఘనగిరి ఘనతేనని పుట్టపర్తివారి ప్రగాఢ విశ్వాసం.

పెనుగొండ లక్ష్మి గురించి ఇక్కడ ఒక మాట చెప్పాలి. తన 12వ ఏట రాసిన ఈ పుస్తకమే తన 37వ ఏట విద్వాన్ పరీక్షకు పాఠ్యగ్రంథం కాగా ఆ పరీక్షల్లో పుట్టపర్తివారు ఫెయిల్ అయ్యారట. కారణం ఒక్క ప్రశ్నకు 40 పేజీల ఆన్సర్ రాసేటప్పటికి సమయం దాటిపోయిందట ప్రపంచంలో ఏ కవికీ ఇటువంటి పరిస్థితి రాలేదు.

"ఇది యాంధ్ర వీరాగ్ని యినుమడింపగ" పద్యంలో పెనుగొండ కోటను చూస్తూ అక్కడ శత్రు రాజుల హృదయములను అల్లకల్లోల మొనరించిన ఆంధ్ర వీరాగ్ని శౌర్యాన్ని - ఆ పదకొండేళ్ల బాల నారాయణ వివరించాడు.

తళ్లికోట యుద్ధం విజయనగర సామ్రాజ్య చరిత్రను మలుపు తిప్పిన అత్యంత కీలకమైన, విషాదకరమైన ఘట్టం. ఈ యుద్ధం సా.శ.1565 జనవరి 23న ప్రస్తుత కర్ణాటకలోని కృష్ణా నదీ తీరాన గల రాక్షసి-తంగడి గ్రామాల మధ్య జరిగింది.

ఈ యుద్ధం విజయనగర సైన్యానికీ (ప్రధానమంత్రి అళియ రామరాయలు అతని సోదరులు తిరుమల దేవరాయలు, వేంకటాద్రి నేతృత్వంలో), దక్కన్ సుల్తానుల కూటమికి (బీజపూర్, గోల్కొండ, అహమ్మద్‌నగర్, బీదర్ సుల్తానులు) మధ్య జరిగింది. విజయనగరం మొదట పైచేయి సాధించినప్పటికీ రామరాయల సైన్యంలోని ఇద్దరు ముస్లిం సేనాపతులైన గిలానీ సోదరులు చివరి నిమిషంలో ద్రోహంచేసి సుల్తానుల వైపు చేరారు. దీనితో 80 ఏళ్ల వృద్ధుడైన రామరాయలు అహమ్మద్‌గనర్ సుల్తాన్ నిజాంషాకు చిక్కాడు. యుద్ధభూమిలోనే రామరాయల శిరచ్ఛేదం చేశాడు, వేంకటాద్రి అదృశ్యమయ్యాడు. తిరుమల దేవరాయలు మిగిలిన సైన్యాన్ని రాజవంశీయులను, సామ్రాజ్య ఖజానాను ఏనుగులపై తీసుకుని హంపీ నుండి పెనుగొండకు సురక్షితంగా తరలిపోయాడు. హంపీ నగరాన్ని నెలల తరబడి లూటీ చేశారు ముష్కరులు.

పెనుగొండ చుట్టూ ఎత్తైన కొండలు, దట్టమైన అడవులు ఉండటం వలన శత్రువుల దాడులకు అంత సులభంగా చిక్కని సహజరక్షణ కలిగి వుంది. దీనికి తోడు ఆ నగరం చుట్టూ భారీ రాతి గోడను, బురుజులను నిర్మించారు. లోపల గగన్ మహల్ అనే అందమైన రాజ ప్రాసాదాన్ని నిర్మించారు. తళ్లికోట యుద్ధంలో నష్టపోయిన సైన్యాన్ని పెనుగొండ కోట కేంద్రంగా తిరుమల దేవరాయలు పునర్‌నిర్మించాడు. ఇది ఆరవీడు రాజ్యాన్ని మరో శతాబ్దకాలం పాలించడానికి పునాది వేసింది.

రెవరెండు హెన్రీ హేరాస్ రాసిన ప్రసిద్ధ చారిత్రక గ్రంధం "ది ఆరవీడు డైనాస్టీ ఆఫ్ విజయనగర". ఇది విజయనగర సామ్రాజ్యాన్ని పరిపాలించిన నాల్గవ, చివరి హిందూ రాజవంశమైన ఆరవీడు వంశ సమగ్ర చరిత్ర. దీనికి తోడు విలాపాక్కిం తామ్ర శాసనం విజయనగర సామ్రాజ్య చరిత్రకు, ముఖ్యంగా ఆరవీటి వంశరాజుల కాలానికి సంబంధించిన కీలకమైన చారిత్రక ఆధారం. అలాగే కల్లూరు దాన శాసనాన్ని 2వ వేంకటపతి దేవరాయలు వేశాడు. వీటి ఆధారాలతో ఈ క్రింది విషయాన్ని వివరిస్తున్నాం.

తళ్లికోట యుద్ధం ముగిసిన కొద్దిరోజులకే (సా.శ.1568-1570 ప్రాంతంలో) విజయనగర సామ్రాజ్యం ఇంకా కోలుకోలేదనే బలహీనతను ఆసరాగా చేసుకొని బీజాపూర్ సుల్తాన్ ఆలీ ఆదిల్‌షా తన అత్యంత శక్తిమంతమైన ఫిరంగిదళం, వేల కాల్బలం, అశ్విక దళాలతో వచ్చి పెనుగొండ కోటను చుట్టుముట్టాడు. కోటలోనికి ఆహారం, నీళ్లను నిలిపివేశాడు. ఇక గత్యంతరం లేక గోవిందరాజు తిమ్మ (మంత్రి), పాపయ్యశెట్టి (సైన్యాధ్యక్షుడు) ఆలీ ఆదిల్‌షా

ఆరవీడు వంశ పాలన

పెనుగొండ చుట్టూ ఎత్తైన కొండలు, దట్టమైన అడవులు ఉండటం వలన శత్రువుల దాడులకు అంత సులభంగా చిక్కని సహజరక్షణ కలిగి వుంది. దీనికి తోడు ఆ నగరం చుట్టూ భారీ రాతి గోడను, బురుజులను నిర్మించారు. లోపల గగన్‌మహల్ అనే అందమైన రాజ ప్రాసాదాన్ని నిర్మించారు. తళ్లికోట యుద్ధంలో నష్టపోయిన సైన్యాన్ని పెనుగొండ కోట కేంద్రంగా తిరుమల దేవరాయలు మళ్లీ పునర్‌నిర్మించాడు. ఇది ఆరవీడు రాజ్యాన్ని మరో శతాబ్దకాలం పాలించడానికి పునాది వేసింది.

వద్దకు రాయబారిగా వెళ్లారు. ఈ రాయబారం కుదిరింది. మొదటి అంశం పెనుగొండ కోట చుట్టూ ఆదిల్‌షా సైన్యంను ఉపసంహరించుకోవడం, అలా చేశాక 30,000మంది మస్కిటీర్స్‌ను (తుపాకీ సైన్యం), ఆహారం, నీరు నిల్వచేశారు. కోట లోపల ఎటువంటి కరువు రాకుండా అన్ని వస్తువులు సమకూర్చుకొని, తన సామంతులైన తంజావూరు పాలకుడు అచ్యుతప్ప, అతని తన 2వ కుమారుడు రఘునాథనాయకుని అప్రమత్తం చేశాడని రఘునాదాభ్యుదయంలో వ్రాశారు. సైన్యాధ్యక్షులైన జగ్గదేవ, కుల్రాజుశెట్టి, పాపయ్యశెట్టి మట్ల అనంతరాజు, మలుప రాజులను తమ సైన్యంతో సిద్ధం చేశాడు. వీరు వ్యక్తులు మోసే ఫిరంగులను సిద్ధం చేశారు.

సుల్తాన్ ఆదిల్‌షా పెన్నానది ఒడ్డున తన ఫిరంగి దళాన్ని ఉంచాడు. ఇవి స్థిరంగా ఉంటూ కదల్చడానికి వీలుకాదు. ఫిరంగులను నిరంతరాయంగా పేల్చడానికి లేదు. కారణం అవి వేడెక్కుతాయి, లోపలి భాగం పాడవుతుంది కాబట్టి అవి చల్లారడానికి కొంత సమయం ఇవ్వాలి. ఫిరంగులు పేలుతున్న సమయంలో చాకచక్యంగా తప్పించుకొని, అవి చల్లారడానికి సమయం ఇవ్వగానే ఆలీ ఫిరంగిదళాన్ని కకావికలు చేశారు.

ఇలా యుద్ధం జరుగుతూ ఉండగా వర్షాకాలం వచ్చి పెన్నానది పొంగటం ప్రారంభించింది. ఈలోగా కులీకి శత్రువైన అహమ్మద్‌నగర్ నిజాంషాతో దౌత్యం చేసి, ఇక్కడ యుద్ధం జరిగే సమయంలో బీజపూర్‌పై నుండి చేసేటట్టు ఏర్పాటుచేశాడు. దానితో బీజాపూర్ సైన్యం వెనక్కి వెళ్లిపోవాల్సి వచ్చింది. పెన్నానది ఉధృతికి సైన్యం నదిని దాటడం కష్టమయ్యింది. వర్షాల వల్ల బురదలో ఫిరంగులను తిరిగి తీసుకువెళ్లడం కష్టమయ్యింది. వాటిని బండ్లపై తీసుకు వెళ్లాలి బండి బురదలో కూరుకుపోయేది. చావు తప్పి కన్నులొట్టపోయి ఆలీ మాత్రం బీజాపూర్ చేరాడు.

తన సొంత రాజధాని ప్రమాదంలో పడిందని తెలుసుకున్న బీజాపూర్ సుల్తాన్ ఆలీ ఆదిల్‌షా పెనుగొండ ముట్టడిని అర్ధాంతరంగా విరమించుకుని తన సైన్యంతో వెనక్కి వెళ్లిపోవాల్సి వచ్చింది. ఈ విధంగా తిరుమలరాయలు శత్రువుల అంతర్గత విభేదాలను వాడుకొని పెనుగొండకోటను, విజయనగర సామ్రాజ్యాన్ని ముస్లింల వశం కాకుండా కాపాడగలిగారు. దీనినే చరిత్రలో పెన్నా యుద్ధంగా పిలిచారు. ఈ విజయంతో ఆయన అధికారం బాగా బలపడింది. సా.శ.1570లో అధికారికంగా చక్రవర్తి పట్టాభిషేకం చేసుకున్నారు. అయిన విదేశీ చరిత్రకారులు ఈ సంఘటనకు ప్రాధాన్యత ఇవ్వలేదు.

"అన్నాతి గూడ హరుడవు
అన్నాతి గూడకున్న నసుర గురుండౌ
అన్నా తిరుమల రాయా
కన్నొక్కటి లేదు గాని కాంతుడుగావే"

తిరుమలరాయ నీవు నీ భార్యతో కూడి ఉంటే మూడు కన్నుల శివుడవు. నీది ఒక కన్ను + ఆమెవి రెండు కళ్లు = 3 కన్నులు గల హరుడవు. ఆమెతో కూడకుండా ఉంటే నీవు రాక్షస గురువైన శుక్రాచార్యుడవు (ఆయనకు ఒక కన్నే కలదు). నీకు ఒక కన్ను లేకపోయినా నీవు మన్మధుడవే అని రామరాజ భూషణుడు అన్నట్లు కొందరు పండితులు చెప్పగా, దీన్ని తెనాలి రామకృష్ణ చెప్పాడని మరికొందరు పండితులు తెలియజేస్తున్నారు.

ఈ చాటు పద్యాన్ని బట్టి తిరుమల రాయలకు ఒక కన్ను మాత్రమే వుందని తెలుస్తోంది. తళ్లికోట యుద్ధంలో సుమారుగా విజయనగర వీరులందరూ మరణించారు. ఒక తిరుమలరాయలు తప్ప, యుద్ధ ప్రారంభంలోనే ఈయన కన్నుకు ఈటె గుచ్చుకొని గాయం కాగా యుద్ధ భూమి నుండి వెనుదిరిగాడు కాబట్టి ఈయన బ్రతికాడు. అంతేకాదు ఆరవీడు రాజవంశం మరో శతాబ్దంపాటు పెనుగొండను రాజధానిగా చేసుకుని పాలించారు. ★

ఉన్మాది ఘాతుకం.. 'పోక్సో' దర్యాప్తుపై

రెండు గంటల్లో ఆరు ప్రాణాలు... ఒక ఉన్మాది చేతిలో ఛిద్రమైన రెండు కుటుంబాలు... రాజధానికి సమీపంలోని రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో చోటుచేసుకున్న ఈ దారుణం రాష్ట్రాన్ని కుదిపేసింది. అయితే రక్తసిక్తమైన ఆ కాళరాత్రికి కారణం ఒక్క వ్యక్తేనా? లేక వ్యవస్థ వైఫల్యమా? సమాజం, వ్యవస్థ, చట్టాలను అమలు చేసే యంత్రాంగం కూడా 'తిలాపాపం.. తలా పిడికెడు' మాదిరిగా బాధ్యత మోయాలా? అని రేగుతున్నాయి.

జూలై 11, 2026 శనివారం. తెల్లవారు జామున పల్లెలు మేల్కొనే సమయం. కోడి కూతలు వినిపిస్తున్నాయి. పొలాల వైపు వ్యవసాయదారుల అడుగులు పడుతున్నాయి. కానీ రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం దైవాలగూడలో మాత్రం ఆ ఉదయం పక్షుల కిలకిలలు వినిపించలేదు. వినిపించినవి కేవలం రోదనలే. ఒక ఇంటి ముందు కన్నీటి సముద్రం. మరో ఇంటి ముందు అంతులేని శోకం. రెండు గంటల వ్యవధిలో ఆరు ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. ఆ గ్రామంలోనే కాదు... రాష్ట్ర చరిత్రలో కూడా చెరగని మచ్చగా మిగిలిపోయే అత్యంత దారుణ దుర్ఘటన అది. ఈ నరమేధం కేవలం ఒక క్రైమ్ స్టోరీ మాత్రమే కాదు... సమాజాన్ని, పోలీసు వ్యవస్థను, ప్రభుత్వాన్ని నిలదీస్తోన్న రక్తపు గాయం.

కోరిన యువతి, భార్య, కన్న పిల్లలే లక్ష్యం

ఈ దారుణంలో మరణించినవారు ఎవరో కాదు. తనపై పోక్సో కేసు పెట్టిన మైనర్ బాలిక, ఆమె తల్లి, నాయనమ్మ... ఈ రక్తపాతం అంతటితో ఆగలేదు.. తన భార్య, ఇద్దరు చిన్న కుమారులనూ బలి తీసుకుంది. మొత్తం రెండే రెండు గంటల్లో ఆరు ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. కానీ, వాడిలో మాత్రం పశ్చాత్తాపం కరవయ్యింది.

ఒక కుటుంబం న్యాయం కోరింది...రక్షణ కోరింది... చివరకు శవమైంది. ఈ కథ ఒక హత్యతో ప్రారంభం కాలేదు. ఒక ఫిర్యాదుతో ప్రారంభమైంది. మైనర్ బాలికను ప్రేమ పేరుతో వేధింపులకు గురిచేస్తున్నాడంటూ ఆమె తల్లి పోలీసులను ఆశ్రయించింది. కాలేజీకి వెళ్లినా వెంటపడటం, బెదిరించడం, బలవంతంగా తీసుకెళ్లే ప్రయత్నం చేయడం.పరిస్థితి భరించలేని స్థితికి చేరుకోవడంతో బాలిక తల్లి నిందితుడు రాజ్‌కుమార్‌పై ఫిర్యాదు చేసింది. దీంతో ఆతనిపై గత మే 16న పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. ఆ ఫిర్యాదు, తన కూతురి భవిష్యత్తును కాపాడుతుందని ఆమె నమ్మింది..కానీ, అది చివరకు తన కుటుంబానికే మరణశాసనంగా మారుతుందని ఊహించలేదు. ప్రతి బాధిత కుటుంబం పోలీసుల వద్దకు ఒకే ఆశతో వెళ్తుంది. "ఇప్పటికైనా మాకు రక్షణ దొరుకుతుంది" అన్న భరోసాతో ఉంటుంది. కానీ, షాబాద్ సంఘటనలో ఆ భరోసాకు బదులు.. బతుకులే బలయ్యాయన్న ఆక్రోశం స్థానికులను ఆగ్రహంలో ముంచెత్తింది.

ఈ ఘటనలో అత్యంత కలచివేసే విషయం... నిందితుడు తన భార్యను, అభం శుభం తెలియని ఇద్దరు చిన్నారులను కూడా హతమార్చాడు. నాలుగేళ్ల వయసున్న పరీక్షిత్‌కు, రెండేళ్ల దైవీక్షిత్‌కు తండ్రి చేతి స్పర్శ అంటే భద్రత. కానీ, తండ్రి స్థానంలో ఉన్న ఆ క్రూరుడే వారి జీవితాలకు ముగింపు పలికాడు. భార్య సరిత కథ మరింత విషాదకరంగా ఉంది. బీఈడీ చదివి ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న ఆమెను ప్రేమ పేరుతో రాజ్‌కుమార్ వెంటపడి పెళ్లి చేసుకున్నాడు. కానీ, ఆ తర్వాత ఆమె జీవితం నరకంగా మారిందని బంధువులు చెబుతున్నారు. పిల్లలు పుట్టాక ఆమెను వేధించడం, మరో మైనర్ బాలిక కోసం ఆమెను అవమానించడం, హింసించడం నిత్యకృత్యంగా మారాయంటున్నారు. భర్త ఈరోజు కాకపోయినా తర్వాతైన మారతాడను కుంది. తమ కుటుంబాన్ని నిలబెట్టాలను కుంది. కానీ, ఆమె కలలు, పిల్లల భవిష్యత్తు, ఆ కుటుంబం కూడా మొత్తం ఒక్క రాత్రిలో నేలమట్టమయ్యాయి.

ఇంకోవైపు, మైనర్ బాలిక తల్లి ఉన్మాది రాజ్‌కుమార్ బారి నుంచి కూతురిని రక్షించుకునేందుకు కాలేజీకి కూడా పంపకుండా ఇంట్లోనే ఉంచింది. నెలల తరబడి తన కూతురిని ఇంటి బయటకు పంపకుండా ఆమె ప్రాణాలు కాపాడింది. ఇన్నాళ్లు రక్షణగా నిలబడింది. ఇంటి ముందు సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేసింది. పరీక్షలు ఉండటంతో తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే బయటకు అనుమతించేది. అది కూడా తాను వెంట ఉండి మరీ తీసుకెళ్లేది.

పోలీసుల నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం

ఈ దుర్ఘటన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా ప్రకంపనలు రేగాయి. పోలీసుల నిర్లక్ష్యం, ప్రభుత్వ అధికారుల అలసత్వం చర్చకు వచ్చాయి. బాధిత కుటుంబం, స్థానికులు, గ్రామస్థులు చెబుతున్న వివరాల ప్రకారం, నిందితుడు రాజ్‌కుమార్ బెయిల్‌పై బయటకు వచ్చిన తర్వాత కూడా పలుమార్లు బెదిరించాడని, ఇప్పటికీ బాలిక వెంటపడుతున్నాడని, తమ కుటుంబాకి హెచ్చరికలు జారీ చేస్తున్నాడని పోలీసులకు చెప్పినా తగిన చర్యలు తీసుకోలేదన్న ఆరోపణలు ఉన్నాయి. కేసు నమోదైన తర్వాత కూడా బాధితులకు రక్షణ కల్పించడంలో పోలీసుల వైఫల్యం స్పష్టంగా

కనిపిస్తోందని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాదు.. ఈ వ్యవహారంలో ఇంకా తీవ్రమైన ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. పోక్సో సంబంధిత ఫిర్యాదు అందిన ఈ కేసులో కఠినమైన సెక్షన్లకు బదులు తేలికపాటి సెక్షన్ల కింద కోసు నమోద చేశారనే వాదనలు కూడా వినిపిస్తున్నాయి. అందువల్లే నిందితుడికి బెయిల్ లభించిందని కొందరు అంటున్నారు. అంతేకాదు.. ఈ వ్యవహారంలో అవినీతి చోటుచేసుకుందని, పెద్దమొత్తంలో డబ్బులు చేతులు మారాయన్న ఆరోపణలు కూడా రాజకీయంగా వినిపిస్తున్నాయి. ఈ అనుమానాలే ప్రజల్లో వ్యవస్థపై విశ్వాసాన్ని

సందేహాలు

దెబ్బతీస్తున్నాయి. ఈ పరిణామం అనంతరం స్థానిక ఎస్సై సస్పెన్షన్, సీఐపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడం.. వ్యవస్థలో లోపాలున్నాయన్న సంకేతాన్ని మరింత బలపరిచింది. అయితే, పోలీసు శాఖ మాత్రం తమ పొరపాటును వీలైనంత మేరకు తగ్గించుకోవడంలో మునిగి పోయింది.

పోక్సోతోనూ రక్షణ గాలిలో దీపమేనా?

పోక్సో చట్టం పిల్లలను లైంగిక నేరాల నుంచి

కాపాడేందుకు రూపొందింది. ఈ చట్టం దేశంలో అత్యంత కఠినమైన చట్టాల్లో ఒకటి. కానీ, కేసు నమోదు చేయడంతోనే సరిపోదు. కేసు నమోదైన తర్వాత బాధిత కుటుంబానికి రక్షణ కల్పించడం, బెయిల్‌పై విడుదలైన నిందితుడిపై పర్యవేక్షణ, బెదిరింపులపై తక్షణ స్పందన, వేగవంతమైన దర్యాప్తు... కూడా అంతే కీలకం. ఈ కేసులో ఆ ప్రక్రియ సక్రమంగా జరిగిందా? అన్న ప్రశ్నకు సమాధానం దర్యాప్తులోనే తేలాల్సి ఉంది. చట్టం ఎంత బలంగా ఉన్నా... దాన్ని అమలు చేసే వ్యవస్థ అప్రమత్తంగా లేకపోతే బాధితులకు న్యాయం ఆలస్యమవుతుంది. కొన్నిసార్లు ఆలస్యం ప్రాణాలను కూడా బలితీసుకుంటుంది. షాబాద్ ఘటన అదే పరిణామాలకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచింది.

రాష్ట్రంలో శాంతిభద్రతలపైనా చర్చ

ఈ ఘటనతో రాష్ట్రంలో శాంతిభద్రతలపై మరోసారి చర్చ మొదలయ్యింది. రాజకీయ విమర్శలు ఊపందుకున్నాయి. ముఖ్యమంత్రి వద్దే హోంశాఖ ఉండటంతో పోలీసు వ్యవస్థపై అవసరమైన సమీక్షలు సరైన స్థాయిలో జరగడం లేదని, రాష్ట్రంలో నేరాలు పెరుగుతున్నాయని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ప్రభుత్వం ఈ ఆరోపణలను తోసిపుచ్చుతున్నప్పటికీ, షాబాద్ ఘటన ప్రతిపక్షాలకు బలమైన రాజకీయ అస్త్రంగా మారింది. అయితే బాధ్యులపై చర్యలు ప్రారంభించామని, బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని ప్రభుత్వం చెబుతోంది. కానీ, ఆరు ప్రాణాలు బలి తీసుకున్నాక చర్యలు తీసుకోవడం అంటే ఏముంటుందని, ముందుగానే పోలీసు యంత్రాంగం అప్రమత్తమైతే అమాయకుల ప్రాణాలు కాపాడగలిగేవారన్న అభిప్రాయాలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

సమాధానం చెప్పేవారెవరు?

షాబాద్ ఘటనలో అత్యంత విషాదకరమైన దృశ్యం... తల్లి, అక్క, నానమ్మను కోల్పోయిన దివ్యాంగురాలు ఒంటరయ్యింది. తనకు ఎవరు దిక్కు అని దిక్కులు చూడడం అత్యంత విదారకంగా మారింది. మరోవైపు, తన కుమారుడి చేతిలోనే కోడలు, ఇద్దరు మనవళ్లను కోల్పోయిన వృద్ధ తల్లిదండ్రులు. భర్త చేతిలోనే తమ ఇంటి ఆడపడుచు, ముద్దులొలికే చిన్నారులు హతం కావడం సరిత పుట్టింటి వాళ్లను పుట్టెడు దుఃఖంలో ముంచింది. ఈ అమానవీయ ఘటనను కేవలం ఒక ఉన్మాది చేసిన నేరంగా మాత్రమే చూస్తే సరిపోదు. ప్రమాద సంకేతాలను గుర్తించడంలో ఎక్కడ లోపం జరిగింది? బాధితులు ముందుగానే వ్యక్తం చేసిన భయాలను వ్యవస్థ ఎంత తీవ్రంగా తీసుకుంది? చట్టం కేవలం కేసు నమోదు చేయడానికే పరిమితమైందా? బెయిల్ తర్వాత బాధితుల భద్రత ఎవరి బాధ్యత? బాధితుల మొర ఎవరికీ ఎందుకు వినిపించలేదు? చట్టం ఎందుకు భరోసా ఇవ్వలేకపోయింది? పోలీసు యంత్రాంగం ఎందుకు అప్రమత్తంగా ఉండలేకపోయింది? అనే ప్రశ్నలకు సమాధానాలు చెప్పాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉంది. ఈ ఆరు ప్రాణాలు తిరిగి రావు. కానీ, ఈ రక్తపాతం నుంచి వ్యవస్థ పాఠాలు నేర్చుకుంటేనే మరొక దైవాలగూడ, మరొక కుటుంబం ఇలాంటి విషాదాన్ని ఎదుర్కోకుండా కాపాడగలుగుతాం. కానీ వారి మరణం వ్యవస్థను మేల్కొలిపితే, చట్టం అమలు మరింత కట్టుదిట్టమైతే, బాధితుల రక్షణకు కొత్త ప్రమాణాలు ఏర్పడితే... ఆ రక్తపు మరకల వెనుక కనీసం ఒక మార్పు కనిపిస్తుంది. లేకపోతే... షాబాద్ ఒక వార్తగా మిగిలిపోతుంది. ఆరు శవాలు ఒక గణాంకంగా మారిపోతాయి. కానీ సమాజం మాత్రం మరో విషాదం జరిగేదాకా ఎదురుచూస్తూనే ఉంటుంది.

సుజాత గోపగోని
సీనియర్ జర్నలిస్ట్, 6302164068

నిందితుడు రాజ్‌కుమార్ ఆత్మహత్య

షాబాద్ సామూహిక హత్య కేసులో నిందితుడు పార్వతి రాజ్‌కుమార్ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకొన్నాడు. ఆరుగురిని హత్య చేసి పరారైన అతడు కొత్తూరు మండలం పెంజర్ల సమీపంలో జులై 13న శవమై కనిపించాడు. పోలీసు అధికారుల కథనం ప్రకారం, జులై 11 ఉదయం తిమ్మాపూర్ రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్యకు ప్రయత్నించినట్లు, రైలు సమీపిస్తుండగా పట్టాల నుంచి తప్పుకున్నట్లు సమీపంలోని సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యింది. అతని కోసం పోలీసుల ప్రత్యేక బృందం గాలిస్తుండగా, పెంజర్ల సమీపంలో మృతదేహం ఉందని సమాచారం అందింది. మృతుడు సోదరుడి ద్వారా మృతదేహం రాజ్‌కుమార్‌దేనని పోలీసులు నిర్ధారించారు. 'ఆరుగురిని హత్య చేసి తానూ ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకునట్టు' ఉన్న సెల్ఫీని మృతదేహం వద్ద లభించిన నిందితుడి ఫోన్‌లో కనుగొన్నారు.

'డాక్టర్ చిలుకూరి సుబ్రహ్మణ్యశాస్త్రిగారు దేశసేవకు మొత్తం జీవితాన్ని సమర్పించారు. దేశసేవ అంటే దేశ ఆత్మను, స్వభావాన్ని అర్థం చేసుకుని పనిచేయడం. ఈ కార్యంలో ఉన్నవారికి పునర్జన్మ ఉండదు. అయితే వారి వ్యక్తిత్వాన్ని, గుణగణాలను చిరకాలం స్మరించుకోవాలి. శరీరం దైన్యస్థితిలో ఉన్నా వారి మనస్సు దుఃఖానికి గురికాలేదు. వారు స్థితప్రజ్ఞులు, మహాయోగి' అని శ్లాఘించారు సద్గురు శివానందమూర్తి.

పేరు ప్రతిష్ఠలకు దూరం

కృష్ణాజిల్లా నూజీవీడులో సుబ్రహ్మణ్యశాస్త్రి గారికి 1941లో సంఘ పరిచయం కలిగింది. అదే సంవత్సరం మొదటితరం ప్రచారక్ బాబాసాహెబ్ ఆప్టే నూజీవీడు శాఖకు రాగా, 1942లో సంక్రాంతి ఉత్సవానికి నాటి సర్‌సంఘచాలక్ పరమపూజనీయ గురూజీ విచ్చేశారు. తోటి విద్యార్థులతో స్నేహంచేసి, వారి అభిరుచికి తగ్గట్లు, వారితో మాట్లాడి శాఖకు ఆకర్షించడం శాస్త్రిగారి ప్రత్యేకత. 1945లో ఇంటర్మీడియట్ చదువుతున్న సమయంలో కార్యకర్తగా పనిచేయడం ప్రారంభించారు.

1955లో గుంటూరులో భారతీయ జనసంఘ్ మొదటి రాష్ట్ర మహాసభ సందర్భంగా 'జాగృతి' ప్రత్యేక సంచిక విడుదలైంది. శాస్త్రిగారు ఆ పత్రికల కట్టను తీసుకొని గుంటూరు రైల్వేస్టేషన్‌లో దిగి స్వయంగా భుజాన వేసుకొని స్టేషన్ బయటకు వచ్చారు. జనసంఘ్ ప్రతినిధులకు స్వాగతం చెప్పడానికి తయారుగా ఉన్న స్వయంసేవకులు ఆ దృశ్యం చూసి అవాక్కయ్యారు. శాస్త్రిగారి ఉన్నత వ్యక్తిత్వం,వారి స్థాయి తెలిసిన స్వయంసేవకులకు భవిష్యత్తులో రాజకీయ రంగంలో ఎలా పనిచేయాలో ఎన్నో రకాలుగా మార్గనిర్దేశం చేసింది.

పొరబాట్లను సున్నితంగా సరిదిద్దడంలో నేర్పరి. శిక్షావర్గలలో రాత్రి అందరూ పడుకునే సమయాన్ని ఉల్లంఘించి ఎవరైనా మైదానంలో మాట్లాడుకుంటున్నట్లయితే పరిశీలనకు వెళ్లిన శాస్త్రిగారు వారి భుజంపైన చేయి వేసి 'సమయమైంది ఇక నిద్రపోండి' అనడం తప్ప మరో మాటాడేవారు కాదు. 1988 ఒకసారి అనంతపురంజిల్లా బుక్కరాయ సముద్రంలో జరుగుతున్న విభాగ్ ప్రచారకుల ప్రాంత సమావేశంలో ప్రార్థన అనంతరం, ప్రార్థన చెప్పిన స్వయంసేవక్‌ను శాస్త్రిగారు పిలవడంతో అతనికి కాళ్లు వణికాయి. శాస్త్రిగారు అతనితో మాట్లాడుతూ 'నువ్వు ధ్వజం ఎగురవేస్తుంటే నీలో శారీరక్‌ప్రముఖ్, ప్రార్థన చెపుతుంటే నీలో బౌద్ధిక్‌ప్రముఖ్ కనిపించాడయ్యా!' అంటూ ప్రార్థన రాగాన్ని సరి చేసిన పద్ధతి చూసిన తరువాత అతనిలో భయం పోయింది.

ఒకసారి భాగ్యనగర్ పర్యటనకు రైల్లో వచ్చారు. వారిని తీసుకునిరావడానికి రైల్వేస్టేషన్‌కు వెళ్లిన కార్యకర్త, రైలు ఆలస్యమైందని కూర్చున్నచోటే నిద్రలోకి జారుకున్నాడు. శాస్త్రిగారు తన కోసం ఎవరు వచ్చారోనని ఎదురుచూడకుండా సరాసరి కార్యాలయానికి వచ్చేశారు. పొరబాటు చేసిన కార్యకర్త తరువాత వివరణ ఇచ్చినప్పుడు నవ్వుతూనే పలకరించిన పద్ధతి ఆ కార్యకర్తకు మరోసారి తప్పుచేయకుండా సరిదిద్దుకోవాలనిపిం చింది. ఇలాంటి సున్నితమైన వారి వ్యవహారం స్వయంసేవకుల పొరబాట్లను సరిచేసేది.

స్వభావరీత్యా సాత్వికులు. పిన్నలైనా, పెద్దలైనా నమస్కరిస్తే, రెండు చేతులు జోడించి ప్రతి నమస్కారంచేసే ఆయన సంస్కారం ప్రత్యేకంగా కనిపిస్తుంది. అందరిపట్ల స్నేహంగా ఉంటూ ఆత్మీయతతో పలకరించడం వారి నైజం. ఒక వ్యక్తి లోపాలను మరొకరి వద్ద ప్రస్తావించేవారు కాదు. తమ మనసులోని విషయాన్ని శాస్త్రిగారికి తీరికగా చెప్పుకోవడం ద్వారా తమకు సరైన పరిష్కారం దొరుకుతుందనే అనుభూతిని కార్యకర్తలందరికీ కలగడం వారి విశేషత. వారి అభిప్రాయం చెప్పడమంటే తుది తీర్పే. ఇక దానిపై వాద వివాదాలకు అప్పీళ్లకు అవసరమే ఉండేది కాదు. ఆ విధంగా వేలాదిమంది స్వయంసేవకుల హృదయాలపై వారు చెరగని ముద్ర వేశారు.

భాగ్యనగర్‌కు పర్యటనకు వచ్చినప్పుడు కూడా ప్రాంత కార్యాలయంలో ప్రత్యేక సౌకర్యాలు ఏవీ కోరుకునేవారు కాదు. ఉదయం 3.30 గంటలకు నిద్రలేచి దుస్తులను వారే స్వయంగా ఉతికి ఆర వేసుకునేవారు. ఆరిన తరువాత కూడా వారే మడతపెట్టుకునేవారు. ఎవరన్నా సహకరించడానికి ప్రయత్నిస్తే స్వీకరించేవారు కాదు. ఇదే పద్ధతిని చివరి దశవరకు కొనసాగించారు.

ప్రాంత కార్యవాహగా పర్యటన నిమిత్తం తిరుపతికి వెళ్లినప్పుడు సంఘ కార్యక్రమం ముగించుకొని తిరుమలకు దర్శనానికి వెళ్లివచ్చిన తరువాత తిరుమలకు రాను పోను ఖర్చులను లెక్కకట్టి జిల్లా ప్రచారక్‌కు అందజేశారు. వద్దని వారించినప్పటికీ, దర్శనానికి వెళ్లడం నా సొంత వ్యవహారం. దీనికి సంఘం డబ్బులను ఖర్చుపెట్టడం సముచితం కాదని నచ్చచెప్పారు. భాగ్యనగర్‌కు వచ్చినప్పుడు కూడా సంఘ కార్యక్రమాలన్నీ పూర్తి అయిన తరువాత, మల్కాజ్‌గిరిలోని బంధువు ఇంటికి వెళ్లిరావడానికి సంఘ కార్యాలయం నుండి ఆటో వ్యవస్థ చేస్తే ఒప్పుకొనేవారు కాదు. వారే స్వయంగా ఆటోచార్జీ చెల్లించి వెళ్లేవారు. విధి నిర్వహణలో భాగంగా వారి పర్యటన రైలులో మొదటితరగతి కావచ్చును, విమాన ప్రయాణం కావచ్చు. నిబంధనల మేరకు వెళ్లేవారు. సంఘ కార్యం నిమిత్తం పర్యటించేటప్పుడు ఎప్పుడూ సాధారణ తరగతిలోనే ప్రయాణిం చేవారు. 'వయస్సు, బాధ్యత దృష్ట్యా ఇక మీరు రైలులో మొదటితరగతిలో ప్రయాణించండి' అని శేషాద్రిగారు (సర్‌కార్యవాహ) చెప్పేంత వరకు వారు సాధారణ తరగతిలోనే పర్యటనలను కొనసాగించారు. ఇదే పద్ధతి అనేక పర్యాయాలు వారి జీవితంలో కనపడుతుంది.

శాస్త్రిగారు నిర్విరామంగా పర్యటించేవారు. యూనివర్సిటీ సెలవులు ప్రకటించినప్పటి నుండి తిరిగి కళాశాల తెరిచేవరకు అది 2,3 రోజులైనా, 15 రోజులైనా, ఒకనెల అయినప్పటికీ మొత్తం సెలవు రోజులు పర్యటనలో ఉండేవారు. మన ప్రాంతంలో గృహస్థ కార్యకర్తల పర్యటనకు వీరు ప్రేరణ ప్రదాత అయ్యారు. పదవీ విరమణ రోజు కూడా సాయంత్రం పర్యటనకు బయలు దేరారు. నెల తరువాత తిరిగి వచ్చారు. యూనివర్సిటీ యాజమాన్యం వీరికి సన్మానం చేయడానికి ఎప్పుడు ప్రయత్నించినప్పటికీ విశాఖపట్నంలో ఉండేవారు కాదు. ఒకసారి వైస్‌ఛాన్సలర్ ఫోన్ చేసి మీకు యూనివర్సిటీ సన్మానం చేస్తున్నది. తప్పకుండా మీరు ఫలానా తేదీ కార్యక్రమానికి రావాలని అడిగినపుడు, ఇలాంటి సన్మానాలకు నేను దూరంగా ఉంటున్నానని వినయంగా నవ్వుతూ సమాధానం చెప్పారు.

సంఘంలోనే కాదు, వారి వృత్తిలో కూడా సదా స్నేహశీలిగా ఉండేవారు. అధ్యాపకులుగా వీరి సరళి నియమబద్ధంగా ఉండేది. ఉదయం 8 గంటల నుంచి మొదటి రెండు కాలాంశాలనూ బోధనలో వినియోగించేవారు. తోటి అధ్యాపకులు వారి గదికి వచ్చి తేనీరు సేవించేవారు. ఆ తరువాత ఉదయం

గా శాస్త్రిగారు

డాక్టర్‌జీ ప్రతిబింబం

నాగపూర్ తృతీయవర్ష సంఘ శిక్షావర్గలో సుబ్రహ్మణ్యశాస్త్రిగారు సర్వాధికారిగా ఉన్నప్పుడు నాకు ప్రథమంగా పరిచయమయ్యారు. ఆ తరువాత ఆంధ్రప్రదేశ్ పర్యటన ద్వారా క్రమేపీ వారితో పరిచయం బలపడింది. విశ్వవిభాగ్ సంఘశిక్షావర్గలో నెలరోజులపాటు వారిని దగ్గరి నుండి దర్శించే అవకాశం కలిగింది. పితృతుల్యమైన స్నేహం, కార్యకర్తలందరితో సంభాషించే కుశలత, సంఘ సిద్ధాంతం పట్ల స్పష్టత, ప్రభావవంతమైన వ్యక్తిత్వం, ప్రసన్నమైన వ్యవహారశైలి వారి విశేష గుణాలు. ఈ విషయాలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని కార్యకర్తలకు నాకంటే బాగా తెలుసు.

డాక్టర్‌జీ అమరమైన తీవ్రతపస్సు నుండి ఉద్భవించిన స్వయంసిద్ధ ప్రతిబింబాలలో శాస్త్రిగారి జీవితంకూడా ఒకటి. అవసరమైన మార్గనిర్దేశాన్ని వారి జీవితం మనకు ఇవ్వగలదు. ప్రచారక్, గృహస్థ కార్యకర్తలందరు స్వర్గీయ శాస్త్రిగారి జీవితం నుండి అనేక సంఘటనలు సదా ప్రేరణ కలిగిస్తూనే ఉంటాయి. వారి జీవితాన్ని అక్షరబద్ధం చేస్తున్న సుబ్రహ్మణ్యశాస్త్రిగారి పుస్తకం ఆవశ్యకమైనది. నిత్యం ఎంతో ఉపయోగపడేది. సంఘకార్యం ఆచరణాత్మకంగా తెలియజెప్పే ఈ పుస్తకం మనందరికీ లభిస్తుంది.

సంఘం వ్యక్తినిష్టపై కాకుండా ధ్యేయనిష్టపై ఆధారపడి పని చేస్తున్న విషయం మనందరికీ తెలిసినదే. నిరంతరం కొనసాగే ఈ పనిలో 5వ తరానికి చెందిన కార్యకర్తలు తగినంత సంఖ్యలోనే ఉన్నారు. వీరందరూ సంఘ కార్యపద్ధతిని నడిపే శిక్షణ ఎక్కడ, ఏ పాఠ్య పుస్తకాల నుండి పొందారు? సంఘంలో ఇలాంటి పాఠ్యపుస్తకాలు లేవు. సంఘమే తమ జీవన సర్వస్వంగా చేసుకుని జీవించిన అనేకమంది కార్యకర్తల జీవితాలే సంఘ పాఠ్యపుస్తకాలు.

– మాననీయ శ్రీ మోహన్‌జీ భాగవత్, పరమపూజనీయ సర్‌సంఘచాలక్

10.30 నుండి మధ్యాహ్నం ఒంటిగంటవరకు ఖాళీ సమయమే. వారి టేబుల్ ఎదురుగా ఉండే రెండు కుర్చీలు ఎప్పుడూ ఖాళీగా ఉండేవి కావు. యూనివర్సిటీలో ప్రతి విభాగం నుండి వచ్చి ఎవరో మాట్లాడుతుండేవారు. శాస్త్రిగారిని కలవడం ఆనందం. వారి మాటలలో ఒక హృదయతంత్రీ మీటే స్వభావం ఉంది. మధ్యాహ్నం కూడా వారి ఇంటికి ఎవరో ఒకరు వచ్చి మాట్లాడుతూ గడిపేవారు. వారి సంఘ కార్య పర్యటనలో కూడా ఖాళీగా ఉన్నప్పుడు, అలాగే ప్రయాణ సమయాలలో వారితో సంభాషించేవారికి గొప్ప అనుభూతి కలిగేది. అనౌపచారికంగా వారితో మాట్లాడుతున్నప్పుడు ప్రత్యేకంగా చెప్పినట్లు లేకుండా స్వయంసేవకులకు జీవన విలువలకు సంబంధించి, సంఘ సిద్ధాంతానికి సంబంధించి అనేక విలువలను బోధపడేటట్లు చేసేవారు.

అక్షరాలు కుదురుగా, గుండ్రంగా చూడ ముచ్చటగా రాయడానికి చూచి రాతలో రెండు విధానాలున్నాయి. మొదటిపద్ధతి గుండ్రంగా రాసి ఉన్న మొదటి పంక్తిని చూస్తూ పేజీ కింద వరుస నుంచి మొదలుపెట్టి పై వరకు రాయడం, రెండవ పద్ధతి మొదటి పంక్తిని చూస్తూ పై వరుస నుంచి కిందకి రాయడం. రెండవ విధానం వల్ల పొరపాట్లు ఎక్కువ దొర్లుతాయి. గుండ్రటి రాత కూడా చెడిపోతుంది. కనుక మొదటి పద్ధతి ఎల్లప్పుడు శ్రేష్ఠమైనది. 'డాక్టర్‌జీ పరంపరలో సంఘ పెద్దలు ఎంతోమంది పనిచేసినా, మూల స్రోతస్సు మనకు డాక్టర్‌జీయే కావాలి' అని అనేకసార్లు శాస్త్రిగారు కార్యకర్తల సమావేశాలలో ఉద్బోధిస్తూ ఉండేవారు.

వర్షం కురిసినపుడు గంగానదిలోనూ, ఒడ్డున కూడా చినుకులు పడతాయి.అవి ఇసుకలో ఇంకిపోతాయి. కానీ నదిలో పడిన చినుకులు గంగ పవిత్రతను ఆపాదించుకుని ఒక ప్రవాహంగా ముందుకు వెళతాయి. భగవంతుని ఆశీస్సులవల్ల సహజంగా మనం సంఘ ప్రవాహంలో కొనసాగుతున్నాం. అంటే ఒడ్డున పడిన చినుకులను బలవంతంగా గంగానదిలోకి తీసుకుపోలేం కదా? అలాగే సంఘం పని చేయడం అన్నది ఎవరి బలవంతం వల్లనో, ప్రోద్బలంతోనో కాక మన జీవితంలో జరిగిన దైవనిర్ణయంగా భావించాలి. వ్యక్తి ద్వారా సంస్థలో ప్రవేశిస్తాం. ఆ తరువాత సంస్థలో మమేకమవుతాం. అయితే సంస్థాభిమానంతో మాత్రమే ఆ తరువాతి మెట్టును కూడా అధిరోహించాలి.అదే సిద్ధాంతం..అంటూ గౌతమబుద్ధుని వాక్యాలను ఉదహరించేవారు. బుద్ధం శరణం గచ్ఛామి (వ్యక్తి), సంఘం శరణం గచ్ఛామి (సంస్థ), ధర్మం శరణం గచ్ఛామి (సిద్ధాంతం) .ఆత్మపరిశీలన, ప్రక్షాళన నిరంతరం అవసరమని కార్యకర్తలకు మార్గదర్శనం చేసేవారు. ఆ విధంగా తమ వ్యవహార కుశలతతో అనేకమంది కార్యకర్తలను తయారు చేశారు.

ఆయనది కుటుంబంలో తండ్రి పాత్ర. ప్రేమ, క్రమశిక్షణ కలిసి ఉండేవి. ఆయన దూరదృష్టికి ఈ పాత్ర అద్దంపడుతుంది. ప్రతి సంస్థలోనూ సమస్యలు ఏర్పడుతుంటాయి. ఒడుదొడుకులు వస్తాయి. బాధ్యతలు మారుతుంటాయి.

సంస్థలో తమకున్న పదవీ బాధ్యతల పట్ల అంటీ అంటని తత్వం ఎంతో అవసరం. పదవీ బాధ్యతల పట్ల మోహం సమస్యలకు దారితీస్తుందని అనే వారు. ఓర్పు, సహనం, కరుణ, ఆత్మీయత, త్యాగం, క్షమత, నిస్వార్థత మొదలైన దైవీగుణాలను పెంచుకుంటే అసుర ప్రవృత్తి సహజంగానే తగ్గిపోతుంది. రాక్షస ప్రవృత్తి నిర్మూలనకై కూడా ప్రయత్నం అవసరం. ద్వేషమూ, అహంకారం, ఈర్ష్య, కోపం ప్రతీకార కాంక్ష, కీర్తికండూతి, స్వార్థం అనేవి రాక్షస ప్రవృత్తులు.

మానవుడు ప్రతి నిమిషం బయటి ప్రపంచంతో సంబంధం కలిగి కార్యక్రమం సాగిస్తున్నపుడు వాటి ఫలితంగా కొంత రాక్షస శక్తుల ప్రభావానికి లోనవుతాడు. దానివలన అలజడి, అశాంతి, స్వార్థం వంటి రాక్షస ప్రవృత్తులు వాటంతటవే పుట్టుకొస్తాయి. వీటిని తెలుసుకొని ఎల్లప్పుడు ఆత్మపరిశీలన, ప్రక్షాళన జరుగుతుంటే తప్ప, మనిషికి దైవస్వరూపం కష్టము అనే వేదాంత దృష్టిని సమయ, సందర్భాలను బట్టి శాస్త్రిగారు గుర్తుచేస్తూనే ఉండేవారు.

– మన కాలం మహర్షి
చిలుకూరి సుబ్రహ్మణ్యశాస్త్రి పుస్తకం నుండి

ఆధునికాంధ్ర కవితాశరధి దాశరథి

ఆధునికాంధ్ర కవుల్లో పద్యాన్ని అభినివేశంతో పరవళ్లు తొక్కించిన చైతన్య సారథి దాశరథి. దేశ చరిత్రను ఇతివృత్తంగా తీసుకొని తెలుగు ప్రజల్లో చైతన్యాన్ని ప్రదీప్తం చేసిన మహాకవి. గేయాన్ని శ్రవణపేయంగా, గీతాన్ని లలితంగా, పాటను ప్రగతిబాటగా మలచి ఆధునిక కవిత్వంలో విశిష్టతను సంతరించుకున్న కవి. తెలంగాణలో సాహిత్య చైతన్యస్ఫూర్తిని కలిగించటం, తెలంగాణ బంధాలు ఛేదించటం, నవాబు నిరంకుశ పాలనకు చరమగీతం పాడడం, మహాంధ్రోద్యమానికి కృషి సాగించటం ఆయన జీవితంలోనూ, కవిత్వంలోనూ మహోజ్జ్వలంగా ప్రకాశించే ఘట్టాలు.

దాశరథి కృష్ణమాచార్యులు జులై 22వ తేదీన 1925వ సంవత్సరంలో వరంగల్ జిల్లా గూడురులో పండిత వంశంలో జన్మించారు. ఆయన తల్లి వెంకటమ్మ, తండ్రి వెంకటాచార్యులు. ఆయన సంస్కృతాంధ్ర భాషల్లో పండితుడు, సంప్రదాయజ్ఞుడు. దాశరథి ప్రాథమిక విద్య తండ్రి సమక్షంలోనే సాగింది. తండ్రి తెలుగు కన్నా సంస్కృత బోధనకే అధిక ప్రాధాన్యతను ఇవ్వడంతో.. ఆ ప్రభావం దాశరథిపై పడి బాల్యం నుంచే కవిత్వ రచనకు పూనుకున్నాడు.

నిజాం నవాబు దురాగతాలకు నిరసనగా 1943 ప్రాంతాల్లో గార్ల జాగీరులో రైతుల అలజడి ప్రారంభమైంది. రైతుల దుస్థితికి చలించిన దాశరథి నవాబు రాక్షసత్వాన్ని నిరసిస్తూ 'మా నిజాము రాజు.. జన్మజన్మల బాజు' అని కవితతో తీవ్రంగా గర్హించారు. కన్నతల్లి కన్నా మిన్నగా తెలంగాణాను ప్రశంసిస్తూ 'నా తెలంగాణా కోటి రత్నాలవీణ' అన్నాడు. దాశరథి కవితా సూక్తులు తెలంగాణ ప్రజల నాలుకలపై నాట్యం చేశాయి. నిజాం నవాబు గుండెల్లో గునపాలుగా గుచ్చుకున్నాయి. ఆయన మాటలు ఈటెలుగా, కవితా సూక్తులు చురకత్తులుగా నిజాం ప్రభుత్వానికి దడ పుట్టించాయి. మానుకోట తాలుకాలో ఒక గ్రామంలో 1946 డిసెంబర్ 18న వీరావేశంతో 'తెలంగాణం రైతుదే, ముసలి నక్కకు రాచరికం దక్కునే' అని అగ్నిధారలు కురిపించాడు. అందుకు దాశరథిని అరెస్టు చేసిన పోలీసులు, మండుటెండల్లో 20 మైళ్లు, పురవీధుల్లో ఈడ్చుకొంటూ పల్లికుదురు ఠాణాకు తీసుకువెళ్లారు. చుట్టూ పోలీసులు కాపాలా ఉన్నా వారిని తప్పించుకొని పరిగెత్తాడు. రజాకార్ల లాఠీదెబ్బలతో క్షతగాత్రుడైన ఆయన క్షుభిత కల్లోల హృదయం నుండి అగ్నిధారలు కురిపించాడు.

నవాబుకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన సత్యాగ్రహంలో పాల్గొని అరెస్టయ్యాడు. దాదాపు 16 నెలలు జైలు జీవితంలో కొరడా దెబ్బలు తిన్నాడు. జైలు గోడలపై బొగ్గుతో నవాబు దారుణాలను నిరసిస్తూ 'ఓ నిజాము పిశాచమా కానరాడు, నిన్ను బోలిన రాజు మాకెన్నడేని తీగలను తెంపి అగ్నిలో దింపినావు... నా తెలంగాణా కోటి రత్నాల వీణ' అని అభిశంసించాడు. ఈ పద్యం చదివిన అధికారులు అదిరిపడ్డారు. వారు ఎన్నిసార్లు చెరిపినా అన్నిసార్లు జైలు గోడలపై దాశరథితో పాటు జైలు జీవితం గడిపే వట్టికోట ఆళ్వార్‌స్వామి రాసే వాడట. దాశరథిని జైలు అధికారులు 1948 సెప్టెంబర్ 11న దారుణాతి దారుణంగా చిత్రవధ చేశారు. అస్వస్థతకు గురైనా అదృష్టవశాత్తు బతికి బయట పడ్డాడు. ఇతర రాజకీయ ఖైదీలతో పాటు 1948 సెప్టెంబర్ 18వ తేదీన విముక్తి లభించింది.

దాశరథి జైలు నుంచి విడుదలైన తర్వాత వివాహం అయ్యింది. కొంతకాలం స్థానిక స్వపరిపాలన శాఖలో ఉద్యోగం చేశాడు. ఉద్యోగం చేస్తూనే బీఏ ఆంగ్ల సాహిత్యం ప్రధానాంశంగా ఉత్తీర్ణుడయ్యారు. ఆకాశవాణిలో కొన్నేళ్లు ప్రోగ్రామ్ ఎగ్జిక్యూటివ్‌గా చేశారు. 1961లో సినీ రంగంలో ప్రవేశించి వందలాది గీతాలతో ప్రేక్షకులను రంజింపచేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1977 ఆగస్టు 15వ తేదీన దాశరథిని ఆస్థాన కవిగా నియమించింది.

జైలు జీవితం గడిపిన చీకటి రోజుల్లో కవితా కరవాలంతో పోరాటం సాగించాడు. ఆయనకు తెలంగాణ అంటే ప్రాణం. 'ననుగని పెంచినట్టి కరుణామయి నా తెలంగాణ' అని ఉప్పొంగి పోయాడు. తన 'అగ్నిధార, రుద్రవీణ' కావ్యాల ఇతివృత్తాన్ని బట్టి కొందరు ఆయనను తెలంగాణా ప్రాంతీయాభిమాన కవిగా అపోహపడ్డారు. కానీ ఆయన విశాలాంధ్రను, సమైక్యాంధ్రను మనసారా కోరుకున్నారు.విశాలాంధ్ర సాధనకు ముందే తన కవితా చక్షువుతో మహాంధ్రోదయాన్ని దర్శించి 'నాకు కావాలె మహాంధ్రోర్వర రండి అన్నలారా' అని ప్రభోదించాడు.

దాశరథి రచనల్లో కొన్నింటికి అవార్డులు లభించాయి. 1965లో గాలిబ్ గీతాలకు ఉత్తమ అనువాద గ్రంథంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ బహుమతి లభించింది. 'కవితా పుష్పకం'కు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. 1972లో భారతప్రభుత్వం ఆయన్ను ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడిగా తామ్రపతకంతో సత్కరించింది. ఆంధ్ర విశ్వవిద్యాలయం కళాప్రపూర్ణతో, ఆగ్రా విశ్వవిద్యాలయం, 'శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయాలు' డీలిట్‌తో సత్కరించాయి.

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ కార్యనిర్వాహక సభ్యుడిగా, కేంద్ర సాహిత్య అకాడమి తెలుగు విభాగం సలహాసంఘ సభ్యుడిగా, ఆంధ్ర సారస్వత పరిషత్ కార్యనిర్వాహక సభ్యుడిగా, ఆంధ్రప్రదేశ్ అధికార భాష సంఘంసభ్యుడిగా, జాతీయ రచయితల సంఘం దక్షణభారత కార్యదర్శిగా గణనీయమైన సేవలు అందించారు. అభ్యుదయ మహాకవిగా, సినీ కవిగా అందరి మన్ననలు అందిన సహృదయ స్నేహ శీలిగా తెలుగు సాహితీ ప్రియుల గుండెల్లో చిరస్మరణీయుడు.

డా॥పి.వి.సుబ్బారావు
9849177594, విశ్రాంత అధ్యాపకుడు

'నీలిమేఘాలలో...' సుస్వరం లీనం

అన్ని రకాల గీతాలను భావయుక్తంగా పలికిన స్వరం మూగబోయింది. ఆరుదశాబ్దాల పాటు వేలాది గీతాలకు తమ గాత్రంతో ప్రాణం పోసి, దశాబ్ద కాలంగా నేపథ్యగానానికి దూరంగా ఉన్న గానకోకిల శిష్లా జానకి 88 ఏళ్ల వయసులో జులై 11న తానొచ్చిన గంధర్వలోకానికి చేరుకొన్నారు. పసిపిల్లల నుంచి పండు ముదుసలి పాత్రల వరకు అందుకు తగినట్లుగా స్వరనర్తన చేయడం అమె ప్రత్యేకత. గొంతు మార్చి పురుషపాత్రధారికి పాడిన ఉదంతాలూ ఉన్నాయి. సన్నివేశం, నటీమణుల స్వరస్థాయిని బేరీజు వేసుకొని, వాయిద్యాల గమనానికి తగినట్లుగా పాడడం, అవసరమైతే అదనపు సంగతులు వేయడం ఆమె ప్రత్యేకతగా సహ గాయనీమణులే అంగీకరిస్తారు. అందుకే ఆమెను 'వాయిస్ ఆఫ్ మాడ్యులేషన్ క్వీన్' అనేవారు.

అలాంటి ప్రయోగాలు భారతీయ చలనచిత్ర నేపథ్య గాన చరిత్రలోనే అపూర్వం, అపురూపమని విమర్శకులు చెబుతారు. దక్షిణాది చలనచిత్ర రంగంలో ఎందరో ప్రముఖ నేపథ్య గాయనులు ఉన్నా, జానకి స్వరం విలక్షణమైనది. హాస్యం నుంచి భక్తిగీతాల వరకు తనదైన ముద్రవేశారు. విశాలాంధ్ర ప్రదేశ్ ఏర్పడిన తొలినాళ్లలో వచ్చిన చిత్రం (ఎం.ఎల్.ఎ.) తెలుగులో ఆమె నేపథ్యగానానికి పునాదులు వేసింది. అందులోని 'ఇదేనండీ... ఇదేనండీ భాగ్య నగరం...' పాటలో ఆ నగరం విశిష్టతను కళ్లకు కట్టారు. భావకవితా చక్రవర్తి దేవులపల్లి వేంకట కృష్ణశాస్త్రి రాసిన 'జయ జయ ప్రియభారత జనయిత్రి ... దివ్యధాత్రి' గీతం ఆమె స్వరంలో దేశభక్తి భావాన్ని వెదజల్లింది.

శాస్త్రీయ సంగీతం తీరుతెన్నులు అంతగా తెలియవని వినమ్రంగా పలికే 'జానకమ్మ' నేపథ్య గాయనికి క్లిష్టతరం అనుకొనే అంశాలను సవాల్‌గా తీసుకొనే వారు. 'కొంజాం సలంగై' (తెలుగులో 'మురిపించే మువ్వలు') తమిళ చిత్రంలోని 'సింగార వేలదే దేవా...' పాటే అందుకు నిదర్శనం.దానిని సన్నాయి వాద్యానికి దీటుగా పాడడానికి నాటి ప్రముఖ గాయనులే కాస్త తటపటాయించారని చెబుతారు. కన్నడ చిత్రం 'హేమావతి' కోసం సంగీత దర్శకుడు నిర్దేశించిన రాగాల్లో పాడేందుకు ఆమె కొంత అసౌకర్యానికి లోనైనప్పుడు,ఆ రాగాలను మార్చాలంటూ చిత్ర నిర్మాణ బృందం సంగీత దర్శకుడిని కోరిందట. దీనిని గమ నిస్తున్న ఆమె పట్టుదలతో ప్రయ త్నించి విజయం సాధించారు. తరగతి గదిలోనే ర్యాగింగ్‌కు యత్నించిన సన్ని వేశంలో (ప్రతిఘటన) వేటూరి సుందర రామ మూర్తి కలం జాలువార్చిన గీతం 'ఈ దుర్యోధన దుశ్శాసన... దుర్వినీతి లోకంలో...'గీతాన్ని ఎంతో భావోద్వేగంతో ఆలపించారు.

ఒక దశలో సినీ గాయనులుగా రెండు కళ్లుగా భాసించిన పి.సుశీల, ఎస్.జానకి ప్రముఖ సంగీత దర్శకుడు పెండ్యాల నాగేశ్వరరావు ద్వారానే చిత్రరంగ ప్రవేశం చేశారు. జానకి నేపథ్యగాన ప్రస్థానం విషాదగీతం (నీ ఆడియాశ.. అడియాశ...) తోనే ప్రారంభమై, ఆదిలో చాలా వరకు అలాంటి పాటలే వచ్చాయి. 'సెంటిమెంట్'కు పెద్ద పీట వేసే చిత్రరంగంలో ఆమె దానిని పట్టించుకోలేదు. వచ్చిన అవకాశాలు సద్వినియోగం చేసుకుంటూ, తనకు తానే పోటీగా భావించుకుంటూ దేశీయ భాషలతో పాటు జర్మనీ, జపాన్, సింహళ తదితర విదేశీ భాషల్లోనూ సుమారు అర లక్ష పాటలు పాడారు.

ఆధ్యాత్మికవేత్త, కృష్ణభక్తురాలైన జానకమ్మ, 'కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన...'అనే గీతావాక్యాన్ని త్రికరణశుద్ధిగా అనుసరించారు. 'నా ముందటితరం గాయనీమణుల పాటలను సంగీత విభారుల్లో ఆలపించిన నేను, ఇన్ని వేల పాటలు పాడతానని ఊహించలేదు.ఎన్ని భాషల్లో ఎన్ని వేల పాటలు పాడినా అది కృష్ణపరమాత్మ కృపాకటాక్షమే' అనేవారు. అంతేకాదు...ప్రతి పురుషుడి విజయం వెనుక స్త్రీ ప్రమేయం ఉంటుందన్న వాక్యాన్ని అంగీకరిస్తూనే, స్త్రీల ఉన్నతిలోనూ పురుషుల సహాయ సహకారాలు ఉంటాయని, అందుకు తన జీవితమే నిదర్శనమని చెప్పేవారు.

తన గానకళ వేదికలపై సంగీత విభావరులకే పరిమితం కాకూడదన్న భావనతో భర్త రాంప్రసాద్, మామగారు చంద్రశేఖరం సినీరంగప్రవేశానికి ప్రోత్సహించారని ఆమె చెప్పేవారు. భర్త అనారోగ్యంతో ఆస్పత్రిలో ఉన్నప్పుడు, ఒక సినిమాకు అనివార్యంగా పాడవలసి వచ్చింది. అదీ ఆలుమగల అనురాగానికి సంబం ధించిన విషాదగీతం కావడం గమనార్హం. 'నీలి మేఘాలలో గాలి కెరటాలలో నీవు పాడే పాట వినిపించు నీవేళా...' అంటూ గగన వీధులకు ఎగిరిపోయిన సుస్వర కోకిలమ్మకు అక్షరాంజలి.

డా॥ ఆరవేల్లి జగన్నాథస్వామి
సీనియర్ జర్నలిస్ట్

జాతీయ గీతం, వందేమాతరంపై కీలక మార్గదర్శకాలు ఇవే..



మన జాతీయ గీతం 'జనగణమన', జాతీయ గేయం 'వందేమాతరం' అంటూ రాష్ట్ర గీతాల ఆలాపన విషయంలో కేంద్ర హోంమంత్రిత్వ శాఖ తాజాగా మార్గదర్శకాలను జారీ చేసింది. అధికారిక కార్యక్రమాలలో జాతీయ చిహ్నాల గౌరవాన్ని కాపాడటం, ఏకరూపతను పాటించడం కోసం ఈ నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయాలని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు, కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలకు జులై 9న ఆదేశాలు పంపింది. ఇప్పటికే ఉన్న ఆదేశాలను ఈ ఉత్తర్వుల్లో పునరుద్ఘాటిస్తూ కొన్ని కీలక అంశాలపై స్పష్టతనిచ్చింది.

అధికారిక కార్యక్రమాల్లో రాష్ట్ర గీతంతో పాటు జాతీయ గేయం, జాతీయ గీతం కూడా ఆలపించాల్సి వస్తే, పాటించాల్సిన క్రమంపై కూడా హోంశాఖ స్పష్టతనిచ్చింది. ముందుగా 'వందేమాతరం', ఆ తర్వాత 'జనగణమన'లను పూర్తిగా ఆలపించాలి. ఈ రెండు పాడడం పూర్తయిన తర్వాతే ఆయా రాష్ట్రాల అధికారిక గీతాన్ని పాడాల్సి ఉంటుంది. జాతీయ గౌరవాన్ని కాపాడేందుకే ఈ ప్రాధాన్యత క్రమాన్ని నిర్దేశించినట్లు కేంద్రం పేర్కొంది.

విదేశీ గీతాలపైనా స్పష్టత..

మన దేశంలో గౌరవ వందనం స్వీకరించే విదేశీ అతిథి ఉన్నప్పుడు, మొదట అతిథికి చెందిన దేశపు జాతీయగీతాన్ని పూర్తిగా వినిపించి, ఆ తర్వాత భారత జాతీయ గీతాన్ని వినిపించాలి. విదేశీ దౌత్య కార్యాలయాలు నిర్వహించే సాంస్కృతిక ఉత్సవాలు, ఇతర కార్యక్రమాలకు కూడా ఇదే తరహా నిబంధనలు వర్తిస్తాయి.

జెండా వందనం వంటి అంశాలలో ప్రజల విచక్షణకే వదిలేస్తున్నామని, అయితే సందర్భం లేకుండా విచక్షణారహితంగా జాతీయగీతాన్ని పాడటం లేదా వినిపించడాన్ని మానుకోవాలని సూచించింది. దేశ సాంస్కృతిక వారసత్వం, స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తిని ప్రతిబింబిస్తూ, దేశ ప్రజలలో జాతీయ చిహ్నాల పట్ల గౌరవాన్ని, ఐక్యతను పెంపొందించడమే ఈ మార్గదర్శకాల ప్రధాన ఉద్దేశమని కేంద్రం స్పష్టం చేసింది.

ఈ ఏడాది ఫిబ్రవరిలో వందేమాతర గేయం పూర్తి ఆలాపనపై ఇచ్చిన ఆదేశాలకు కొనసాగింపుగా తాజా మార్గదర్శకాలు జారీ అయ్యాయి.

రూ. వేయి కోట్ల టీఎంసీ బ్యాంక్ ఖాతాలకు బ్రేక్

అక్రమార్జనే లక్ష్యంగా తన పాలనలో ప్రజలను వేధించిన మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) పార్టీకి మరో గట్టి షాక్ తగిలింది. పార్టీకి సంబంధించి రూ.వెయ్యి కోట్లకు పైగా భారీ నిధులున్న 15 బ్యాంకు ఖాతాలను పశ్చిమ బెంగాల్ పోలీసులు స్తంభింపజేశారు. రూ.440 కోట్ల నిధి ఉన్న మూడు ఖాతాలను పాక్షికంగా నిర్వహించుకోవడానికి ఆ పార్టీకి అనుమతి ఇచ్చిన 24 గంటలలోనే మరో 12 ఖాతాలకు బ్రేక్ వేస్తూ ఈ పరిణామం చోటు చేసుకుంది. మొత్తం 15 ఖాతాల్లో కొత్తగా స్తంభింపజేసిన 12 ఖాతాలు పలు ప్రభుత్వ, ప్రైవేట్ రంగ బ్యాంకులకు చెందినవని సీనియర్ పోలీసు అధికారులు తెలిపారు. వీటిలో ఆర్థిక లావాదేవీల వివరాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

ఈ ఖాతాలకు సంబంధించి రిటైర్డ్ జస్టిస్ సుబ్రతా తాలూక్దార్‌ను సెప్టెంబర్ 30 వరకు ప్రత్యేక అధికారిగా నియమిస్తూ, మూడు హెచ్‌డిఎఫ్‌సి ఖాతాలను పాక్షికంగా నిర్వహించడానికి టిఎంసికి కలకత్తా హైకోర్టు అనుమతి ఇచ్చిన ఒక రోజు తర్వాత ఈ చర్య తీసుకున్నారు. మధ్యంతర ఉత్తర్వుల ప్రకారం, మమత నేతృత్వంలోని టిఎంసిపార్టీ ఈ నిధులను రోజువారీ పరిపాలనా ఖర్చులు, సిబ్బంది జీతాలు, న్యాయపరమైన ఖర్చుల కోసం మాత్రమే ఉపయోగించుకోవచ్చు. ఇందుకోసం ప్రత్యేక అధికారి కౌంటర్‌సైన్ చేసిన చెక్కులను ఉపయోగించవచ్చు. ప్రత్యేక అధికారికి పార్టీ నిధుల నుండి నెలకు రూ. 1.25 లక్షల గౌరవ వేతనం లభిస్తుంది.

అసెంబ్లీ ఎన్నికల్లో టీఎంసీ పార్టీ ఓటమి తర్వాత, పార్టీలో ''తీవ్ర వివాదం'' ఉందని పేర్కొంటూ, టీఎంసీ తిరుగుబాటు నాయకులవర్గం పార్టీ ఖాతాలను స్తంభింపజేయాలని బ్యాంకును కోరింది. ఈ నిధులు ఎక్కడి నుంచి వచ్చాయనే అంశంపై వీరిపై విచారణ కోరుతూ బిధాన్‌నగర్ సైబర్ క్రైమ్ విభాగానికి కూడా ఫిర్యాదు చేశారు. ఒకరోజు తర్వాత, పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ మూడు ఖాతాలను స్తంభింపజేయడంతో, రూ. 440 కోట్ల నిధిని టీఎంసీ పొందలేకపోయింది. ఒక ప్రైవేట్ విమానయాన సంస్థ, ఎంబ్రాయర్ బిజినెస్ జెట్, అగస్టా హెలికాప్టర్ కొనుగోలుకు సంబంధించి రూ. 160 కోట్ల మనీలాండరింగ్ ఆరోపణలపై ఈడీ జరుపుతున్న దర్యాప్తులో భాగంగా మొదట మూడు ఖాతాలను స్తంభింపజేసింది. దీనితో, తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరుతూ హైకోర్టును మమతా నేతృత్వంలోని వర్గం ఆశ్రయించింది.

ఈ 23 మందీ ఉగ్రవాదులే...

ఇస్లామిక్ ఉగ్రవాదంపై భారత ప్రభుత్వం ఉక్కు పాదం మోపుతోంది. పాకిస్తాన్ కేంద్రంగా ఉగ్రవాద కార్యకలాపాలు కొనసాగిస్తున్న ఇస్లామిక్ ఉగ్రవాద సంస్థలు జైష్-ఎ-మొహమ్మద్, లష్కర్-ఎ-తయిబా, వీటి అనుబంధ సంస్థలకు చెందిన 23మంది ఆపరేటివ్స్‌ను భారత హోంమంత్రిత్వ శాఖ ఉగ్రవాదులుగా ప్రకటిం చింది. భారతదేశానికి వ్యతిరేకంగా చొరబాట్లు, నియామకాలు, లాజిస్టిక్స్, ఫైనాన్సింగ్ తదితర కార్యాచరణ ప్రణాళికల్లో పాల్గొంటున్న వీరందరినీ ఉపా చట్టం కింద ఉగ్రవాదులుగా పరిగణించినట్లు తెలిపింది.

ఈ చర్య, కేవలం ఉగ్రవాద గ్రూపులనే కాకుండా, ఆ గ్రూపుల నియామకాలు, ఆర్థిక సహాయం, శిక్షణ, కార్యాచరణ నెట్‌వర్క్‌ల వెనుక ఉన్న వ్యక్తులను కూడా లక్ష్యంగా చేసుకునే ప్రభుత్వ సమగ్ర వ్యూహంలో ఒక భాగం. 2019లో అమల్లోకి వచ్చిన యుఎపిఎ సవరణల తర్వాత, కేంద్రం వ్యక్తిగత ఉగ్రవాదులను గుర్తించ డానికి ఈ చట్టాన్ని తరచుగా ఉపయోగించుకుంటోంది. భద్రతా వర్గాల సమాచారం ప్రకారం, నోటిఫికేషన్ల జాబితాలో చేర్చిన వారిలో చాలామంది పాకిస్తాన్ లేదా పాక్ ఆక్రమిత కశ్మీర్ నుండి భారతదేశానికి వ్యతిరేకంగా, పనిచేస్తూ, ముఖ్యంగా కశ్మీర్‌లో ఈ గ్రూపుల ఉగ్రవాద మౌలిక సదుపాయాలను కొనసాగించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు.

వీరే ఆ దోషులు..

మసూద్ ఇలియాస్ కశ్మీరీ, మహమ్మద్ ముస్సాదిఖ్, ముఫ్తీ ముహమ్మద్ అస్గర్ ఖాన్, హాఫిజ్ అబ్దుల్ షకూర్, అబ్దుల్లా జెహాదీ, ఫిర్దౌస్ అహ్మద్ భట్, గులాం ఫరీద్, బిలాల్ అహ్మద్ మీర్, అబిద్ ఖయూమ్ లోన్, నజీర్ అహ్మద్ గుజ్జర్, అబ్దుల్ రౌఫ్, అష్ఫాక్ అహ్మద్, హాఫిజ్ ఖాలిద్ వలీద్, మౌలానా సైఫుల్లా ఖాలిద్, మహమ్మద్ యాకూబ్, మౌలానా యూసఫ్ తైబీ, ఒవైస్ ఫరూజ్, ఖారీ యాకుబ్ షేక్, రాణా ఇఫ్తికార్, వసీం నూర్ జాట్, మహమ్మద్ షహీద్ ఫైసల్, మౌలానా ఇమ్దాద్ ఉల్లా మక్కీ, హరూన్ రషీద్ గనై.

'దేశవ్యతిరేకత' పుస్తకాల ఏరివేత

"భారత వ్యతిరేక" లేదా "విభజన వాదానికి అనుకూలమైనవి"గా ఉన్న సాహిత్యాన్ని తొలగించాలన్న అధికారిక ఉత్తర్వుల మేరకు కశ్మీర్ యూనివర్సిటీకి చెందిన 50కి పైగా అకడమిక్ విభాగాలు, లోయలోని వివిధ కళాశాలలు, పాఠశాలలు విద్యార్థుల కోసం ఉపయోగిస్తున్న పాఠ్య పుస్తకాల సమగ్ర పరిశీలనను చేపడుతున్నాయి. ముఖ్యంగా కశ్మీర్ యూనివర్సిటీలోని పొలిటికల్ సైన్స్, లా, హిస్టరీ వంటి మూడు ప్రధాన విభాగాలు ఈ పరిణామంతో ఎక్కువగా ప్రభావితమయ్యాయి. ఏయే పుస్తకాలు లేదా రచయితలను తొలగించాలనే వివరాలతో సంబంధం లేకుండా, "సమస్యాత్మక పుస్తకాలన్నింటినీ" తొలగించాలన్న అధికారిక ఉత్తర్వులతో అనేక విభాగాల అధిపతులు ఈ పనిలో పడ్డారు. మరోవైపు, అన్ని విద్యాసంస్థల్లోని పుస్తకాలు, విద్యా సామగ్రిని మూల్యాంకనం చేయడానికి ఒక క్రమబద్ధమైన విధివిధానాల కోసం జమ్మూ కశ్మీర్ పాఠశాల విద్యాశాఖ, ఉన్నత విద్యాశాఖ సమగ్ర సర్క్యులర్లను జారీ చేశాయి.

విద్యాసంస్థల్లో అందుబాటులో ఉండే విద్యా వనరులు ఖచ్చితమైన విద్యా విలువను, వాస్తవిక విశ్వసనీయతను, బోధనాపరమైన ప్రాధాన్యతను కలిగి ఉండాలని, అలాగే భారత రాజ్యాంగం, అమలులో ఉన్న చట్టాలు, జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా ఉండాలని ఉత్తర్వులు పేర్కొన్నాయి. "ఉగ్రవాదం, హింసాత్మక తీవ్రవాదం, విభజనవాదం, తీవ్రవాదం లేదా దేశ సార్వభౌమత్వం, ఐక్యత, అఖండత, భద్రతకు భంగం కలిగించే ఏ చర్యలనైనా ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ప్రోత్సహించే, కీర్తించే, చట్టబద్ధం చేసే లేదా సమర్థించే అంశాలు ఇందులో ఉండకూడదు" అని ఆ ఉత్తర్వులు స్పష్టంగా వెల్లడించాయి.

వేర్పాటువాద నాయకులపై ఎన్ఐఏ ఛార్జిషీట్

జమ్మూ కశ్మీర్‌లోని శ్రీనగర్‌లో 1996లో పోలీసు సిబ్బందిపై జరిగిన మూక హింస, విచక్షణారహిత కాల్పుల కేసులో వేర్పాటువాద హురియత్ కాన్ఫరెన్స్‌కు చెందిన ఆరుగురు నాయకులపై జాతీయ దర్యాప్తు సంస్థ జులై 10 ఛార్జిషీట్ దాఖలు చేసింది. ఛార్జిషీట్‌లో పేర్లు ఉన్న వారిలో డెమోక్రటిక్ ఫ్రీడమ్ పార్టీ అధినేత షబీర్ అహ్మద్ షా, తెహ్రీక్-ఎ-హురియత్ నాయకుడు సయ్యద్ అలీ షా గీలనీ, జమ్మూ కాశ్మీర్ పీపుల్స్ కాన్ఫరెన్స్ వ్యవస్థాపకుడు అబ్దుల్ గనీ లోన్, జమ్మూ కాశ్మీర్ లిబరేషన్ ఫ్రంట్ నాయకుడు జావిద్ అహ్మద్ మీర్, ఇస్లామిక్ స్టూడెంట్స్ లీగ్ చైర్మన్ షకీల్ అహ్మద్ బక్షి, మహమ్మద్ యాకూబ్ వకీల్ ఉన్నారు. కేసు విచారణలో ఉండగా గీలానీ, లోన్, వకీల్ చనిపోవడంతో వారిపై విచారణ నిలిచిపోయిందని ఎన్ఐఏ తెలిపింది. అయితే, నేరపూరిత కుట్ర, చట్టవిరుద్ధమైన సమావేశంలో వారి పాత్రను ఛార్జిషీట్ నిర్ధారించిందని పేర్కొంది. కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఆదేశాలతో 2026 ఏప్రిల్‌లో జమ్మూ కశ్మీర్ పోలీసుల నుంచి ఈ కేసును ఎన్ఐఏ స్వీకరించింది. నేరపూరిత కుట్ర, హత్యాయత్నం, అల్లర్లు, ప్రభుత్వ ఉద్యోగులపై దాడికి సంబం ధించిన శిక్షాస్మృతిలోని నిబంధనలతో పాటు, చట్టవిరుద్ధ కార్యకలాపాల నివారణ చట్టం కింద కూడా ఆరుగురిపై ఏజెన్సీ అభియోగాలు మోపింది. "1996 జూలై 17న నాజ్ క్రాసింగ్ వద్ద హతమైన ఉగ్రవాది హిలాల్ అహ్మద్ బేగ్ అంత్యక్రియల ఊరేగింపు సందర్భంగా, ఆరుగురు నిందితులు చట్టవిరుద్ధమైన గుంపుకు నాయకత్వం వహించి, పోలీసు సిబ్బందిపై పెద్ద ఎత్తున హింసను ప్రేరేపించారు," అని ఏజెన్సీ తెలిపింది. "వేర్పాటువాద భావజాలాన్ని ప్రచారం చేయడానికి, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజల మద్దతును సమీకరించడానికి అంత్యక్రియల ఊరేగింపును ఒక వేదికగా ఉపయోగించుకోవాలని హురియత్ నాయకత్వం వేసిన ముందస్తు ప్రణాళిక, నేరపూరిత కుట్రలో భాగంగానే ఈ మూక హింస జరిగింది" అని కూడా ఎన్ఐఏ ఆరోపించింది.

కథ

కొత్త కొండపై

క్రిష్ణపాటి సీతారామశాస్త్రి

కొడుకు, కోడలు ఉద్యోగస్తులు కావడం మూలాన పిల్లలను చూచుకొంటూ శేషారత్నం ఇంటిపట్టున ఉంటోంది. మొదట్లో పిల్లల అల్లరి, ఆటలు కొంత సంతోషంగా ఉన్నా రాను రాను శ్రమ ఎక్కువ అవటంవల్ల శేషారత్నం చికాకుగా ఉంటోంది.

"నాలుగు రోజులు అలా ఎక్కడికైనా వెళ్లి వస్తామండీ పిల్లల అల్లరి తట్టుకోలేక పోతున్నాను" అంది శేషారత్నం భర్త కామేశంతో. అతడు చిరునవ్వు నవ్వి ఊరుకొన్నాడు.

"ఏం పలకరూ", అంది శేషారత్నం భర్త పైన సహజంగా వచ్చే అధికార స్వరంతో.

"అలాగే" అన్నాడు కామేశం తలపంకిస్తూ.

"ఎక్కడికెల్దాం"? మరలా అడిగింది శేషారత్నం.

"నీవే చెప్పు" అన్నాడు కామేశం భార్య ఇష్టానికే విలువిస్తూ,

మంత్రాలయం వెళదామా? చాలా కాలమైంది వెళ్లొచ్చి. తన ఇష్టాన్ని బయట పెట్టింది శేషారత్నం.

"సరే" అన్నాడు కామేశం ఒప్పుదలగా.

"ఎప్పుడు బయలుదేరుదాం"? ప్రయాణ నిర్ణయం ఇప్పుడే జరగాలన్నట్లుగా అంది శేషారత్నం.

"అది కూడా నువ్వే చెప్పు" అన్నాడు కామేశం ఆమె ఆలోచనకే వదిలేస్తూ

"రైల్లో రిజర్వేషన్ ఎపుడు దొరుకుతుందో" తనలో తానూ గొణుక్కొంటున్నట్టుగా పైకి అనేసింది శేషారత్నం.

"మీరు అబ్బాయిని త్వరగా టికెట్లు తీయమని చెప్పండి" అంది శేషారత్నం సంభాషణ ముగిస్తూ. "అలాగే" అన్నాడు కామేశం.

పై సంభాషణ ద్వారా శేషారత్నం కామేశ్వరరావు దంపతులు పిల్లల అల్లరి బారి నుండి తప్పించుకొని నాలుగురోజులు మంత్రాలయం వెళ్తున్నారని అర్థమయింది గదా.

ఇక కథలోకి వస్తే, కామేశం ఈ మధ్యనే రిటైర్



పిల్లి

అయ్యాడు. శేషారత్నం పెద్దగా చదువుకోలేదు. కానీ తెలివైంది. అనుకూలవతి కావడం వాళ్ల కామేశం ఆమె ఇష్టాలకు విలువిస్తాడు. ఆ రోజుల్లో సాంప్ర దాయం ప్రకారం జరిగిన పెళ్లివారిది. ఇద్దరూ బీద కుటుంబాల నుంచి వచ్చినవారే, దాంపత్య జీవన సాఫల్యంగా ఒక పిల్లాడు కలిగాడు. ఉద్యోగరీత్యా వివిధ రాష్ట్రాలలో పనిచేయవలసి వచ్చింది. కామేశానికి. పిల్లవాణ్ణి బాగా చదివించుకోవడం మినహా యితరత్రా ఆస్తిపాస్తులేం సంపాదించుకోలేదు కామేశం. పిల్లవాడు చేతికి వచ్చేంతవరకు చాలా కష్టంగా జీవితం నెట్టుకొచ్చారు. అలాంటి రోజుల్లో శేషారత్నం ఎంతో ఓర్పుతో సంసారాన్ని నెట్టు కొచ్చింది. తనకిది కావాలి అని భర్తను ఏనాడు ఇరకాటంలో పెట్టలేదు. ఆమెలోని ఈ గుణం వల్ల కామేశం ఆమెకు ఎక్కువ విలువ ఇస్తాడు. ఉద్యోగం చివరిదశలో హైదరాబాద్ రాగలగడం, అబ్బాయి ఉద్యోగరీత్యా విదేశాలకు వెళ్లి తిరిగి రావడం, తదుపరి పెండ్లి వరుసగా జరిగిపోయాయి.

కామేశం రిటైర్మెంట్ సమయానికి అబ్బాయి హైదరాబాద్‌లో ఇల్లు కొనుకొన్నాడు. అందరూ కలసి ఉంటున్నారు. కాలం ముందుకు సాగుతోంది. మనమరాలు, మనమడు కలిగారు. దినదిన ప్రవర్ధ మానంగా పిల్లలు పెరిగారు. శేషారత్నంకు పిల్లల వల్ల మంచి కాలక్షేపంగా ఉంటోంది. క్రమంగా వాళ్లకు మాటలు వచ్చి "నానమ్మ" అంటూ వెంట తిరుగుతూ, అన్నిటికీ నాన్నమ్మే అన్నట్లుగా ఉండటం ఒక్కోసారి, శేషారత్నానికి చాలా గర్వంగా ఉంటుంది. పిల్లలు పొద్దున నిద్ర పోయినప్పుడు శేషారత్నానికి విశ్రాంతి. పిల్లలతో నెగ్గుకు రావటం ఎంతో శ్రమతో కూడిన పనైనా, ఆనందంతో చేస్తోంది శేషా రత్నం.

పిల్లల ముచ్చట్లు, ఆట పాటలు ఎంతో ముద్దుగా ఉంటున్నాయి. రానురాను పిల్లలు పెరిగి పెద్ద వాళ్లవుతున్నారు. పగలు నిద్రమానుకున్నారు. ఆటల సమయం ఎక్కువవు తున్నది. అల్లరి ఎక్కువైపోతోంది. వారి వెంటబడి అన్నీ చేయడం చాలా శ్రమగా ఉ ంటోంది. వయసు పైబడుతోంది గదా అయినా ఓపిగ్గా చేస్తోంది. మెల్లమెల్లగా పిల్లలు స్కూలుకు వెళ్లడం అలవాట యింది. రాగానే వాళ్ల డ్రస్సులు మార్పించడం, అన్నం తినిపించడం వగైరా పనులన్నీ ఆ వయసులో చేసుకు రావడం శక్తికి మించిన పనవుతోంది. శ్రమ అనిపిస్తోంది. మార్పు కోసం కొంత కాలం ఎక్కడికైనా వెళ్దామా అనిపిస్తోంది.

సరిగా ఇలాంటి రోజుల్లోనే కామేశాన్ని మంత్రాలయం వెళ్దామని శేషారత్నం అడిగింది.

అబ్బాయి టికెట్లు తెచ్చి యిచ్చాడు. ఆరోజు బయలుదేరాలి. కొడుకు, కోడలు, పిల్లలు అందరూ స్టేషన్‌కు వచ్చారు. సామాను బెర్తు కింద సర్దాడు అబ్బాయి. అప్పటికి పిల్లలకు అర్థమయింది. పిల్లలకు నాన్నమ్మ ఎక్కడికో వెళ్తోందని. రైల్లోనించి దిగిరమ్మని, వెళ్లవద్దని పిల్లలు ఒకటే ఏడుపు. ఆ పిల్లల ఏడుపుతో శేషారత్నం దుఃఖాన్ని ఆపుకోలేక పోయింది. "వద్దండి వెనక్కి వెళ్దాం పదండి" అంది శేషారత్నం. కొంచంసేపు ఏడుస్తారు అంతే మళ్లీ నాలుగు రోజుల్లో వస్తాం గదా" అనునయించడానికి ప్రయత్నించాడు కామేశం. అబ్బాయి, కోడలు అందుకొని నాలుగు రోజులే కదమ్మా వెళ్లిరా మేము శెలవు పెట్టి పిల్లలను జాగ్రత్తగా చూసుకొంటాం గదా" అని నచ్చచెప్పడానికి ప్రయత్నించారు. ఏమైనా బాధను ఆపుకోలేకపోతోంది శేషారత్నం. ఈలోగా

రైలు కదిలింది. పిల్లల ఏడుపు తారాస్థాయికి చేరుకొంది. శేషారత్నం గుండె ఎంతో బరువైంది. కన్నీరు ధారా పాతం అయింది. కామేశం భార్యను ఓదార్చడానికి ఎంతో ప్రయత్నిస్తున్నాడు.

ప్రయాణికులు ఒకరొకరు బెర్తులు సర్దుకొని పడుకుంటున్నారు. శేషారత్నం లోయర్‌బెర్త్‌లో పడుకుంది. భారమైన మనసు శరీరాన్ని నిద్రవైపు మళ్లించలేకపోతోంది. రోజు ప్రక్కన పడుకునే పిల్లలు లేక ఏదో వెలితిగా ఉంది. పిల్లల ఏడుపు గుర్తు వచ్చి తల్లడిల్లిపోతుంది. కలతతో బెర్త్‌పై వాలిన శేషారత్నానికి పిల్లలతో ముడిపడిన సంఘటనలు ఒక్కొక్కటిగా గుర్తుకొస్తున్నాయి.

శ్రావణమాసం అని మనమరాలికి చేసిన అమ్మవారి అలంకరణ, కృష్ణాష్టమికి మనవడికి చేసిన చిన్ని కృష్ణుని అలంకరణం, అవి చేయించుకోవడానికి వాళ్లు చేసిన అల్లరి ఇలా ఒక్కొక్కటిగా గుర్తుకొస్తు న్నాయి.

మొదటిసారి మనమరాలిని స్కూలుకు పంపే టప్పుడు పడ్డ బాధ ఇంచుమించు కూతురును అత్త వారింటికి పంపేటప్పుడు కలిగిన బాధలా ఉండింది.

ప్రతి రోజు నాలుగడుగులు వాళ్ల వెంట వెళ్లి స్కూలు బస్సు ఎక్కించి, బస్సు కనుమరుగయ్యేంత వరకు చేతులూపుతూ నిలబడే సన్నివేశం, స్కూలు నుండి వాళ్లు వచ్చేటప్పటికి బస్సుకు ఎదురువెళ్లి వారిని దించుకుంటే 'నాన్నమ్మ' అని ఎగిరి గంతేస్తూ మెడగరుచుకొని గారాలు పోతూ స్కూల్‌లో ఏమేమి జరిగిందో చెబుతూ ఆనందపడి పోవడం, అన్నం తినేటప్పటి అల్లరి, రాత్రి నిద్ర పోయేటపుడు కథలు చెప్పటం..ముఖ్యంగా పురాణాలకు సంబంధించిన కథలు చెప్పేటప్పుడు వాళ్లు అడిగే ప్రశ్నలు ఇలా ఒక్కొక్కటి గుర్తుకొస్తున్నాయి శేషారత్నానికి.

రైలు కర్నూలు చేరబోతున్నట్లుంది. తుంగభద్ర వంతెన మీద రైలు శబ్దం చేస్తుంది. శేషారత్నానికి నిద్రపట్టడం లేదు.

ఒకరోజు మనమరాలి విషయంలో స్కూల్లో జరిగిన సంఘటన గుర్తుకొచ్చింది.

స్కూల్ డే సందర్భంగా చిన్న పిల్లలతో గ్రూప్ డాన్స్ చేయిస్తారని రోజూ ప్రాక్టీస్ చేయిస్తున్నారు. రాత్రి పడుకొనేటప్పుడు కాళ్ల నొప్పులు అంటుండేది. కాళ్లకు కొబ్బరినూనె రాసి మెల్లగా మర్దన చేసి కథ చెపుతూ నిద్రపుచ్చడం జరుగుతుండేది.

స్కూల్ డే రానే వచ్చింది. ఒకరోజు సాయంత్రం ఆరుగంట లకు ఏర్పాటు చేసారు. స్కూల్ బస్సు వచ్చి పాపను తీసుకు వెళ్లింది. ఉదయమే వెళ్లేటప్పుడు "నాన్నమ్మా నీవు సాయంత్రం తప్పక రావాలి" అని చెప్పి వెళ్లింది మనమరాలు.

అయితే ఆ రోజు అనుకోకుండా శేషారత్నంకు జ్వరం వచ్చింది. అబ్బాయి, కోడలు మాత్రం వెళ్లగలిగారు. స్కూల్ డేకు వెళ్లిన కాసేపటికే కోడలి నుండి ఫోన్ వచ్చింది. మేకప్ వేయడానికి సహాయంగా రమ్మని టీచర్ కోడలిని లోపలి పిలువగా కోడలు ఆడిటోరియంలోని గ్రీన్ రూమ్‌కు వెళ్లిందట. అక్కడ నాన్నమ్మ రాలేదని తెలిసి మనమరాలు మేకప్ వేసుకోకుండా ఏడుస్తోందని ఫోన్. శేషారత్నాన్ని బలవంతంగా లేవదీసి కారులో తీసుకొని వెళ్లాడు ఆడిటోరియంకు కామేశం. కొడుకు, కోడలు ఎదురుగా వచ్చి, ఇంకా మన పాప కార్యక్రమం ప్రారంభించలేదని, నాన్నమ్మ వస్తోంది అని చెప్పటంలో పాప సిద్ధం అయిందని చెపుతూ, మెల్లగా శేషారత్నాన్ని లోపలకి తీసుకు వెళ్లారు. కాసేపట్లో కార్యక్రమం ప్రారంభం అయ్యింది. ప్రేక్షకులలో రెండవ వరుసలో ఉన్న నాన్నమ్మ మనమ రాలికి చేయి ఊపి, సైగ చేసింది. మనమరాలి ముఖంలో ఆనందం వర్ణనాతీతం.

ఇలా ఒక్కొక సంఘటన శేషారత్నంకు మనమడు, మనమరాలితో అనుబంధం పెంచుకొంటూ పోయింది. అయితే వాళ్లు చేసే అల్లరి, దుడుకుతనం ఒక్కొక్కసారి విసుగనిపిస్తాయి. కాని ఆ అల్లరే తనను ఎంతగా కట్టిపడేసిందో, తానూ పిల్లలను వదలిరావడానికి పడ్డ బాధ వల్ల తెలుస్తోంది.

ఈ అనుబంధపు విలువ పిల్లల నుంచి పక్కకు వచ్చాక గానీ అర్థంకాలేదు ఆమెకు. ఇన్ని తీపి గుర్తులకు బాధ్యులైన పిల్లల నుంచి దూరంగా వెళ్లాలనుకున్న తన ఆలోచన పట్ల తనకే కోపం వచ్చినది.

ఇలా ఆలోచిస్తూ ఉండగానే తుంగభద్ర స్టేషన్ చేరింది రైలు. కామేశం, శేషారత్నం రైలు దిగి ఆటో చేసుకొని మంత్రాలయం వెళ్లి, ఒక హోటల్‌లో స్నానాదికాలు ముగించుకొని గుడికెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు. నా మనమడిని, మనమరాలిని చల్లగా చూడు స్వామి అని శేషారత్నం మనసారా కోరుకుంది.

తిరిగి హోటల్‌కు వచ్చారు. హోటల్ రూంలో అలా పడుకుందే కాని, శేషారత్నం మనసంతా పిల్లల ఆలోచనలే.

"దర్శనమైంది కదా మనం తిరిగి వెళదాం పదండి" ఆత్రుతగా అంది శేషారత్నం

"అదేంటి? నాలుగు రోజులు ఉంటానన్నావు కదా" అడిగాడు కామేశం.

"ఒక్క క్షణం కూడా కూర్చోకుండా విశ్రాంతి లేకుండా చేస్తున్నానని నాలుగు రోజులు అలా వెళ్దాం అన్నాను. కానీ, పిల్లలు, వాళ్ల అల్లరి లేకుండా ఉండ లేనని నాకు ఇప్పుడు అర్థమవుతోంది. వయోభారం చేత శారీరికమైన ఇబ్బంది కొంత ఉన్నా మనసు మాత్రం ఎంతో తృప్తిగా, ఆహ్లాదంగా ఉంటుంది. పగలంతా పిల్లలతో ఆడిపాడటం వల్ల రాత్రి ప్రశాంతంగా నిద్రపడుతుంది. ఈ వయసులో ఇలాంటి అనుభవమే సరియైనది. మనం వెళ్లిపోదాం. రైలులో రిజర్వేషన్ దొరకకపోతే బస్సులో వెళ్దాం" అంది శేషారత్నం.

కామేశం వెళ్లి బస్సు టికెట్లు తెచ్చాడు

తెల్లవారే సరికి బస్సు ఇమ్లీబన్ బస్సు స్టాండు చేరింది. టాక్సీలో ఇంటికి వెళ్లారు. నాన్నమ్మను చూచిన ఆనందంలో పిల్లలు పరుగెత్తుకు వచ్చి ఆమె కాళ్లు చుట్టేశారు. వారి ఆనందం చూచి శేషారత్నం పరవశించి పోయింది.

"ఈ ఆనందమే కదా కావాల్సింది. ఎన్ని లక్షలు పోస్తే ఈ ఆనందం లభిస్తుంది".

శేషారత్నం మనసు భావోద్వేగంలో ఓలలాడింది.

* * *

ఎందరో నాన్నమ్మలు - అందరికీ అంకితం



ప్రపంచకప్ చరిత్రలో ఆ నలుగురు!

విశ్వ సాకర్ అభిమానులను గత కొద్ది వారాలుగా ఓలలాడిస్తూ వచ్చిన 2026 ఫిఫా ప్రపంచకప్ ఫుట్‌బాల్ పోటీలు పలు అరుదైన రికార్డులతో విజయవంతంగా ముగిశాయి. లయోనల్ మెస్సీ, క్రిస్టియానో రొనాల్డో, నైమార్, హ్యారీ కేన్ తమదైన శైలిలో రాణించి ప్రపంచకప్ వేటకు ముగింపు పలికారు.

రంగం ఏదైనా..ఎన్ని రికార్డులు నెలకొల్పినా ఎక్కడో ఒకచోట ఆగిపోక తప్పదు. దానికి క్రీడారంగం..ప్రధానంగా విశ్వజన సమ్మోహక క్రీడ ఫుట్‌బాల్ ఏ మాత్రం మినహాయింపుకాదు.

గత రెండు దశాబ్దాల కాలంగా ప్రపంచ ఫుట్‌బాల్‌కు తమ ఆటతీరుతో సరికొత్త వైభవాన్ని తెచ్చిన వివిధ దేశాల దిగ్గజ ఆటగాళ్లు వీడ్కోలు పలికారు. అమెరికా– మెక్సికో– కెనడా దేశాల సంయుక్త ఆతిథ్యంలో ముగిసిన 2026 ఫిఫా ప్రపంచకప్ ఫుట్‌బాల్ సమరంలో తమ తమ దేశాలకు నాయకత్వం వహించి, తమదైన శైలిలో పోరాడి, రాణించి మరీ తెరమరుగయ్యారు.

క్రిస్టియానో రొనాల్డో నుంచి హ్యారీ కేన్ వరకూ....

లియోనల్ మెస్సీ, క్రిస్టియానో రొనాల్డో, హ్యారీ కేన్, నైమార్, మహ్మద్ సాలా...ఈ విశ్వవిఖ్యాత, దిగ్గజ సాకర్ స్టార్ల గురించి క్రీడాభిమానులకు, ప్రధానంగా ఫుట్‌బాల్ ప్రియులకు ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన పనిలేదు.

ప్రపంచంలోనే అత్యంత జనాదరణ పొందిన, పొందుతున్న ఏకైక క్రీడ ఫుట్‌బాల్‌కు 204 దేశాలలో వందల కోట్ల మంది అభిమానులున్నారు. పిల్లల నుంచి పెద్దలవరకూ పురుషుల నుంచి మహిళల వరకూ విపరీతంగా అభిమానించి, ఆడుతూ, ఆదరిస్తూ ఉండే ఈ క్రీడలో మెస్సీ, రొనాల్డోకు కోట్లమంది అభిమానులున్నారంటే ఆశ్చర్యంలేదు. తమ ఆటతీరు, అపార నైపుణ్యం, అసాధారణ విన్యాసాలు, అనితర సాధ్యమైన రికార్డులతో ఉర్రూతలూగించిన తమ అభిమాన,ఆరాధ్య ఆటగాళ్లు తమ ఫుట్‌బాల్ జీవితంలో ఆఖరుసారి ఫిఫా ప్రపంచ కప్‌లో పాల్గొని, నిష్క్రమించడం అభిమానులకు మింగుడు పడని విషయమే. అయితే.. ఎంతటి గొప్ప ఆటగాడైనా ఏదో ఒక దశలో వయసును గౌరవించి యువఆటగాళ్ల కోసం తమతమ స్థానాల నుంచి వైదొలగక తప్పదు.

ప్రస్తుత ఫిఫా ప్రపంచకప్ పోరులో తమతమ జట్ల తరపున చివరిసారిగా తలపడిన అర్జెంటీనా మాంత్రికుడు లియోనెల్ మెస్సీ, పోర్చుగీసు వీరుడు క్రిస్టియానో రొనాల్డో, ఇంగ్లండ్ సారథి హ్యారీ కేన్, బ్రెజిల్ మాజీ కెప్టెన్ నైమార్, ఈజిప్ట్ నాయకుడు మహ్మద్ సాలా భావోద్వేగాల నడుమ వీడ్కోలు పలికారు.

మెస్సీ అలా... క్రిస్టియానో ఇలా...

ఆధునిక ఫుట్‌బాల్ చరిత్రలో ఇద్దరు మొనగాళ్లు ఎవరంటే అర్జెంటీనా కెప్టెన్ లియోనెల్ మెస్సీ, పోర్చుగల్ సారథి క్రిస్టియానో రొనాల్డో అని మాత్రమే చెప్పాలి. గత రెండున్నర దశాబ్దాలుగా తమ జట్లకు మూలవిరాట్లుగా ఉంటూ అపురూప విజయాలు, రికార్డులు సాధించడంలో ఇద్దరూ ఇద్దరే.

క్లబ్ ఫుట్‌బాల్ నుంచి అంతర్జాతీయ ఫుట్‌బాల్ వరకూ అవిశ్రాంతంగా ఆడుతూ, పోరాడుతూ వచ్చిన మెస్సీ తనజట్టును విశ్వవిజేతగా నిలపడంలో సఫలం కాగా..క్రిస్టియానో రొనాల్డో విఫలమయ్యాడు. మాజీ ఛాంపియన్ స్పెయిన్ చేతిలో ఆఖరి నిమిషం గోలుతో పరాజయం పొందడంతో పోర్చుగల్ ఓటమి, క్రిస్టియానో రొనాల్డో నిష్క్రమణ ఏకకాలంలో జరిగిపోయాయి.

18 సంవత్సరాల చిరుప్రాయంలోనే ప్రపంచకప్ బరిలోకి దిగిన రొనాల్డో గత ఆరు (2008, 2012, 2016, 2020, 2024, 2026) ప్రపంచకప్ టోర్నీలలో పాల్గొన్నాడు. తన జట్టును విశ్వవిజేతగా నిలపాలన్న పట్టుదలతో పోరాడినా ప్రయోజనం లేకపోయింది. ఆడిన ప్రతి ప్రపంచకప్‌లోనూ గోలు సాధించిన ఘనత మాత్రమే రొనాల్డోకు దక్కింది.

తన కెరియర్‌లో ఇదే ఆఖరి ప్రపంచకప్ ఆంటూ క్రిస్టియానో రొనాల్డో కన్నీటి పర్యంతమవుతూ ప్రకటించాడు. బ్రెజిల్ స్ట్రయికర్ నైమార్, ఇంగ్లండ్ కెప్టెన్ హ్యారీకేన్, ఈజిప్ట్ పోరాటయోధుడు మహ్మద్‌సాలా సైతం ఘనంగా నిష్క్రమించారు.

అర్జెంటీనా నాయకుడు లియోనల్ మెస్సీ మాత్రమే తన జట్టుకు మెరుపు విజయాలు అందిస్తూ విజయపథంలో నడపగలిగాడు. మాజీ చాంపియన్ ఇంగ్లండ్ 48జట్ల లీగ్‌దశ నుంచి 32జట్ల ప్రీ– క్వార్టర్ ఫైనల్స్ నాకౌట్ రౌండ్ నుంచి 16 జట్ల నాకౌట్ రౌండ్ వరకూ విజయాలు సాధించడంలో ప్రధాన పాత్ర వహించాడు. ఈ సాకర్ దిగ్గజాలు ప్రపంచకప్ నుంచి తెరమరుగైనా తమదైన ముద్ర వేసి చరిత్రలో నిలిచిపోయారు.

జనాభా పరంగా ప్రపంచంలోనే 140 కోట్లకు పైగా జనాభాతో రెండు అతిపెద్ద దేశాలుగా నిలిచిన భారత్, చైనా ప్రపంచకప్ ఫుట్‌బాల్ ఫైనల్ రౌండ్‌కు అర్హత సాధించలేకపోవడం విషాదమైతే...ఆఫ్రికాఖండ పశ్చిమతీర దేశం, 5 లక్షల 30వేల జనాభా కలిగిన అతిచిన్న దేశం కేప్ వర్దే ప్రపంచకప్ ఫైనల్ రౌండ్‌కు అర్హత సాధించడమే కాదు..స్పెయిన్, ఉరుగ్వే లాంటి ప్రపంచ మాజీ చాంపియన్ జట్లను ముప్పతిప్పలు పెట్టిన దృశ్యం 2026 ఫిఫా ప్రపంచకప్‌కే గొప్ప ఘనతగా మిగిలిపోతుంది.

కృష్ణారావు చాప్పిరపు
సీనియర్ జర్నలిస్ట్, 84668 64969

భాగం-45



మార్క్సిజం-శ్రీరామరాజ్యం

స్వేచ్ఛకి పరిమితులు

జీవశాస్త్రంలోని ప్రసిద్ధ నియమం ఏమిటంటే, 'బతకడానికి యోగ్యమైనది మాత్రమే బతుకుతుంది.' అందువల్ల సామాజికంగా వెనుకబడిన తరగతుల వారిని వారి ఖర్మానికి వారిని వదిలివేయాలని చాలమంది పాశ్చాత్య రాజనీతి శాస్త్రవేత్తలు వాదించారు. కానీ ఆ భావం తప్పని శ్రీకరపాత్రీ స్వామి చెబుతున్నారు.

మతస్వేచ్ఛ, భావప్రకటనాస్వేచ్ఛ ఉండడం చాలా అవసరం. భారతీయ సిద్ధాంతాలలో అట్టి భావాలకు అత్యంత ఆదరణ ఉంది. ఈ దేశంలో చార్వాకం, శూన్యవాదం, ద్వైతం – అద్వైతం వంటి అనేక విధాలైన పరస్పర విరుద్ధ భావాలు కలిగిన దార్శనికులు ఉన్నారు. వారి విశ్వాసాల మధ్య సంఘర్షణలు జరిగినప్పటికీ... ఎవరి మతంపైన, భాషణలపైన నిషేధం విధించలేదు. ఇక్కడ మత ప్రకటనలలోని వైవిధ్యం కారణంగా ఏసు, సోక్రటీసుల వలె ఎవరినీ ఉరి తీయలేదు.

రామరాజ్యంలో ఒక రజకుడు కూడా...

అఖండ భూమండలానికి చక్రవర్తి, లోకప్రియుడు, సర్వజన రంజనుడు అయిన రాముని గురించి, పరమసాధ్వి సీతను గురించి... తన భావాలను స్వేచ్ఛగా వెల్లడించడానికి ఏ ప్రతిబంధకాలూ కలగలేదు. రాముడు తలుచుకుంటే అతడిని దండించగలిగి ఉండేవాడు. లౌకిక జీవులైన మానవులు, వానరులు, ఎలుగుబంట్లు, రాక్షసులతో పాటుగా... అలౌకికులైన మహర్షులు, దేవతలు, సిద్ధులు, ఇంద్రుడు, బ్రహ్మ, రుద్రుడు వంటివారి సమక్షంలో అగ్నిపరీక్షలో పునీత అయిన సీతను గురించి ఆ రజకుడు అలా మాట్లాడగలిగాడు. అప్పుడు రాముడు, 'శిక్షించడం ద్వారా ఒక నోటిని మూసివేస్తే, ఆ తర్వాత వేలనోళ్ల నుంచి అదే స్వరం వినిపిస్తుంది' అని ఆలోచించాడు.

వ్యవహారశైలి ద్వారానే వ్యక్తుల ఆలోచనా తీరును, మాటతీరును మార్చవచ్చు. కానీ దండన ద్వారా అలా చేయలేం. మార్పు సాధ్యం కాదు. దేనికైనా కొన్ని పరిమితులుంటాయి. అసంబద్ధమైన, హితం చేకూర్చని ఆలోచనా విధానాలు, మాటతీరులు సమాజంపై చెడు ప్రభావాలు చూపించవచ్చు. అందువల్ల సమష్టి హితం కోసం స్వేచ్ఛకు కొన్ని పరిమితులు అవసరమవుతాయి.

జ్ఞానపిపాస అనేది కచ్చితంగా మంచిదే; కానీ, అతిగా పెరిగే జ్ఞానభారం కూడా లాభదాయకం కాదు. ఈశ్వరుని వాక్యం ద్వారా నిర్మితమై, నియమితమైన ఈ విశ్వంలో మేలు చేకూర్చేవైన అన్ని విషయాలకు సంబంధించిన జ్ఞానం ఈశ్వరీయమైన శాస్త్రాల ద్వారా... సర్వజ్ఞులైన మహర్షుల బుతంభరా ప్రజ్ఞ ద్వారా సులభంగా లభిస్తుంది. మహాభారతంలో ఉన్నదే ఇతరత్రా ఉన్నది. ఇందులో లేనిది ఎక్కడాలేదు... అని భారతకర్త చెప్పాడు. అయినప్పటికీ భారతంపై ఒక పరిమితికి లోబడి స్వతంత్ర తర్కాన్ని ప్రవేశపెట్టే సంప్రదాయం ఆమోదయోగ్యమే.

ఎక్కడైతే శాస్త్ర పరంపర తెగిపోయిందో, శాస్త్రీయ విజ్ఞానం కలిగిన దేశాలతో సంబంధాలు కనుమరుగయ్యాయో... అక్కడ అన్వేషణలో ఉన్నతమైన ఆసక్తి కలిగి ఉండడం లాభదాయకం అవుతుంది. ఏదైనా ఒక పరమసత్యాన్ని చేరుకోకుండా; ఏదైనా ఒక దృఢ నిశ్చయానికి రాకుండా సమాజంలో స్థిరత్వం – సుఖశాంతులు స్థాయిత్వాన్ని పొందడం సాధ్యం కాదు. పరుగు పరుగుకోసం కాదు. శ్రమించి పనిచేయడం శ్రమకోసం కాదు. అనంతరం పరమ విశ్రాంతిని పొందడం కోసమే అయి ఉండాలి.

'సత్యం ఏ ఒక్కరి సొత్తూ కాదు'. ఎవరి ఇష్ట ప్రకారం వారు అందులో మార్పులుచేర్పులు చేయడం కుదరదు. తాడును తాడుగానే తెలుసుకోవడం యదార్థ జ్ఞానం అవుతుంది. తాడును చూసి పాము అనుకోవడం, ఏదైనా నీటిధార అనుకోవడం, మాల అనుకోవడం యదార్థం కాదు. ఇట్టి జ్ఞానాలను అంగీకరించ లేం. ఈ దేహమే ఆత్మా...లేక దీనికి భిన్నమైనదా? ఆత్మ చేతనమా, అచేతనమా? వ్యాపక లక్షణమే ఆత్మా లేక అణువంత స్థాయిలో ఉంటుందా లేక మధ్యమ పరిమాణంలో ఉంటుందా? ఆత్మ అసంగతమైనదా లేక కర్త – భోక్తగా ఉంటుందా? ఇట్టి తాత్త్విక విచారాలన్నింటినీ ఒకే దృష్టికోణంలో, ఒకే సత్త చేత సమన్వయించడం సాధ్యం కాదు.

అవస్థాభేదం, దృష్టిభేదం, సత్తాభేదాల చేత సమన్వయించడం వేరే విషయం. ఇట్టి తాత్త్విక విచారణ కోసం అనేక పక్షాలవారి విధానాలపై అధ్యాపన చేయడం... తత్త్వ – అతత్త్వ వివేచన చేయడం అవసరం అవుతుంది.

ఈ విధంగా హెర్బర్ట్ స్పెన్సర్ (1820–1903) పరిణామవాదాన్ని అనుసరించి, 'ఈ విశ్వ వికాసం, దీనికి సంబంధించని ఒక అనిశ్చిత ఏకత్వం నుంచి జరిగింది. ఇది నిశ్చయంగా దీనికి సంబంధించిన విభిన్నత వైపుకి దూసుకెళ్తోంది' అని చెప్పాడు. అతడి అభిప్రాయం ప్రకారం సామాజిక వికాసం కూడా ఇదే తీరుగా జరిగింది. ప్రాచీన సమాజంలో ఏకత్వంలో ఉండేది కానీ అది అనిశ్చితమైనది కావడంతో పాటు అసంబద్ధమైనది కూడా. ఆధునిక సమాజంలో విభిన్నతతో పాటు నిశ్చితత్వం ఉంది. ఇది సమంజసమైనది కూడా.

జీవ పరిణామం కూడా ఒక నిమ్నశ్రేణి నుంచి ఉన్నత శ్రేణివైపు కొనసాగుతూ వస్తోంది. మొదట్లో కూడా మానవులు సమూహాలుగానే జీవించేవారు. ఏవో కొన్ని కష్టనష్టాలు ఉన్నప్పటికీ వాటి ప్రభావం మొత్తం సమాజం అంతటిమీదా పడేది కాదు. ఇతరుల పనులకు ఆటంకాలు ఏర్పడేవి కావు. కానీ నేటికాలంలో ఏదైనా రైలును ఆపివేసినా, కర్మాగారాన్ని మూసివేసినా వాటిపై ఆధారపడి జీవిస్తున్న వారందరిపైనా తీవ్రప్రభావం పడుతోంది.

హిందీమూలం : కరపాత్రీ స్వామి
అనువక్త : నేతి సూర్యనారాయణశర్మ

భారత సైనికుల విజయగర్జన

కార్గిల్ విజయ్ దివస్... ప్రతి భారతీయుడి గుండెల్లో దేశభక్తి జ్వాలను రగిలించే మహత్తర దినం. ఇది కేవలం ఒక యుద్ధ విజయానికి గుర్తు మాత్రమే కాదు; భారత సైనికుల అజేయ సంకల్పానికి, అసమాన ధైర్యసాహసాలకు, వీరత్వానికి, అమర జవాన్ల త్యాగాలకు శాశ్వత చిహ్నం.

1999 జూలై 26న భారత సైన్యం కార్గిల్ ప్రాంతంలోని ప్రతి అంగుళం భూభాగాన్ని తిరిగి స్వాధీనం చేసుకుని చరిత్రలో స్వర్ణాక్షరాలతో నిలిచిపోయే విజయాన్ని సాధించింది. అప్పటి నుంచి ప్రతి ఏడాది జూలై 26వ తేదీని దేశం కార్గిల్ విజయ్ దివస్‌గా నిర్వహిస్తూ అమర వీరులకు ఘన నివాళులు అర్పిస్తోంది.

కుట్రకు తెరతీసిన పాకిస్తాన్

కార్గిల్ యుద్ధం అకస్మాత్తుగా ప్రారంభమైనది కాదు. 1999 ఫిబ్రవరిలోనే పాకిస్తాన్ సైన్యం రహస్యంగా 'ఆపరేషన్ బద్ర్' పేరుతో ఒక కుట్రకు శ్రీకారం చుట్టింది. పాకిస్తాన్ నార్తర్న్ లైట్ ఇన్‌ఫాంట్రీకి చెందిన సైనికులు మిలిటెంట్ల వేషంలో నియంత్రణ రేఖ దాటి భారత భూభాగంలోకి చొరబడ్డారు.

శీతకాలంలో మంచు కారణంగా ఖాళీగా ఉండే ఎత్తైన భారత సైనిక స్థావరాలను ఆక్రమించి, ద్రాస్, బటాలిక్, ముష్కోహ్, కాక్‌సర్, టోలోలింగ్, టైగర్‌హిల్ వంటి వ్యూహాత్మక ప్రాంతాల్లో స్థావరాలు ఏర్పాటు చేసుకున్నారు. ఈ కుట్ర వెనుక నాటి పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ జనరల్ పర్వేజ్ ముషారఫ్ కీలక పాత్ర పోషించినట్లు తరువాత వెలుగులోకి వచ్చింది.

గొర్రెల కాపరి ఇచ్చిన కీలక సమాచారం

1999 మే 3న బటాలిక్ ప్రాంతంలోని గార్ఖోన్ గ్రామానికి చెందిన గొర్రెల కాపరి తాషి నామ్‌గ్యాల్ అనుమానాస్పద కదలికలను గుర్తించి భారత సైన్యానికి సమాచారం అందించాడు. ఆ సమాచారంతో అప్రమత్తమైన సైన్యం గస్తీ బృందాలను పంపి, భారత భూభాగంలో శత్రు బంకర్లు, ఆయుధ నిల్వలు ఉన్నట్లు తెలుసుకుంది.

ఆపరేషన్ విజయ్... భారత సైన్య పరాక్రమం

భారత ప్రభుత్వం వెంటనే 'ఆపరేషన్ విజయ్'ను ప్రారంభించింది. భారత వైమానిక దళం 'ఆపరేషన్ సఫేద్ సాగర్' ద్వారా యుద్ధంలో భాగమైంది.

ఇది సాధారణ యుద్ధం కాదు. వేల అడుగుల ఎత్తైన మంచు పర్వతాలు, ఆక్సిజన్ కొరత, గడ్డకట్టే చలి మధ్య భారతసైనికులు అసాధారణ ధైర్యంతో పోరాడారు. పై నుంచి శత్రువు కాల్పులు జరుపుతున్నప్పటికీ, నిటారుగా ఉన్న పర్వతాలను ఎక్కుతూ ఒక్కో శిఖరాన్ని తిరిగి స్వాధీనం చేసుకున్నారు.

టోలోలింగ్ నుంచి టైగర్ హిల్ వరకు విజయ పరంపర

కార్గిల్ యుద్ధంలో టోలోలింగ్ శిఖరం కీలక మలుపుగా నిలిచింది. అనేక రోజుల భీకర పోరాటం తర్వాత,1999 జూన్ 13న భారత సైన్యం టోలోలింగ్‌ను తిరిగి స్వాధీనం చేసుకుంది. ఇక, టైగర్ హిల్ కోసం జరిగిన పోరాటం కార్గిల్ యుద్ధ చరిత్రలో చిరస్మరణీయ ఘట్టం. ఎత్తైన ఈ శిఖరంపై బలమైన స్థావరాలు ఏర్పాటు చేసుకున్న శత్రువును మన జవాన్లు ఎదిరించి, 1999 జూలై 4న అక్కడ తిరిగి త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు.

మేజర్ పద్మపాణి ఆచార్య



కెప్టెన్ విక్రమ్ బాత్రా

మేజర్ పద్మపాణి ఆచార్య బలిదానం

కార్గిల్ యుద్ధంలో తెలుగు నేలకు చెందిన పలువురు సైనికులు కూడా అపూర్వమైన ధైర్యసాహసాలు ప్రదర్శించారు. దేశ రక్షణ కోసం వారు తమ ప్రాణాలను అర్పించి తెలుగు రాష్ట్రాల గౌరవాన్ని పెంచారు.

హిమాలయ పర్వతాల్లోని మంచుకొండలు ఇప్పటికీ కొన్ని పేర్లను గర్వంగా పలుకుతుంటాయి. వాటిలో ఒకటి మేజర్ పద్మపాణి ఆచార్య. కార్గిల్ యుద్ధంలో శత్రువును ఎదిరిస్తూ ప్రాణాలను అర్పించిన ఈ వీరసైనికుడి జీవితం దేశభక్తి, కర్తవ్యనిష్ఠ, త్యాగానికి సజీవ నిదర్శనం. దేశం కోసం నవ్వుతూ ప్రాణాలు అర్పించిన అమరవీరుల్లో ఆయన స్థానం చిరస్మరణీయం.

టోలోలింగ్ ప్రాంతంలోని వ్యూహాత్మక స్థావరాలను తిరిగి స్వాధీనం చేసుకోవాల్సిన ఆపరేషన్‌లో ముందుండి ఆయన తన దళాన్ని నడిపించారు. శత్రువు విపరీతంగా కాల్పులు జరుపుతున్నప్పటికీ వెనుదిరగలేదు. తన సైనికుల్లో ధైర్యాన్ని నింపుతూ, ఒక్కో అడుగు ముందుకు వేస్తూ శత్రు స్థావరాలపై దాడిని సాగించారు.

యుద్ధం ఉధృతంగా సాగుతున్న సమయంలో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. అయినప్పటికీ తన ప్రాణాల గురించి ఆలోచించకుండా, లక్ష్యాన్ని చేజిక్కించుకోవడం పైనే దృష్టి పెట్టారు. చివరిశ్వాస వరకు పోరాడారు. చివరకు దేశం కోసం వీర మరణం పొందారు. ఆయన త్యాగం వల్ల భారత సైన్యానికి కీలకమైన విజయం సాధించే మార్గం సుగమమైంది.

మేజర్ పద్మపాణి ఆచార్య జీవితంలో మరో గొప్ప కోణం ఆయన రాసిన చివరి లేఖ. యుద్ధరంగం నుంచి తన కుటుంబానికి రాసిన ఆ లేఖలో ఆయన భగవద్గీత సందేశాన్ని ప్రస్తావిస్తూ, దేశం కోసం ప్రాణత్యాగం చేయడం కంటే గొప్ప అదృష్టం లేదని పేర్కొన్నారు. మేజర్ ఆచార్య వీరమరణం తర్వాత భారత ప్రభుత్వం ఆయనకు మహావీర్ చక్ర పురస్కారాన్ని ప్రదానం చేసింది. అది ఒక పతకం కాదు; ఆయన త్యాగానికి దేశం సమర్పించిన కృతజ్ఞతా నివాళి.

అమరవీరుల త్యాగానికి అజరామర గుర్తింపు

కార్గిల్ యుద్ధంలో 527 మంది భారత సైనికులు అమరులయ్యారు. వెయ్యికి పైగా గాయపడ్డారు. వారి త్యాగం వృథా కాలేదు. భారత సైన్యం శత్రువును తరిమికొట్టి దేశ గౌరవాన్ని కాపాడింది.

కెప్టెన్ విక్రమ్ బాత్రా, లెఫ్టినెంట్ మనోజ్ కుమార్ పాండే, గ్రెనేడియర్ యోగేంద్రసింగ్ యాదవ్, రైఫిల్‌మ్యాన్ సంజయ్‌కుమార్ వంటి పరమ వీర చక్ర గ్రహీతలతో పాటు వందలాదిమంది జవాన్లు చూపిన ధైర్యం తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తుంది. కార్గిల్ యుద్ధంలో భారత సైన్యం "దేశం ముందు... ప్రాణం తర్వాత" అనే భావనతో పోరాడింది. అందుకే కార్గిల్ విజయం భారత చరిత్రలో సువర్ణాక్షరాలతో నిలిచిపోయింది.

నేటి యువతకు కార్గిల్ యుద్ధం ఒక గొప్ప పాఠం చెబుతోంది. దేశభక్తి అంటే కేవలం జాతీయ పతాకాన్ని ఎగరవేయడం కాదు. ప్రతి ఒక్కరూ తమ తమ రంగాల్లో నిజాయతీగా పనిచేయడం, దేశ ప్రయోజనాలను కాపాడడం, జాతీయ సమైక్యతను బలోపేతం చేయడం కూడా దేశసేవే. సరిహద్దుల్లో సైనికులు చేసే త్యాగాలను గుర్తు చేసుకుంటూ, మన బాధ్యతలను నిర్వర్తించినప్పుడే వారికి నిజమైన గౌరవం ఇచ్చినవారమవుతాం. కార్గిల్ కొండలు నేడు నిశ్శబ్దంగా కనిపించవచ్చు. కానీ ఆ శిఖరాలు ఇప్పటికీ భారత జవాన్ల వీరగాథలను ప్రతిధ్వనిస్తూనే ఉన్నాయి.

జై హింద్!

- వనకల్ల వీరప్ప

శిబి చక్రవర్తి త్యాగం | కథ

శిబి చక్రవర్తి ధర్మం, దానం, కరుణకు ప్రసిద్ధి. ఆయన రాజ్యంలో సహాయం కోరినవారు ఎవరూ ఖాళీ చేతులతో తిరిగి వెళ్లేవారు కాదు. బలహీనులను కాపాడటమే రాజధర్మమని ఆయన నమ్మేవాడు.

ఒకరోజు శిబి చక్రవర్తి సభలో ఉండగా, భయంతో వణుకుతున్న ఒక పావురం ఎగిరివచ్చి ఆయన ఒడిలో వాలి, ఇలా అన్నది : "రాజా! ఒక డేగ నన్ను వెంటాడుతోంది. నన్ను కాపాడండి" అని వేడుకుంది.

కొద్దిసేపటికి డేగ అక్కడికి వచ్చింది. "రాజా, ఆ పావురం నా ఆహారం. మీరు దాన్ని కాపాడితే నా ఆకలి ఎలా తీరుతుంది?" అని ప్రశ్నించింది. శిబిచక్రవర్తి ఆలోచనలో పడ్డాడు. పావురాన్ని అప్పగిస్తే అది ప్రాణాలు కోల్పోతుంది. డేగకు ఆహారం ఇవ్వకపోతే అది ఆకలితో బాధపడుతుంది. ఇదొక ధర్మసంకటం. శిబికి ఒక ఆలోచన తట్టి, "ఈ పావురం బరువుకు సమానంగా నా శరీరం నుంచి మాంసం ఇస్తాను. దాన్ని తీసుకో" అని చెప్పాడు.

తూకం తీసుకొచ్చి ఒకవైపు పావురాన్ని, మరోవైపు శిబి చక్రవర్తి మాంసాన్ని కోసి పెట్టడం ప్రారంభించారు. ఎంత మాంసం పెట్టినా పావురం బరువుకు సరిపోలేదు. చివరికి ఆయనే స్వయంగా త్రాసులో కూర్చొన్నారు.అప్పుడు పావురం, డేగ తమ నిజరూపాలతో ప్రత్యక్షమయ్యాయి. శిబి చక్రవర్తి ధర్మాన్ని పరీక్షించడానికి వచ్చిన దేవతలు, ఆయన త్యాగాన్ని చూసి సంతోషించారు.

"బలహీనుడిని కాపాడేందుకు తన ప్రాణాన్నే అర్పించగల రాజే నిజమైన ధర్మరాజు" అని ఆశీర్వదించారు. ★

మంచిమాట

మనిషిలో జ్ఞానం
పెరిగేకొద్ది తనలోని
అజ్ఞానం తెలిసివస్తుంది

మెదడుకు మేత

పచ్చటి పెట్టె, తెల్లటి
ముత్యాలు, నల్లటి గింజలు.
ఏంటది?

ఎంపిక : ఉమాదేవి

పద్యం

ఉపకారికి నుపకారము
విపరీతము కాదు సేయ వివరింపంగా
నపకారికి నుపకారము
నెపమెన్నక సేయువాడె నేర్పరి సుమతీ

భావం : మనకు మేలు చేసినవారికి తిరిగి మేలు చేయడం సాధారణ విషయం. కానీ మనకు కీడు చేసినవారికీ సహాయం చేయగలగడం గొప్ప గుణం. అలాంటి మనిషికి ఓర్పు, దయ, పెద్దమనసు ఉంటాయి. అందుకే అతడే నిజమైన నేర్పరి.

శ్లోకం

కర్తవ్యమాచరం కామకర్తవ్యమనాచరమ్
తిష్ఠతి ప్రాకృతాచారో యస్యః ఆర్య ఇతి స్మృతః

భావం : తప్పక చేయవలసిన పనులు, తప్పనిసరి అయినా చేయకూడని పనులు ఉంటాయి. అది తెలిసి నడచుకోవడాన్నే ధర్మం అంటారు. అలాంటి ధర్మాన్ని ఆచరించే వాడినే 'ఆర్యుడు' అంటారు. ఇక్కడ...ఆర్యులు అంటే ఒక ప్రత్యేక జాతి కాదని పెద్దలు చెబుతారు.

జతపరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

పువ్వు	లోతు
విత్తనం	స్థిరత్వం
పండు	అందం
పర్వతం	ఫలితం
సముద్రం	ప్రారంభం

ఎంపిక : ఉమాదేవి

నిర్వహణ : నయనశ్రీ

శాస్త్రవేత్తలు

నీల్స్ బోర్



డెన్మార్క్‌కు చెందిన గొప్ప భౌతిక శాస్త్రవేత్త నీల్ బోర్ 1885లో జన్మించారు. పరమాణువు ఎలా ఉంటుంది? ఎలక్ట్రాన్లు న్యూక్లియస్ చుట్టూ ఎలా తిరుగుతాయి? అనే విషయాలను పరిశోధించడంలో ఆయన చాలా కీలక పాత్ర పోషించారు. ముఖ్యంగా 'Bohr Atomic Model' వల్ల ఆయన చాలా ప్రసిద్ధి చెందారు. ఈ మోడల్ ప్రకారం, పరమాణువులో ఎలక్ట్రాన్లు న్యూక్లియస్ చుట్టూ నిర్దిష్టమైన ఎనర్జీ లెవల్స్‌లో తిరుగుతాయి. ఎలక్ట్రాన్ ఒక లెవల్ నుంచి మరో లెవల్‌కి వెళ్లినప్పుడు ఎనర్జీని గ్రహిస్తుంది లేదా విడుదల చేస్తుంది. ఆయన చేసిన పరిశోధనలు క్వాంటం ఫిజిక్స్ అభివృద్ధికి బలమైన పునాది వేశాయి.ఆయనకు 1922లో నోబెల్ బహుమతి లభించింది.

జనరల్ నాలెడ్జ్

1. వైభవ్ సూర్యవంశీ ఏ రంగానికి చెందిన క్రీడాకారుడు?
2. మాస్కో ఏ దేశానికి రాజధాని?
3. 'రామచరిత మానస్'ను ఎవరు రచించారు?

సమాధానాలు : 1. క్రికెట్; 2. రష్యా; 3. తులసీదాస్

భక్తాగ్రేసరులు

కాన్హోపాత్రా

మహారాష్ట్రలోని షోలాపూర్ జిల్లా మంగలవేడ్‌లో పదిహేనో శతాబ్దంలో జన్మించిన కాన్హోపాత్రా మహాభక్తురాలు. విలాసవంతమైన జీవితాన్ని తృణప్రాయంగా త్యజించి పాండురంగడి చరణాలను ఆశ్రయించింది. అనేక అభంగాలు రాసింది.

అత్యంత ధనికురాలైన వేశ్య శ్యామా, కుటుంబ నేపథ్యానికి అనుగుణంగా కూతురు కాన్హోకు నృత్యగానాలు నేర్పించింది. కాన్హోపాత్రను పొందేందుకు ఎందరో సంపన్నులు ఎంతో ధనం ఆశచూపారు. అలాంటి వారి నుంచి తప్పించుకునే క్రమంలో పనిమనిషి సహకారంతో పండరీపురం చేరుకుంది. అక్కడి పాండురంగడి ఆలయాన్ని శుభ్రపరుస్తూ, నృత్యగీతాలతో ఆరాధించేది. ఆమె సమాచారం తెలిసిన మంగలవేడ్‌కుచెందిన సంపన్నుడు సదాశివ మలగుజర్, బీదర్ నవాబుకు అమె అందచందాలను వివరించి, పురికొల్పాడు. నవాబు ఆజ్ఞతో ఆయన సైనికులు ఆమెను తీసుకు వెళ్లేందుకు వస్తారు. స్వామిని ప్రార్థించి వస్తానను గర్భాలయంలోకి వెళ్లిన ఆమె స్వామి పాదాలపై వాలిపోయి, భగవానుడిలో లీనమైపోయింది.

వారఫలాలు

20-26 జూలై 2026

సింహంభట్ల సుబ్బారావు
6300674054

మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం

వాహనాలు, గృహం కొనుగోలు చేస్తారు. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది. రుణ విముక్తులవుతారు. మరింతగా లాభాలు గడిస్తారు. ఉద్యోగులు కొన్ని చిక్కులు తొలగి ఊరట చెందుతారు. కళాకారులకు అవకాశాలు అప్రయత్నంగా దక్కుతాయి. రచయితలు, వైద్యులకు ఊహించని అవకాశాలు. 25,26 తేదీల్లో బంధువులతో తగాదాలు. ప్రయాణాలు చేస్తారు. శ్రీ కృష్ణస్తుతి మంచిది.

వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు

కొన్ని కార్యక్రమాలు అప్రయత్నంగా పూర్తి కాగలవు. ఆరోగ్యసమస్యల నుంచి ఉపశమనం పొందుతారు. వ్యాపార, వాణిజ్యవేత్తలకు ఆశించిన లాభాలు తథ్యం. ఉద్యోగులకు ఉన్నత పోస్టులు దక్కవచ్చు. కళాకారులకు కొన్ని వివాదాలు తీరతాయి. వైద్యులు,క్రీడాకారులకు సంతోషకరమైన సమాచారం. రచయితలు,పరిశోధకులకు వివాదాలు పరిష్కారమవుతాయి. 20,21తేదీల్లో ప్రయాణాలు. స్వల్ప రుగ్మతలు. మేధా దక్షిణామూర్తి స్తుతి మంచిది.

మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు

ఎంతో కాలంగా వేధిస్తున్న ఆరోగ్య సమస్య నుంచి ఊరట లభిస్తుంది. వ్యాపార, వాణిజ్య వేత్తలకు పెట్టుబడులు సకాలంలో అందుతాయి. లాభాలు అనూహ్యంగా దక్కుతాయి. ఉద్యోగులకు ఒడిదుడుకులు తొలగుతాయి. పారిశ్రామికవేత్తలు సంతోషకరమైన సమాచారం అందుకుంటారు. రచయితలు, క్రీడాకారులకు ఉత్సాహవంతంగా ఉంటుంది. 22,23 తేదీల్లో దూరప్రయాణాలు. ఒప్పందాలు రద్దు. శ్రీ ఆంజనేయ ప్రార్థన చేయండి.

కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష

భూవివాదాలు పరిష్కారమవుతాయి. స్థిరాస్తి కొనుగోలు చేస్తారు. వ్యాపారులు, వాణిజ్యవేత్తలకు లాభాలు అందుతాయి. కొత్త సంస్థలు ఏర్పాటు చేస్తారు. ఉద్యోగులకు నూతనోత్సాహం, విధుల్లో ఆటంకాలు తొలగుతాయి. పారిశ్రామికవేత్తలకు అనూహ్య అవకాశాలు. కళాకారులు, రచయితల శ్రమఫలిస్తుంది. 23,24 తేదీల్లో ఆకస్మిక ప్రయాణాలు. బంధువులతో విభేదాలు. శ్రీ సూర్య ప్రార్థన చేయండి.

సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం

కొద్దిపాటి అనారోగ్యం, తద్వారా ఔషధసేవనం. వ్యాపారస్తులు, వాణిజ్యవేత్తలకు సామాన్య లాభాలు దక్కుతాయి, ఊహించని మార్పులు ఉండవచ్చు. పారిశ్రామికవేత్తలకు కాస్త అనుకూలమైన కాలమనే చెప్పాలి. రచయితలు, క్రీడాకారులకు పరీక్షాకాలంగా ఉన్నా క్రమేపీ సర్దుబాటు కాగలవు 22,23 తేదీల్లో శుభవార్తలు. వాహనసౌఖ్యం. ముఖ్య నిర్ణయాలు. ధన్వంతరీ స్తోత్రం పఠించండి.

కన్య : ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు

కొత్త కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. కొన్ని సమస్యలు వాటంతట అవే పరిష్కారమవుతాయి. వ్యాపారులకు అనుకున్న లాభాలు అందుతాయి. ఉద్యోగులకు విధుల్లో అవరోధాలు తొలగుతాయి. పారిశ్రామికవేత్తల యత్నాలు సఫలం. రచయితలు, క్రీడాకారులకు మరింత సానుకూలమైన సమయం. 24,25 తేదీల్లో దూరప్రయాణాలు. బంధువులతో తగాదాలు. విష్ణుధ్యానం చేయండి.

తుల : చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు

సేవాకార్యక్రమాలలో చురుగ్గా పాల్గొంటారు. ఆకస్మిక ధనలాభం. ఒక సుదీర్ఘ వివాదం చాక చక్యంగా పరిష్కరించుకుంటారు. వాణిజ్య, వ్యాపార వేత్తల కృషిఫలిస్తుంది. ఉద్యోగస్తులకు ఉన్నత పోస్టులు. కళాకారులకు పురస్కారాలు. పరిశోధకులు, వైద్యులకు మంచిగుర్తింపు లభిస్తుంది. 20,21 తేదీల్లో అనారోగ్యం. నిర్ణయాలు మార్చుకుంటారు. లక్ష్మీ నృసింహస్తోత్రాలు పఠించండి.

వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ

గృహ, వాహనాలు కొనుగోలు యత్నాలు సఫలం. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. వ్యాపారులు కొత్త పెట్టుబడులు నమకూర్చుకుంటారు. ఉద్యోగులకు కొత్త హోదాలు లభిస్తాయి. రాజకీయ వర్గాలకు నూతనోత్సాహం. పరిశోధకులు, వైద్యుల సేవలకు విశేష ఆదరణ లభిస్తుంది. 23,24 తేదీల్లో వృథా ఖర్చులు. మానసిక అశాంతి. ద్వాదశ సూర్య నమస్కారాలు చేయండి.

ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం

ధార్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. ఇతరులకు చేయూతనందించి ప్రశంసలు పొందుతారు. శుభకార్యాలపై చర్చలు సఫలం. ఉద్యోగులకు శ్రమానంతరం ఫలితం కనిపిస్తుంది. పారిశ్రామిక వేత్తలకు శుభవార్తలు అందుతాయి. రచయితలు, క్రీడాకారుల యత్నాలు సఫలం 24,25 తేదీల్లో ఇంటాబయటా చికాకులు. అనారోగ్య సూచనలు. నవగ్రహ స్తోత్రాలు పఠించండి.

మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు

పాత సంఘటనలు గుర్తుకు తెచ్చుకుంటారు. కాంట్రాక్టులు దక్కించుకుంటారు. విద్యార్థులకు అనుకూల పరిస్థితి. ఇంటి నిర్మాణయత్నాలలో పురోగతి. వ్యాపారులకు క్రమేపీ లాభాలు అందుతాయి. ఉద్యోగులకు అదనపు బాధ్యతలు దక్కే అవకాశాలు. కళాకారులకు కొత్త అవకాశాలు. రచయితలు, క్రీడాకారులకు పేరుప్రతిష్ఠలు దక్కుతాయి. 20,21 తేదీల్లో స్వల్ప అనారోగ్యం. కుటుంబంలో కలహాలు. శ్రీరామ ధ్యానం మంచిది.

కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు

కాంట్రాక్టర్లు అనుకున్న టెండర్లు దక్కించుకుంటారు. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. వ్యాపారులకు విస్తరణ కార్యక్రమాలలో విజయం. ఉద్యోగులకు మంచి గుర్తింపు లభిస్తుంది. పారిశ్రామికవేత్తలకు ఉత్సాహవంతమైన కాలం. కళాకారులు, క్రీడాకారులకు ప్రోత్సాహకరంగా ఉంటుంది. 22,23 తేదీల్లో బంధువులతో తగాదాలు. కష్టానికి ఫలితం కనిపించదు. ద్వాదశ జ్యోతిర్లింగ స్తోత్రం పఠించండి.

మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి

చేపట్టిన కార్యక్రమాలు చకచకా పూర్తి కాగలవు. విద్యార్థులకు అనుకూల ఫలితాలు ఉత్సాహన్నిస్తాయి. గృహ నిర్మాణయత్నాలు కలసి వస్తాయి. వ్యాపారులకు మరింత లాభాలు అందే సూచనలు. ఉద్యోగులకు పరిస్థితులు అనుకూలిస్తాయి. పారిశ్రామికవేత్తలకు ఉత్సాహవంతంగా ఉంటుంది. క్రీడాకారులు, పరిశోధకులకు అనుకున్న అవకాశాలు దక్కుతాయి. 23,24 తేదీల్లో బంధువిరోధాలు. చోరభయం. లలితాదేవిస్తుతి మంచిది.

పదరసం-573



ఆధారాలు

అడ్డం

1. అర్జునుడి శంఖం పేరు (4)
3. గూఢచారి (2)
4. మొదటి, ఒక వారం (2)
5. ప్రభువు, రాజు (2)
6. నెపం, పోషణ (2)
7. గౌరీపతి వాహనం (2)
8. కుమారుడి భార్య (3)
11. సత్యం (2)
13. దేవత/దేవుడు (3)
14. శివదాజ్ఞ లేనిదే ఇది కూడా కుట్టదట (2)
15. మనస్సు, వక్షస్థలం (2)
16. చూచి, ప్రసవించి (2)
18. ఇది బలీయమట (2)
19. తీరం, ఒడ్డు (2)
21. ధర, వెల (3)
22. ప్రమాదం (2)
24. సంతోషం,వేడుక (3)
26. బావి (2)
27. ఎల్ల, సమీపం (2)
29. సంసారం (3)
31. శరీరం (2)
32. శకుంతల తల్లి తడబడింది (3)

నిలువు

1. శుక్రాచార్యుని కుమార్తె (4)
2. సాక్షాత్కారం, చూపు (3)
3. ప్రార్థన, విన్నపం (4)
4. పత్రం (2)
6. సంవత్సరం (2)
9. భూమే..అక్షరాలు తారుమారు (3)
10. వైణికుడు శంకరశాస్త్రి ఇంటిపేరు (3)
12. భయం, సంకోచం (2)
13. వేదాలను బాగా ఎరిగినవాడు (5)
14. తిమిరం (3)
17. పర్వతం/కొండ కొన (3)
19. ఒప్పు కాదు...(2)
20. అసంబద్ధం, అర్థరహితం (4)
22. పూర్వం, గతం (3)
23. వానరసైన్యం (4)
25. పాఠశాల (2)
28. కంచే దీనిని మేస్తే (2)
29. విశ్వనాథ క్షేత్రం (2)
30. చెయ్యి...తిరగబడింది (2)

పదరసం - 572 సమాధానాలు

1 తు	2 ల	సి		3 య	శో	ద		4 కం	5 చి
	క్ష్మ		6 సా	మ			7 రు	చు	లు
8 ద్రో	ణు	డు			9 నా	10 ము	షి		క
	డు		11 సిం		12 కం	ద		13 ప	
14 సు		15 శృం	గా	రం		16 ము	17 దు	స	18 లి
19 ర	థం		రం		20 మం		రా		వా
భి		21 బ		22 ప	త్రి		23 లో	తు	
		24 స	త	తం		25 ల్ల	చ		26 హా
27 పం	28 కం			29 గం	30 ప		న		రి
31 తం	బు	ర			32 రం	ధ్రం		33 వా	ణి

కథకు, పేరుకు సంబంధంలేని LENIN



కొన్ని సినిమాలకు కొన్ని పేర్లు ఎందుకు పెడతారో అర్థం కాదు. అక్కినేని నాగేశ్వరరావు మనవడు, నాగార్జున తనయుడు అఖిల్ సినిమాకు 'లెనిన్' అనే పేరు పెట్టగానే ఇదేదో కమ్యూనిస్టుల కుటుంబానికి సంబంధించిన కథేమో అని చాలామంది భావించారు. అయితే ఈ సినిమా ట్రైలర్ చూసిన తర్వాత ఈ టైటిల్‌కు సినిమాకు సంబంధం లేదేమిటనే భావన కలిగింది. కథతో సంబంధం లేని టైటిల్ దర్శక నిర్మాతలు ఎందుకు పెట్టారో అర్థం కాక ప్రేక్షకులు తలలు పట్టుకుంటున్నారు.

అక్కినేని అఖిల్ దాదాపు పదకొండేళ్ల క్రితం 'అఖిల్' అనే సినిమాతో హీరోగా ఎంట్రీ ఇచ్చాడు. దానికి ముందు అతను బుల్లిబుల్లి అడుగులు వేస్తున్న వయసులోనే నాగార్జున 'సిసింద్రీ' అనే సినిమాను నిర్మించారు. దానితో లెక్కపెడితే అఖిల్ నటించిన ఏడో చిత్రం 'లెనిన్'. ఇంతవరకూ గ్రాండ్ విక్టరీని అందుకోని అఖిల్ ఈ సినిమాతో కచ్చితంగా విజయం సాధిస్తాడని అందరూ భావించారు. అయితే ఈ తాజా చిత్రమూ డివైడ్ టాక్‌తోనే సాగుతోంది.

కథ విషయానికి వస్తే ఇది చిత్తూరులోని శ్రీరామపురంలో దాదాపు పాతికేళ్ల క్రితం జరిగే కథ. ఆ గ్రామంలో భారతం మిట్ట పేరుతో ప్రతి యేడాది ద్రౌపదిమాత జాతరను చేస్తుంటారు. అక్కడ పెద్దరికం అంతా నాదముని భార్య జయంతి (ఈశ్వరీరావు)దే. ఏడెనిమిదేళ్ల వయసులో అనాథగా ఆ ఊరిలోకి అడుగుపెడతాడు లెనిన్ (అఖిల్ అక్కినేని). అతనికి ఆ పేరు ఎవరు పెట్టారు? ఎందుకు పెట్టారు? అనేది ఎక్కడా దర్శకుడు మనకు చెప్పడు. ఆ పిల్లాడిని జయంతి చేరదీసి, తన కొడుకు వసంత్ (ప్రమోద్ పంజు)తో పాటే పెంచి పెద్ద చేస్తుంది. సొంతకొడుకు డాక్టర్ అయితే, లెనిన్ మాత్రం నిశానిగా ఊరిలోనే మిగిలి పోతాడు. అదేమి చిత్రమో అర్థం కాదు! లెనిన్ యుక్త వయసు వచ్చిన తర్వాత మావ వరస అయ్యే నీలకంఠం (రాంకీ) రెండో కూతురు, ఇంజనీరింగ్ చదివిన భారతి (భాగ్యశ్రీ బోర్సే)తో ప్రేమలో పడతాడు. పెద్దల అంగీకారంతో పెళ్లిచేసుకోవాలని అనుకుంటున్న సమయంలో అయినవాళ్ల నుంచి కూడా అనుకోని అవాంతరాలు ఎదురవుతాయి. ఆ గ్రామంలో పైకి కనిపించని మహాభారత యుద్ధమే జరుగుతూ ఉంటుంది. ఆ కారణంగా తాను పెళ్లాడాల్సిన భారతిని ఒకానొక సమయంలో చేజార్చుకోబోతాడు. ఆ తర్వాత వసంత్ పెద్ద మనసుతో తిరిగి పెళ్లి చేసుకుంటాడు. అయితే ఊహించని ఎత్తులు పై ఎత్తులు, కుయుక్తుల కారణంగా ఆమెను కోల్పోయి, లెనిన్ జైలుకు వెళతాడు. అతను జైలుకు వెళ్లడానికి కారకులు ఎవరు? జైలు నుంచి వచ్చిన తర్వాత తన పగను ఎలా తీర్చుకున్నాడు? అనేది మిగతా కథ.

మహాభారతంలో అధికారం కోసం అన్నదమ్ములు సాగించే కురుక్షేత్ర యుద్ధాన్ని తలపించే పలు సన్నివేశాలు 'లెనిన్'లోనూ ఉన్నాయి. ప్రతి పాత్ర వెనుక డార్క్ షేడ్స్ కనిపిస్తుంటాయి. నిజం చెప్పాలంటే ఇందులో పాజిటివ్ కంటే నెగెటివ్ క్యారెక్టర్స్ ఎక్కువ. కాకపోతే దర్శకుడు మురళీ కిశోర్ అబ్బూరు తనకు అనుగుణంగా ఆ పాత్రలను మార్చేసుకుంటూ వెళ్లిపోయాడు. ఏ పాత్ర ఎందుకు, ఎలా స్పందిస్తుందో అర్థం కాదు. కొన్ని పాత్రలు అయితే చిత్రాతిచిత్రంగా ప్రవర్తిస్తుంటాయి. కొన్ని పాత్రలు ఔచిత్యానికి భిన్నంగా వ్యవహరిస్తుంటాయి. ఓ ట్రాన్స్‌లో రాసుకున్న కథను,అదే ట్రాన్స్‌లో సినిమాగా తీశారని ,ప్రేక్షకులను సంభ్రమకు గురిచేయాలనే ఏకైక లక్ష్యంతో దర్శకుడు కథను అలా రాసుకున్నారనిపిస్తుంది. నిజానికి హీరో ఎందుకు జైలుకు వెళ్లాల్సి వచ్చిందనేది చెప్పకుండా ఇంటర్వెల్ వరకూ దర్శకుడు కథను బాగానే నడిపేశాడు.

హీరో శత్రువులంతా ఒకచోటకు చేరిన తర్వాత అతను వారిపై పగ తీర్చుకోవడమే ఇక మిగిలింది అనుకుంటూ ఉండగా, మళ్లీ కథలోని పాత్రలు, వాటి నిజస్వరూపాలను తెలియచేస్తూ ద్వితీయార్థాన్ని ప్రారంభించాడు. ఊహించని మలుపులతో కథను క్లయిమాక్స్ వరకూ తీసుకెళ్లిన దర్శకుడు హీరోకి ఉన్న ఓ బలహీనతను రివీల్ చేసి ప్రేక్షకులను షాక్‌కు గురిచేస్తాడు.హీరోలను దివ్యాంగులుగా ఇటీవల వచ్చిన కొన్ని సినిమాల్లో చూసిన ప్రేక్షకులు పెదవి విరుస్తున్నారు తప్పితే మరొకటి కాదు. అలానే హీరో, హీరోయిన్లకు సంబంధించిన కీలక సన్నివేశాన్ని చూస్తే 'కృష్ణబాబు' సినిమాలోని సీన్ గుర్తొస్తుంది.

నటీనటుల విషయానికి వస్తే...అఖిల్ అక్కినేని తన పాత్రకు న్యాయం చేకూర్చాడు. మూడేళ్ల క్రితం వచ్చిన 'ఏజెంట్' సినిమా కోసం కూడా అతను బాగానే కష్టపడ్డాడు. కానీ ఆ సినిమా ఆశించిన స్థాయిలో విజయాన్ని అందుకోలేదు. గత చిత్రాలతో పోల్చితే నటనలో కాస్తంత పరిణతి కనిపిస్తుంది. భాగ్యశ్రీ బోర్సే తన పాత్రను రక్తికట్టించింది. కన్నడ నటుడు ప్రమోద్ పంజు ఇందులో కీలక పాత్ర పోషించాడు. ఇతర ప్రధాన పాత్రలను ఈశ్వరీరావు, శివాజీ, బ్రహ్మాజీ, సునీల్, శత్రు, రాంకీ, వడ్లమాని సాయిశ్రీనివాస్, గెటప్ శ్రీను, ప్రవీణ్ తదితరులు పోషించారు. తమన్ స్వరపర్చిన పాటలు ఏమంత పాపులర్ కాలేదు. నేపథ్య సంగీతం ఓకే. లియోన్ బ్రిట్టో సినిమాటోగ్రఫీ, నవీన్ నూలి ఎడిటింగ్ బాగున్నాయి. దాదాపు సినిమా అంతా జాతర నేపథ్యంలోనే జరగడంతో ప్రతి ఫ్రేమ్‌లోనూ యాభై, వందమందివరకూ ఉంటూనే ఉన్నారు. ఖర్చు విషయంలో నిర్మాతలు నాగార్జున, నాగవంశీ వెనకాడలేదు. ఈ వారంతో పాటు వచ్చే వారం కూడా పెద్ద సినిమాలు ఏమీ లేకపోవడం 'లెనిన్'కు కొంత మేరకు ఉపయోగపడొచ్చు. ఏదేమైనా,అఖిల్ గత చిత్రాలతో పోల్చితే...ఈ సినిమాకు మంచి ఓపెనింగ్సే వచ్చాయి. ఆ రకంగా అక్కినేని అభిమానులకు 'లెనిన్' కొంత ఊరటనిస్తోంది.

– అరుణ, సీనియర్ ఫిల్మ్ జర్నలిస్ట్

జాతీయ భావాలను మేల్కొల్పే ఉత్తమ సాహిత్యం
మీరు తప్పక చదివి, పదిమందిచే చదివించదగిన పుస్తకాలు



వెల : ₹.150/-



వెల : ₹.60/-

వెల : ₹.270/-

వెల : ₹.80/-



వెల : ₹.54/-

వెల : ₹.120



వెల : ₹.80



వెల : ₹.250/-

వెల : ₹.180/-

వెల : ₹.200/-



వెల:₹.999/- సెట్



వెల:₹.450/-



వెల :₹.699/-



వెల : ₹.400/-



వెల : ₹.99/-

పై పుస్తకములకు మరియు కొత్త, పాత నవయుగ భారతి ప్రచురణలకై సంప్రదించండి..

ఫోన్ ద్వారా మీకు కావలసిన పుస్తకాలు తెలియజేయండి! రిజిష్టరు పోస్టులో అందుకోండి!!

సాహిత్య నికేతన్ : కేశవనిలయం, బర్కత్‌పురా. 040-27563236, 9290127329, 8179163138

సాహిత్య నికేతన్ : వై.ఎం.ఐ.ఎస్. బిల్డింగ్, సిబిఐ ఆఫీస్ రోడ్, కోఠీ, హైదరాబాద్. 9440589722,

సాహిత్య నికేతన్ : ఏలూరు రోడ్, రామమందిరంవీధి, గవర్నరు పేట, విజయవాడ - 2. 8333812687

From: JAGRITI Telugu Weekly
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2024-2026; RNI Regd. No. 3270/57.
Volume : 78 Issue : 40

G. PULLA REDDY
DEGREE & P.G. COLLEGE

(Affiliated to Osmania University)

MEHDIPATNAM, HYDERABAD - 28

Ph : 23513154

English Medium Estd 1994 **Co-Education**

(A College Striving for Excellence in Quality Education)

COURSES OFFERED

B.Sc (M.S.Cs) (M.P.Cs) (M.E.Cs)

B.B.A

B.Com (Computers Applications)

M.Sc (Mathematics) (Physics)

WE HAVE : ✦ Well Equipped Labs & Library ✦ Qualified & Experienced Faculty ✦ Well Furnished Classrooms ✦ Campus Placements

For Details contact office between *10.00 A.M. & 5.00 P.M*

PRINCIPAL